V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

సోమవారం

22-07-2024

సంపుటి : 01 | సంచిక : 79 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ CMD

## తెలంగాణలో రూ.700 కోట్ల పెట్టుబడి

- అల్యూమినియం టిన్నుల యూనిట్ ఏర్పాటు
- 500 మందికి ఉపాధి, ఉద్యోగాలు
- ముందుకు వచ్చిన 'బాల్' ఇండియా కంపెనీ
- మంత్రి శ్రీధర్ బాబుతో ఆ కంపెనీ అధిపతి గణేశన్ భేటీ



2

## తొలిసారి భారత్ ఆతిథ్యం

- యునెస్కో ప్రపంచ వారసత్వ కమిటీ సెషన్‌కు హాజరైన మంత్రి జూపల్లి
- జులై 21 - 31 వరకు న్యూఢిల్లీ వేదికగా సమావేశాలు



2

## ఇందిరమ్మ ఇళ్లపై ప్రాసెస్ జరుగుతోంది

- త్వరలో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటన



**విశ్వంభర, హైదరాబాద్:** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆగస్టులో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రజలకు అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రాసెస్ జరుగుతుంద ని, తప్పనిసరిగా మిగతా2లో...

రాజకీయ విమర్శలు కట్టిపెట్టి

## కాళేశ్వరాన్ని పునర్ వినియోగంలోకి తేవాలి

- ఉత్తమ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు
- మేడిగడ్డకు ఎన్డీఎస్ఏ నిర్లక్ష్యం, ప్రభుత్వ వైఫల్యమే కారణం
- మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర ఆగ్రహం



2



# మూసీ @ ₹1.50 లక్షల కోట్లు

మొదట రూ.50 వేల కోట్లు ప్రకటించిన సర్కార్

ఆ తర్వాత రూ.70 వేల కోట్లకు సవరింపు

తాజాగా రూ.1.50 లక్షల కోట్లకు పెంపు

కాళేశ్వరం ప్రాజెక్ట్ కంటే డబుల్ బడ్జెట్

విస్మయం వ్యక్తం చేసిన మాజీ మంత్రి కేటీఆర్

కాంగ్రెస్ ధనదాహానికి నిదర్శనం అంటూ ట్వీట్

## అమాంతం పెరిగిన మూసీ సుందరీకరణ అంచనాలు

**విశ్వంభర, హైదరాబాద్ :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మూసీ నది ప్రక్షాళన బడ్జెట్ అంచనాలను మాటిమాటికీ పెంచడంపై ప్రభుత్వాన్ని విమర్శించారు. పాలమూరురంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌తో సహా ఇతర నీటిపారుదల ప్రాజెక్టుల కంటే నదుల సుందరీకరణ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడమేంటని ఆయన ప్రశ్నించారు. తక్కువ బడ్జెట్ లో పూర్తయ్యి ఎక్కువమందికి ప్రయోజనం చేకూర్చే నీటిపారుదల ప్రాజెక్టులకంటే మూసీ ప్రక్షాళన కోసం భారీగా బడ్జెట్ ప్రతిపాదనలు చేయడం పట్ల కేటీఆర్ విస్మయం వ్యక్తం చేశారు.

**థీమ్ ఏంటి? గేమ్ ప్లాన్ ఏంటి?**

ఆదివారం ఆయన మాట్లాడుతూ... "మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టు వ్యయం రూ.50,000 కోట్లుగా అంచనా వేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆ తర్వాత రూ.70,000 కోట్లకు సవరించింది. తాజాగా, ముసాయిదా ప్రణాళికలు సిద్ధం కాకముందే మిగతా2లో...

## ప్రాజెక్టులకు పోటెత్తిన వరద

### నిండు కుండల్లా మారిన ప్రాజెక్టులు



- గరిష్ట స్థాయికి నీటిమట్టాలు
- భద్రాచలంలో మొదటి ప్రమాద హెచ్చరిక
- నిండుకుండలా జూరాల
- నాగార్జునసాగర్ , శ్రీశైలంలకు భారీగా ఇన్ ఫ్లో
- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల్లో నీటి ప్రాజెక్టులు నిండు కుండల్లా మారాయి. ఎడదెరపి లేని వర్షాలు, ఎగువ నుంచి వస్తోన్న వరదలతో గోదావరి, కృష్ణా ప్రాజెక్టుల్లో నీటిమట్టం గరిష్టానికి చేరుకుంది. భద్రచాలం దగ్గర గోదావరి మిగతా2లో...



2

## రేవంత్ అంకుల్... మా ప్రాణాలకు రక్షణ ఏది?

- ప్లకార్డులతో పోలీస్ స్టేషన్ ఎదుట చిన్నారుల నిరసన
- కొంపల్లి మున్సిపల్ కమిషనర్, చైర్మన్‌లపై ఫిర్యాదు
- వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి

## ఏ టు జడ్.. సీతక్క!

- ఫస్ట్ మాజీ నక్సలైట్..
- ఆ తరువాత మంత్రి పదవీ..
- ట్విట్టర్ అకౌంట్ లో సీతక్క మార్క్..!
- వెరైటీగా డిసిగ్నేషన్ లిస్ట్



2



2

## ఉగ్రవాదం అణచివేసిన ఘనత మోడీదే

### కాంగ్రెస్ పాలనలో స్కాంలు, బాంబుల మోతలే..

- ఎవరెన్ని కుట్రలు చేసినా మోడీ మూడోసారి ప్రభంజనం సృష్టించారు
- హైదరాబాద్ జిల్లా కార్యకర్తల సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

## రేవంత్ ఢిల్లీ టూర్ మతలబేంటి?

### 7 నెలల్లో 21 సార్లు ఢిల్లీకి పయనం

రాష్ట్రంలో ఢిల్లీ పాలన అంటూ బీఆర్ఎస్ సెటైర్లు

ఈసారి సీఎం టూర్‌లో ఉండే అంశాలు ఇవ్వేనా..?

రుణమాఫీపై జాతీయ స్థాయిలో చర్చ

మంత్రివర్గ విస్తరణ, పీసీసీ చీఫ్ పదవుల భర్తీ

వరంగల్ కృతజ్ఞత సభకు రాహుల్‌కు ఆహ్వానం



**విశ్వంభర, హైదరాబాద్:**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. సీఎం అయిన తర్వాత ఏడు నెలల కాలంలో 20 సార్లు ఢిల్లీ వెళ్లిన రేవంత్, ఇవాళ 21 వ సారి ఢిల్లీ వెళ్లడం వెనక మతలబేంటని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోంది. రాష్ట్రంలో ఢిల్లీ పాలన అంటూ విమర్శిస్తోంది. ఇవన్నీ పక్కన పెడితే ఈసారి రేవంత్ ఢిల్లీ టూర్ లో కొన్ని ముఖ్యమైన పనులు చక్కబెట్టుకురానున్నారని తెలుస్తోంది.

**రాహుల్‌కి ఆహ్వానం...**

రైతు రుణమాఫీ అమలు చేస్తున్న నేపథ్యంలో వరంగల్ కృతజ్ఞత సభ నిర్వహించాలని తెలంగాణ సర్కార్ భావిస్తోంది. ఈ సభకు రావాలని కాంగ్రెస్ పెద్దలను ఆహ్వానించనున్నారు. ఇప్పటికే ఢిల్లీలో ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ లతో కలసి రాహుల్ గాంధీతో మిగతా2లో...

## వాడుకొని వదిలేశారు?

- పీఆర్ స్టంట్ కోసమే మీద మీద యాది చేసిండు
- రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో నా వూసే ఎత్తలేదు
- నా రెండు దరఖాస్తులు ఉన్నయో, చెత్త బుట్టలోకి పోయాయో..
- అడుక్కునే వారికి ఇచ్చిన విలువ కూడా నాకు ఇవ్వట్లేదు
- సీఎం రేవంత్ పై మాజీ డీఎస్పీ నళిని వివాదాస్పద పోస్ట్



3

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 112 | ₹ 134 |
| **స్కిన్** | **స్కిన్‌లెస్** |
| ₹ 194 | ₹ 221 |



# తెలంగాణలో రూ.700 కోట్ల పెట్టుబడి

విశ్వంభర, హైదరాబాద్ : బీర్లు, శీతల పానీయాలు, పర్ ఫ్యూముల ఇండస్ట్రీకి అల్యూమినియం టిన్నులను సరఫరా చేసే 'బాల్ బెవరేజ్ ప్యాకేజింగ్' కంపెనీ రాష్ట్రంలో రూ.700 కోట్ల పెట్టుబడితో ఉత్పాదన యూనిట్ ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ యూనిట్ ప్రారంభమైతే 500 మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. 'బాల్' ఇండియా కార్పొరేట్ వ్యవహారాల అధిపతి గణేశన్ ఆదివారం మంత్రితో సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన తమ సంస్థ విస్తరణ ప్రణాళికను శ్రీధర్ బాబుకు వివరించారు. 'బాల్' సంస్థకు రాష్ట్రంలో అవసరమైన భూమి, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని శ్రీధర్ బాబు ఆయనకు హామీ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో టిన్నుల్లో దొరికే బీర్లు మహారాష్ట్రలో బాట్లింగ్ అవుతున్నాయని మంత్రి తెలిపారు. ఇది 2 శాతం లోపలే ఉందని చెప్పారు. కర్ణాటక, మహారాష్ట్రల్లో బీర్ల ప్యాకేజింగ్ లో టిన్నుల వాడకం 25 శాతం వరకుందని వెల్లడించారు. రాష్ట్రంలో అల్యూమినియం టిన్నుల్లో బీర్లను బాట్లింగ్ చేయాలంటే ఎక్సైజ్ విధానంలో కొన్ని మార్పులు చేయాల్సి ఉంటుందని వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులతో చర్చిస్తానని అన్నారు. 500 మి.లీ పరిమాణంలో బీర్లను అల్యూమినియం టిన్నుల్లో ప్యాక్ చేయడం వల్ల ఎక్సైజ్ డ్యూటీ తగ్గి ప్రభుత్వానికి ఏటా రూ.285 కోట్ల అదనపు ఆదాయం వస్తుందని శ్రీధర్ బాబు తెలిపారు. కిందటి సారి తన అమెరికా పర్యటన సందర్భంగా జార్జియా రాష్ట్రంలోని అట్లాంటాలో ఉన్న కోకా కోలా కేంద్ర కార్యాలయానికి వెళ్లినప్పుడు పెద్దపల్లి జిల్లాలో కొత్త బాట్లింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని ఆ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసిందని చెప్పారు. రూ.1000 కోట్లతో ఏర్పాటయ్యే కోక్ బాట్లింగ్ యూనిట్ కు 'బాల్' సంస్థ అల్యూమినియం టిన్నులను చేస్తుందని వివరించారు. పెట్టుబడులకు సంబంధించి పూర్తి ప్రణాళికను సమర్పించాలని గణేశన్ కు శ్రీధర్ బాబు సూచించారు.

## ఇందిరమ్మ ఇళ్లపై ప్రాసెస్ జరుగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

అందజేస్తామని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మువ్వా విజయబాబు బాధ్యతల స్వీకరణ కార్యక్రమములో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. రైతు నుంచి వచ్చిన నాయకుడు విజయబాబు అని, ఆయన తన పదవికి న్యాయం చేస్తాడనే నమ్మకం ఉన్నదనీ అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తూనే ప్రజలకు అభివృద్ధిని అందజేస్తున్నామని వెల్లడించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ. 31వేల కోట్ల రుణ మాఫీకి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందనీ ఆయన అన్నారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా దేశంలో, ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా రుణ మాఫీ అర్హులందరికీ ప్రభుత్వం చేస్తుందనీ ,గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు కాగితాలకే అంకితం చేశారన్నారు.

## తొలిసారి భారత్ ఆతిథ్యం

**విశ్వంభర, ఢిల్లీ:** వారసత్వ కట్టడాల పరిరక్షణ ధ్యేయంగా పని చేసే యునెస్కో ప్రపంచ వారసత్వ కమిటీ 46వ సెషన్ లో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈ నెల 31 వరకు కొనసాగే ఈ సమావేశాలకు మన దేశం మొదటిసారి ఆతిథ్యం ఇచ్చింది. యునెస్కో డైరెక్టర్ జనరల్ ఓడ్రే అజులై, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకవత్ తో పాటు 150కి పైగా దేశాల నుంచి 2 వేల మందికి పైగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రతినిధులు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ప్రసిద్ధ వారసత్వ కట్టడాలు, చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలకు చెందిన కళాఖండాలు, వాటి సమాచారాన్ని తెలిపేలా స్టాల్ ను ఏర్పాటు చేశారు. ఆసియా దేశాలకు చెందిన పలు స్టాల్స్ ను మంత్రి జూపల్లి సందర్శించారు. నాగర్జున సాగర్ లోని బుద్ధవనాన్ని అంతర్జాతీయలో అభివృద్ధి చేయడంతో పాటు మన రాష్ట్రానికి చెందిన ముఖ్యమైన సాంస్కృతిక, వారసత్వ ప్రాంతాల పరిరక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవడానికి ఇలాంటి సమావేశాలు ఎంతో దోహదపడుతాయని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. 2021 లో చైనాలోని ఫ్యూజీలో జరిగిన ప్రపంచ వారసత్వ కట్టడాలు, ప్రాంతాల కమిటీ సమావేశంలో రామప్ప దేవాలయాన్ని వారసత్వ సంపద జాబితాలో చేర్చుతూ తీర్మానం చేసిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సమావేశానికి ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, పురావస్తు శాఖ డెరెక్టర్ భారతీ హోలికేరి హాజరయ్యారు.

## ఏ టు జడ్.. సీతక్క!

**విశ్వంభర, ములుగు:** సాధారణంగా ప్రతి ఒక్కరూ తమ ఎడ్యుకేషనల్ క్వాలిఫికేషన్, తాము చేసే పనిని పేరు కింద మెన్షన్ చేయడం చూస్తుంటాం. పేరు కింద చూసే క్వాలిఫికేషన్, హోదాతో చాలా మందికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. ముఖ్యమంత్రి, మంత్రి, నుంచి చైర్మన్లు, వైద్యులు, పోలీసులు, రెవెన్యూ అధికారుల పేర్ల కింద మనం వారి వారి హోదాలను చూస్తుంటాం. అయితే మంత్రి సీతక్క మాత్రం తన మార్క్ ని ట్విట్టర్ హ్యాండిల్ లో చాటుకున్నారు. 'మాజీ నక్సలైట్' పదాన్ని తొలుత పేర్కొన్న మంత్రి సీతక్క తన చదువు, మంత్రి పదవిని తర్వాత పేర్కొనడం విశేషం. మాజీ నక్సలైట్, ఎంఏ, పీహెచ్, అడ్వకేట్, ప్రస్తుత ఎల్ఎల్ఎం విద్యార్థి, తెలంగాణ కేబినెట్ మినిస్టర్ ఫర్ పంచాయత్ రాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్, ఆర్ డబ్ల్యూఎస్, మరియు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అని సీతక్క ట్విట్టర్ అకౌంట్లో పేర్కొన్నారు. అయితే రాజకీయాల్లోకి రాకముందు సీతక్క అణగారిన వర్గాల్లో చైతన్యం కోసం పదిహేనేళ్లకు పైగా మావోయిస్టుగా అజ్ఞాతవాసం గడిపారు. 1988లో అడవిబాట పట్టి నక్సలైటుగా ఉంటూనే ప్రజా సమస్యలపై పోరాటం చేశారు.



# మూసీ @ 1.50 లక్షల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

అంచనాలను రూ.1.5 లక్షల కోట్లకు సవరించారు. మూసీ అంచనాలు పెంచడం వెనుక అనుమానాలు కలుగుతున్నాయి. లండన్ లోని థేమ్స్ లాగా మారుస్తామనే వ్యూహం వెనక థీమ్ ఏంటి? గేమ్ ప్లాన్ ఏంటి? అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు.

**మూసీ ప్రాజెక్టుతో ఎంతమందికి లాభం**

తెలంగాణ రైతుల తలరాతను మార్చిన కాళేశ్వరం ప్రాజెక్టుకు 80 వేల కోట్లయితేనే గల్లీ నుంచి ఢిల్లీదాకా కాంగ్రెస్ గగ్గోలుపెట్టింది. మరి.. మూసీ సుందరీకరణకే.. రూ.లక్షా యాభై వేల కోట్లా..? ఇంతకీ మూసీ ప్రాజెక్టుతో ఎంతమందికి లాభం చేకూరనుంది అని కేటీఆర్ ప్రభుత్వాన్ని నిలదీశారు. సొంత జిల్లాలోని పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకన్నా.. మూసీ ప్రాజెక్టుపైనే ఎందుకింత మక్కువ? చివరిదశలో ఉన్న ప్రాజెక్టును పక్కనపెట్టి.. కోల్డ్ స్టోరేజీలోకి నెట్టి.. మూసీ చుట్టే ఎందుకింత మంత్రాంగం..?? మూడింతలు పెంచిన మూసీ అంచనా వ్యయం కాంగ్రెస్ ధనదాహానికి సజీవ సాక్ష్యం అని కేటీఆర్ ఆరోపించారు.



**మూసీ చుట్టూ చిక్కుముళ్లు...**

సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో తాగు, శ్రామిక అవసరాలకు నీటి కొరతను అరికట్టడానికి, నగర అభివృద్ధికి మూసీ నదితో ముడిపెట్టారు. మూసీ నది ప్రక్షాళన జరిగితే నది చుట్టూ ఉన్న నగరం అభివృద్ధి జరుగుతుందని ఆయన చెబుతున్నారు. లండన్ థేమ్స్ నదిని ప్రామాణికంగా తీసుకున్నారు. గతంలో పోర్ట్ ఆఫ్ లండన్ అధికారులు, థేమ్స్ నది పాలకమండలి అధికారులు, నిపుణులతో భేటీ అయ్యారు. మూసీ నది పునరుజ్జీవనం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలను వారితో చర్చించారు. లండన్ లోని థేమ్స్ లాగా మారుస్తామని చెబుతున్నారు. తాజాగా దీనికోసం రూ.1.5 లక్షల కోట్ల బడ్జెట్ అసెంబ్లీలో ప్రవేశపెడతామని చెప్పారు.

**రూ.లక్షన్నర కోట్లు బడ్జెట్ సాధ్యమేనా?**

అయితే రాష్ట్ర బడ్జెట్ రూ.2.5 లక్ష కోట్లల్లో మూసీకే రూ.లక్షన్నర కోట్లు బడ్జెట్ కేటాయించడం సాధ్యమేనా? సరే తిప్పలు పడి బడ్జెట్ కేటాయించినా మూసీ ప్రక్షాళనకు ఉన్న అడ్డంకులు ఆయనకి తెలియవా అంటే తెలుసు. నది చుట్టూ ఎన్నో నిర్మాణాలు ఉన్నాయి. సగానికి పైగా మూసీ నది చుట్టుపక్కల ప్రాంతాలు ఎంఐఎం ఆధీనంలో ఉన్నాయి. అక్కడ నివసించే జనాభాని ఖాళీ చేయించి పనులు ప్రారంభించేది ఎప్పటికి? నిలిపివేయడానికి ఎంతోమంది కోర్టుకి వెళ్లొచ్చు. స్టే లు పడొచ్చు. ఈలోపు ఎన్ని ప్రభుత్వాలైనా మారొచ్చు. మూసీ ప్రక్షాళన మంచి విషయమే కానీ అప్పుల రాష్ట్రంలో, పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలకు ఖర్చు చేస్తూ... అదనంగా అవుతుందో లేదో తెలియని మూసీ కోసం అక్షరాలా లక్షన్నర కోట్లు ఖర్చు చేయాలనుకోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

# రేవంత్ ఢిల్లీ టూర్ మతలబేంటి?

(మొదటి పేజీ తరువాయి)



రేవంత్ భేటీ కానున్నారు. కృతజ్ఞత సభకి రావాలని పిలవనున్నారు. కాగా, డిప్యూటీ సీఎం భట్టి శనివారం సాయంత్రమే ఢిల్లీ వెళ్లారు. నీటి పారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా శనివారం ఉదయం హస్తినకు చేరుకుని ఎన్డీఎస్ఏ చైర్మన్ తో భేటీ అయ్యారు.

**రుణమాఫీపై జాతీయస్థాయిలో చర్చ**

రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ అమలు ప్రక్రియను ప్రారంభించడంతో 2022 లో 'వరంగల్ డిక్లరేషన్' పేరుతో ఏర్పాటు చేసిన సభలో రాహుల్ ఇచ్చిన మాటను కాంగ్రెస్ సర్కార్ నిలబెట్టుకున్నట్లయింది. ఇదే విషయాన్ని ఏఐసీసీ అగ్ర నేతలు సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గే, కేసీ వేణుగోపాల్ కు ఈ ముగ్గురు నేతలు వివరించనున్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామనే విషయాన్ని రాష్ట్ర ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతోపాటు, రుణమాఫీ అమలుపై జాతీయస్థాయిలో చర్చ జరిగేలా చేయడంలో భాగంగా అదే వరంగల్ లో ఈ నెలాఖరులో రైతు కృతజ్ఞత సభకు సీఎం రేవంత్ ప్లాన్ చేస్తున్నారు. దీనికోసం రాష్ట్ర టూర్ కు రాహుల్ ని ఆహ్వానించనున్నారు.

**మంత్రివర్గ విస్తరణ, పీసీసీ చీఫ్ నియామకంపై చర్చలు...**

ఆషాఢమాసం రాకముందే రెండవ కేబినెట్ విస్తరణ, పీసీసీ నియామకం జరపాలని రాష్ట్ర కాంగ్రెస్ భావించింది. దీనిపై రేవంత్ రెడ్డి హస్తినలో మకాం వేసి చర్చలు కూడా జరిపారు. ఢిల్లీలో మంత్రివర్గ విస్తరణపై స్పందిస్తూ... కాంగ్రెస్ బీఫార్మ్ పై గెలిచినవారికే మంత్రి పదవులు ఉంటాయని ప్రకటించారు కూడా. కానీ ఆయన ఢిల్లీ నుంచి ఉట్టి చేతులతో వచ్చారు. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ నియామకంపై నిర్ణయం జరగలేదు. ఇంతలో ఆషాఢమాసం కూడా వచ్చేసింది. దీంతో నెలరోజులు నియామకాలకు బ్రేక్ పడింది.మరో రెండు వారాల్లో ఆషాఢమాసం ముగియనుంది. దీంతో మరోసారి పెండింగ్ లో ఉన్న మంత్రి పదవులు, పీసీసీ చీఫ్ నియామకంపై చర్చలు జరిపేందుకే సీఎం ఢిల్లీ వెళ్లినట్టు తెలుస్తోంది. ఇంకా మంత్రివర్గ విస్తరణలో ఆరు బెర్తులు ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే.

**నామినేటెడ్ పదవులపైనా నిర్ణయం...**

రేవంత్ రెడ్డి, భట్టి, ఉత్తమ్ లు ఢిల్లీలో ఏఐసీసీ నేతలతో భేటీ అవనున్న తరుణంలో మిగిలిన నామినేటెడ్ పోస్టులపైనా ఆసక్తి నెలకొంది. పదవులు ఆశిస్తున్నవారిలో ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర సర్కార్ పది రోజుల కిందట 35 రాష్ట్రస్థాయి కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించింది. ఇంకా 20 నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. దీంతో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. గతంలో జరిగిన నామినేటెడ్ పోస్టుల నియామకాల్లో తమకు అన్యాయం జరిగిందంటూ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావుతోపాటు పలువురు మహిళా నేతలు ఇప్పటికే ఢిల్లీ వెళ్లి మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లంబా, కేసీ వేణుగోపాల్ ని కలిశారు. సోమవారం రాహుల్ ను కలిసి విషయాన్ని ఆయన దృష్టికి కూడా తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, ఉత్తమ్ అక్కడే ఉండడంతో వారిని కూడా మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు కలిసే అవకాశం ఉంది.



## శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి కాచం దంపతుల వెండి కిరీటం బహూకరణ

**విశ్వంభర, చైతన్యపురి:** హైదరాబాద్ చైతన్యపురిలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో వీ 3 న్యూస్ చానల్ చైర్మన్, విశ్వంభర దిన పత్రిక సీఎండీ కాచం సత్యనారాయణ, సుష్మ దంపతులు ఆదివారం శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి వెండి కిరీటం బహూకరించారు. ఈకార్యక్రమంలో కాచం సత్యనారాయణ దంపతులతో పాటు బంధువులు, సన్నిహితులు, స్నేహితులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## రేవంత్ అంకుల్... మా ప్రాణాలకు రక్షణ ఏది?

**విశ్వంభర, మేడ్చల్ :** హైదరాబాద్ లో కుక్కల బెడద ప్రాణాంతకంగా మారింది. ఇటీవల జవహర్ నగర్ లో సంవత్సరంన్నర బాలుడు కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. దీంతో చిన్నపిల్లలున్న తల్లిదండ్రులు భయాందోళనలు చెందుతున్నారు. ఏ క్షణాన తమ పిల్లలకి కుక్కల నుండి అపాయం ముంచుకొస్తుందో అని కలత చెందుతున్నారు.ఈ క్రమంలో కుక్కల బారి నుండి తమ ప్రాణాలు కాపాడండి అంటూ కొంతమంది చిన్నారులు ఆదివారం పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కారు. కుత్బుల్లాపూర్ నియోజవర్గం, కొంపల్లి లోని పలు కాలనీల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దొరికిన వాళ్ళని వేటాడుతున్నాయి. ఆ కుక్కల నుండి తమ ప్రాణాలకి రక్షణ కల్పించండి అంటూ స్థానిక కాలనీల్లో నివాసం ఉండే చిన్నారులు, తమ తల్లిదండ్రులతో కలిసి ఆదివారం పోలీస్ స్టేషన్ కి వెళ్లారు. కుక్కల విషయంపై ఎన్ని సార్లు అధికారులకు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందని కంప్లైంట్ చేశారు. కొంపల్లి మున్సిపల్ కమిషనర్, చైర్మన్ ల పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులు సైతం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నా పట్టించుకునేనాధుడే కరువయ్యాడని వాపోతున్నారు. మున్సిపల్ అధికారులకు కంప్లైంట్ ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని మండిపడుతున్నారు. కాలనీల్లో ప్రజలు బైటికి రాలేనంతగా కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. వాటి బారి నుండి తమకు రక్షణ కల్పించాలని ఎన్నో సార్లు మున్సిపల్ అధికారులకు తెలిపినా కనీస జాగ్రత్తలు తీసుకోకుండా అలసత్వం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**రేవంత్ అంకుల్ మా ప్రాణాలకి రక్షణ ఏది?**

పోలీస్ స్టేషన్ వద్ద చిన్నారులంతా నిరసన వ్యక్తం చేశారు. వీధి కుక్కల నుంచి మమ్మల్ని కాపాడండి అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. రేవంత్ అంకుల్, కమిషనర్ అంకుల్, వివేక్ అంకుల్ (స్థానిక ఎమ్మెల్యే) మాకు రక్షణ ఏది? వీధి కుక్కలు బారిన పడి మా ప్రాణాలు పోవాల్సిందేనా? మాకు రక్షణ ఏది? అంటూ రాసిన ప్లకార్డులు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి.

## ఉగ్రవాదం అణచివేసిన ఘనత మోడీదే..

**విశ్వంభర, హైదరాబాద్ :** సార్వత్రిక ఎన్నికల్లో దేశ వ్యతిరేక శక్తులన్నీ బీజేపీకి వ్యతిరేకంగా తప్పుడు ప్రచారాలు, కుట్రలు చేశాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు.బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని, రిజర్వేషన్లు తొలగిస్తారని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేసిందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్ జిల్లా కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న కిషన్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా మూడోసారి అధికారంలోకి వచ్చి ప్రధాని మోడీ చరిత్ర సృష్టించారని అన్నారు. చరిత్రలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ని కాంగ్రెస్ పార్టీ అనేకసార్లు అవమానించిందని, ఆయన్ని ఎన్నికల్లో ఓడించాలని కుట్రలు చేసినట్లు చెప్పారు.అధికారం, ఎన్నికలతో సంబంధం లేకుండా సంస్థాగతంగా ముందుకెళ్లే పార్టీ బీజేపీ మాత్రమే అని ,దేశంలో సిద్ధాంత పరంగా, కార్యకర్తల ఆధారంగా, ప్రజాస్వామ్యయుతంగా నడుచుకునే పార్టీ బీజేపీనే అని ఆయన అన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఉగ్రవాదం, కుటుంబ పాలన, అవినీతి బాగా పెరిగిపోయినట్లు దేశ ప్రజలు గ్రహించారని ,అందుకే మూడు సార్లు ఎన్డీయేకి పట్టం కట్టారన్నారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి . దేశంలో ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో సహా అణచివేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్‌లో బాంబుపేలుళ్లతో ప్రజలు వణికిపోయారు. బొగ్గు కుంభకోణం, కామన్ వెల్త్ కుంభకోణం, 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణం వంటి అనేక కుంభకోణాలతో సుమారు రూ.12లక్షల కోట్ల అవినీతికి పాల్పడిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.

# ప్రాజెక్టులకు పోటెత్తిన వరద

(మొదటి పేజీ తరువాయి)

నీటి మట్టం 43 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు అధికారులు. అటు పోలవరం కు భారీగా ఇన్‌ఫ్లో పెరిగింది. 15 గ్రామాలు ముంపునకు గురవుతాయన్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్. ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నామన్నారు. వరద పోటుతో గోదావరి ఉధృతి అంతకంతకు పెరుగుతోంది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ ..మిడ్ మానేరు, కిన్నెరసాని, తూ పాకులగూడెం సమ్మక్క సాగర్ , కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో ఇన్‌ఫ్లో పెరగడంతో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్ట్ స్పిల్‌వే ఎగువన 31.8 మీటర్ల నీటి మట్టం ఉంది. స్పిల్‌వే దిగువన 20.6 మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది. కాఫర్ డ్యామ్ ఎగువన 30.30 మీటర్ల నీటి మట్టం ఉండగా, దిగువన 20.15 మీటర్లు ఉంది. ఇక పోలవరం నుంచి 8,16,838 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. రాజమండ్రి ధవళేశ్వరం బ్యారేజ్ దగ్గర వరద ఉధృతి ఎక్కువగా ఉంది. దీంతో 175 గేట్లు ఎత్తివేసి సముద్రంలోకి నీటిని వదులుతున్నారు. అటు వానలువరదలతో కృష్ణా నది పరవళ్లు తొక్కుతోంది. జూరాల, తుంగభద్ర , ప్రాజెక్టులు నిండు కుండలను తలపిస్తున్నాయి. నాగార్జునసాగర్ , శ్రీశైలం, ప్రకాశం బ్యారేజీల్లో ఇన్‌ఫ్లో అంతకంతకు పెరుగుతోంది. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన అధికారులు కృష్ణా రీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ధవళేశ్వరం దగ్గర వరద పోటెత్తుతోంది. ఇక ఉభయ గోదావరి జిల్లాల్లో ని వాగులు వంకలు ఉప్పొంగుతున్నాయి. ఇటు కాళేశ్వరం పుష్కర ఘాట్ ,మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ దగ్గర నీటి మట్టం అంతకంతకూ పెరుగుతోంది. మరోవైపు మూసీ నది కూడా ఉధృతంగాప్రవహిస్తోంది . ఇక హైదరాబాద్ లో హుస్సేన్ సాగర్ , ఉస్మాన్ సాగర్ నిండు కుండలను తలపిస్తున్నాయి. విశాఖ జిల్లా సీలేరు జలాశయానికి వరద నీటి తాకిడి ఎక్కువగా ఉంది. ఐస్ గెడ్డ, పిల్లి గెడ్డ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గుంటవాడ రిజర్వాయర్ నీటి మట్టం గంటగంటకు పెరుగుతోంది.ఎప్పటికప్పుడు పరిస్థితిని మానిటరింగ్ చేస్తున్నారు అధికారులు.

# రాజకీయ విమర్శలు కట్టిపెట్టి కాళేశ్వరాన్ని పునర్ వినియోగంలోకి తేవాలి

**విశ్వంభర, హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కమీషన్లు కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ నిధులను ఎక్కువగా ఖర్చుపెట్టారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై మంత్రి చేసిన వ్యాఖ్యలను హరీశ్ రావు ఖండించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.." మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాజకీయ విమర్శలు కట్టిపెట్టి కాళేశ్వరాన్ని పునర్ వినియోగంలోకి తేవడంపై శ్రద్ధ పెట్టాలి అని హితవు పలికారు. ఢిల్లీ వేదికగా ఆయన తన అవగాహనా రాహిత్యాన్ని బయట పెట్టుకున్నారు అని విమర్శించారు. మేడిగడ్డ వద్ద అన్ని చర్యలు తీసుకున్నామని అంటూనే మట్టి పరీక్షలు సాధ్యపడలేదని చెప్తున్నారు అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వరద రాకముందే సాంకేతిక పరీక్షలు పూర్తి చేయకపోవడానికి ఎన్డీఎస్ఏ నిర్లక్ష్యం, ప్రభుత్వ వైఫల్యమే



కారణం అని అన్నారు. వరదల దృష్ట్యా పరీక్షలు ఆపేశామని చెప్పడం బాధ్యత రాహిత్యానికి నిదర్శనం కాదా?. రక్షణ కోసం సూచనలు చేయడంలో ఎన్డీఎస్ఏ దారుణంగా విఫలం అయింది అని ఫైర్ అయ్యారు.

**తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి సాంకేతిక సమస్యలు**

రీ ఇంజనీరింగ్ తర్వాత కూడా జలాశయాల నిల్వ సామర్థ్యం పెంచడం తప్ప ఎల్లంపల్లి నుంచి పైకి నీటిని తీసుకు వచ్చే అలైన్మెంట్ ఏ మార్పు లేదని, ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు అయినా, కాళేశ్వరం ప్రాజెక్టు అయినా రెండూ కూడా మల్టీ స్టేజ్ ఎత్తిపోతల పథకాలేనని, రెండింటిలో కరెంటు ఖర్చు దాదాపు సమానమేనన్నారు.తుమ్మిడి హట్టి బ్యారేజీ నిర్మాణం పూర్తికి సమస్యలు ఉండటం వల్లే బీఆర్ఎస్ 148 మీటర్ల వద్ద ఒప్పందం ఉన్నప్పటికీ బ్యారేజీని నిర్మించలేకపోయామని, దానికి ప్రత్యామ్నాయంగా వార్ధా నదిపై బ్యారేజీని ప్రతిపాదించమని అన్నారు. ప్రాజెక్టుపై ఖర్చు రూ.94 వేల కోట్లు ఉంటే లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించడం ఏమి నైతికత అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద 98 వేల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించడం జరిగిందని హరీశ్ తెలిపారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి రాజకీయ విమర్శలు కట్టిపెట్టి, ప్రాజెక్టును పునర్వినియోగంలోకి తీసుకురావాలని హరీశ్‌రావు సూచించారు.



# ఘనంగా మొగుళ్ళ రాజిరెడ్డి 55 వ జన్మదిన వేడుకలు

**విశ్వంభర, చేర్యాల :** సిద్ధిపేట జిల్లా చేర్యాల పీఎంఆర్ గార్డెన్లో రాజన్న యువసేన ఆధ్వర్యం లో మొగుళ్ళ రాజిరెడ్డి 55 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మిత్రులు హాజరై ఘనంగా వేడుకలు జరిపారు. రాజన్న యువసేన నాయకులు మద్దూర్ నుండి బండి శ్రీనివాస్ గౌడ్, బెక్కల్ బాలరాజు, బచ్చన్న పేట మండలం నుండి రమేష్ పరుశరాములు, విద్యాకర్ కొమురవెల్లి నుండి ఐనాపూర్ శ్రీధర్, చేర్యాల నుండి కొమ్ము నరసింహ రావు, భాస్కర్ రెడ్డి, ఉడుముల బాల్రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రముల్ల సుధాకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ వేముల సత్యనారాయణ రెడ్డి, కంచే రాములు, పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు.

# ఘనంగా తీకుళ్ల సాయి రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభ

- ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి



**విశ్వంభర, సూర్యాపేట:** ఆచరించే సిద్ధాంతాలు వేర యినప్పటికి ఒకరి నొకరు గౌరవించే సంప్రదాయం సూర్యాపేటలో ఎల్లప్పుడూ వుంటుందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 37 సంవత్సరాల పాటు ఉపాధ్యాయులుగా సేవలు అందించిన జాతీయ వాది, పూర్వ ఏబీవీపీ నాయకులు, ఆపస్ ఉపాధ్యాయ సంఘ నాయకులు అయిన తీకుళ్ల సాయి రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభ సూర్యాపేట పట్టణంలోని త్రివేణి ఫంక్షన్ హాల్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి మాట్లాడుతూ తీకుళ్ల సాయి రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయులుగా పనిచేసి విద్యార్థులలో దేశభక్తి భావజాలం పెంపొందించారని అన్నారు. వారు తన పదవీ విరమణ తరువాత కూడ తాను నమ్మిన బాటలో పయనించి దేశ సేవ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా తీకుళ్ల సాయి రెడ్డి మాట్లాడుతూ తాను ఇంతకాలం జాతీయ వాదంతో పనిచేశానని, ఇక ముందు కూడ సంఘం ఆదేశాల మేరకు ఏ భాధ్యత ఇచ్చినా పనిచేస్తానని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు సాయి రెడ్డిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, హుజూర్ నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, రాంచందర్ రావు, మురళీ మనోహర్ రావు, మట్టపల్లి రాధాకృష్ణ, బెల్లంకొండ రామ్మూర్తి, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.






## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

### టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ళ రాజిరెడ్డి

**చేర్యాల, విశ్వంభర :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు రుణమాఫీ సంబరాలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నాయి. చేర్యాలలో రెండు లక్షల రుణమాఫీ రైతులకు ఏకకాలంలో చేసినందుకు కృతజ్ఞతగా రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ళ రాజిరెడ్డి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. రాజన్న యువసేన ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కలిసి పాలాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

## వాడుకొని వదిలేశారు?



**విశ్వంభర, హైదరాబాద్:** నన్ను పీఆర్ స్టంట్ కోసం వాడుకొని వదిలేశారు అంటూ సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ పోలీస్ అధికారిణి నళిని ఆవేదన వ్యక్తం చేశారు. అడుక్కునే వారికి ఇచ్చిన విలువ కూడా నాకు రేవంత్ సర్కారులో ఇవ్వట్లేదు... సీఎం సార్ కొలువుకు ఎక్కగానే నన్ను మీద మీద యాది చేసిండు.ఇప్పుడేమో సప్పుడే చేస్తలేడు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మధ్యలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు కూడా జరిగినాయి. ఆశ్చర్యంగా నా వూసే ఎత్తలేదని ఫైర్ అయ్యారు. ఇంతకీ నా రెండు దరఖాస్తులు బల్ల మీదనే ఉన్నయో లేక చెత్త బుట్టలోకి పోయినవోనని డౌట్ వస్తుందన్నారు. మా చిన్నప్పుడు ఆడుక్కొనేటోడు ఇంటి ముందుకు వస్తె,ఇంట్లో చల్లన్నం లేకపోతే పైకి ఎల్లవయ్య అని మెల్లగా చెప్పేటోల్లం. కనీసం ఆ పాటి మర్యాద అయినా నాకు ఇస్తారేమో చూడాలి.అందుకే నేను ఇన్నేళ్ళు ఎవ్వరినీ కలవాలే. ఉద్యమం చేసేటప్పుడే నాకు చాలా విషయాలు అర్థం అయినవి అంటూ చురకలు అంటించారు. ఒక నెలలో నా పిటిషన్ ఎంక్వైరీ పూర్తిచేస్తారు అనుకున్న.7 నెలలు కావస్తోంది.అందుకే రిమైండర్ లెటర్,పోస్ట్ రాయాల్సి వచ్చింది. సెక్రటేరియట్ చూట్టూ తిరిగేంత సమయం మరియు ఓపిక నా వద్ద లేవు అని నేను ఆ రోజే రేవంతన్నకు చెప్పినట్లు పేర్కొన్నారు.

## తెలంగాణ ఉద్యమ గాయకుడు వేముల నరేష్‌కు నివాళులు

### ఎమ్మెల్యే గుంటకండ్ల



**విశ్వంభర, శాలిగౌరారం :** మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి నల్లగొండ జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ గాయకుడు, సాంస్కృతిక సారథి కళాకారుడు వేముల నరేష్ ఇటీవల మరణించడంతో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాటి ఉద్యమ కాలంలో జరిగిన పరిస్థితులను గుర్తు చేసుకుంటూ నరేష్ తెలంగాణ ఉద్యమకళాకారుడిగా ఉద్యమం సమయంలో ఎంతోమందిని చైతన్యపరచాడని గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆ కుటుంబానికి అండగా ఉంటామని హామీఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా. గాదరి కిశోర్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.




# ఎన్నికల హామీలను పారదర్శకంగా అర్హులకు అందించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్







**విశ్వంభర, సూర్యాపేట:** దేశంలో, రాష్ట్రంలో ఏర్పడ్డ కొత్త ప్రభుత్వాలు ఎన్నికల హామీలు పారదర్శకంగా నిజమైన పేదలకు అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా పార్టీ కార్యాలయం, ధర్మ బిక్షం భవన్లో పట్టణ విస్తృత నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లతో కలిసి బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తుల కొమ్ముకాసే విధానాన్ని మానుకొని ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అర్హులైన పేదలకు అందించాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని లేని పక్షంలో అనేక మంది పేద ప్రజలు నష్టపోతారని గుర్తు చేశారు. పట్టణంలో బలమైన ప్రజాసంఘాలను నిర్మించుకొని పట్టణ సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించి పార్టీ బలోపేతం కావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆగస్టు మూడో తేదీన జరిగే జిల్లా నిర్మాణ విస్తృత కౌన్సిల్ సమావేశంను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మహిళా సమైక్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన, రాష్ట్ర సమితి సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, నిమ్మల ప్రభాకర్, దీకొండ శీను, గుగులోతు రాజారామ్, నేలపట్ల చిన్న సైదులు, ఎడెల్లి శ్రీకాంత్, బూర సైదులు, పెంద్ర కృష్ణ, తాళ్ల సైదులు, పున్నం రమేష్, నాగరాజు, వాడపల్లి గోపి, సా రెడ్డి వెంకట్ రెడ్డి, కొత్వాల్ సురేందర్, హరి, శేఖర్, కప్పల రాము తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ వైతాళిక కవినేత దాశరథి

**తెలంగాణలో జన్మించిన గొప్ప వైతాళికులలో, మహాకవి దాశరథి అగ్ర శ్రేణికి చెందిన వారు. హైదరాబాద్ సంస్థాన విముక్తి మహోద్యమంలో దూకి, నిజాం నవాబు అలీఖాన్ ను ఎదిరించి, తెలంగాణ విముక్తికై కారాగార శిక్ష అనుభవించి, లక్ష్యాన్ని సాధించిన స్వాతంత్ర్యోద్యమ కవి సింహం దాశరథి.**
**దాశరథిగా సుపరిచితులు అయిన – దాశరథి కృష్ణమాచారి 1925 జూలై 22 నాడు, ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా, చినగూడూరు గ్రామంలో శ్రీమతి వేంకటమ్మ, శ్రీమాన్ వేంకటాచార్యులకు జన్మించారు. దాశరథి రంగాచారి దాశరథి ఆయన తమ్ముడు.**

## జూలై 22... దాశరథి కృష్ణమాచార్య జయంతి



చినగూడూరులో నాల్గవ తరగతినీ, ఖమ్మం ఉస్మానియా హైస్కూల్ లో మెట్రిక్యులేషన్ నూ పూర్తి చేశారు. ఖమ్మంలో చదువు కుంటున్నప్పుడే మీర్జాగాలిబ్ శృంగారాత్మక సాహిత్యాన్ని, ఇక్బాల్ విప్లవ గీతాలను అధ్యయనం చేశారు. మరోవైపు ఉపనిషత్తుల సారాన్ని ఎదనిండా నింపు కున్నారు దాశరథి .

"నా గీతావళి ఎంత దూరము ప్రయాణంబౌనొ అందాక ఈ భూగోళమ్మున అగ్గి పెట్టెదను" - అంటూ విప్లవ చైతన్య మూర్తియై ప్రజ్వరిల్లినారు. ప్రజల బాధలకు,కారణ భూతులైన భూస్వాముల ఆటకట్టించాలనీ, రైతుల హక్కుల కోసం పోరాడుతున్న కమ్యూనిస్టులతో కలిసిపోయారు. కార్యకర్తగా, కావ్యకర్తగా ఉద్యమించారు. కోయగూడేలలో తిరిగి వాళ్లను సమైక్య పరచారు. లంబాడీలను, హరిజనులను, రైతులను, కూలీలను, వర్తకులను మేల్కొలిపి, వాళ్లను స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములుగా చేశారు. పుంఖానుపుంఖంగా కవితలు రచించి, పీడిత ప్రజల, భావాలకు ప్రతినిధిగా తన కలాన్ని ఝుళిపించారు.

తెలుగు భాషా సంస్కృతుల పునరుద్ధరణ కోసం ఆంధ్ర సారస్వత పరిషత్తు సభలలో పాల్గొని, కావ్యగానం చేసేవారు దాశరథి. ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రథమ వార్షికోత్సవ సభ 1944లో ఓరుగల్లు కోటలో ఏర్పాటైంది. రజాకార్లు సభపై - వేసిన పచ్చని పందిళ్లను తగులబెట్టారు. అప్పుడు దాశరథి నిర్భయంగా " జ్వాలలో ఆహుతి అయిపోతాం గాని, కవి సమ్మేళనం జరిపి తీరుతాం " అంటూ గళం విప్పి -

**"ఓ పరాధీన మానవా! ఓపరాని**

దాస్యము విదల్చ లేని శాంతమ్ము మాని, తలుపులను ముష్టి బంధాన కలచివైచి, చొచ్చుకొని పొమ్ము స్వాతంత్ర్య సురపురమ్ము" - అంటూ ప్రబోధించారు. సభాధ్యక్షులైన సురవరం ప్రతాపరెడ్డి వెంటనే లేచి 'సింహగర్జన చేశావు నాయనా' అంటూ దాశరథిని మెచ్చుకొన్నారు. దేవులపల్లి రామానుజరావు దాశరథి మెడలో పుష్పహారం వేసి కౌగలించుకొన్నారు. తరువాత 'మంచిర్యాల'లో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు సభా కవి సమ్మేళనానికి, దాశరథి అధ్యక్షత వహించి ప్రజలను ప్రబోధించారు.

194546 ప్రాంతంలో దాశరథికి కమ్యూనిస్ట్ లతో అభిప్రాయ భేదాలేర్పడ్డాయి. అప్పుడు దాశరథి హైదరాబాద్ రాష్ట్రం విలీనం కావడానికీ, మహోద్యమాన్ని సాగిస్తున్న ' స్టేట్ కాంగ్రెసు' లో చేరినారు. స్వామీ రామానందతీర్థ నాయకత్వంలో, జమాలాపురం కేశవరావు, కొండా వెంకటరంగారెడ్డి, మాడపాటి హనుమంతరావు మొదలగు వారితో కలసి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు.

"ఇదేమాట ఇదేమాట పదేపదే అనేస్తాను" అంటూ, "నిజాం రాజు జన్మజన్మల బూజు" అంటూ, ఉద్యమ కవితావేశ మూర్తియై, దాశరథి సత్యాగ్రహానికి తలపడ్డారు. అప్పటి దాకా పొంచి ఉన్న పోలీసులు 'గార్ల ' గ్రామంలో, దాశరథిని అరెస్టు చేసి, నిజాం ప్రభుత్వం దాశరథికి 16 నెలల కఠిన కారాగార శిక్షను విధించింది. కొన్ని నెలలు వరంగల్ జైల్లో ఉంచి, తరువాత దాశరథిని నిజామాబాద్ సెంట్రల్ జైలుకు పంపింది. నిజామాబాద్ జైల్లో దాశరథి ముఖం కడుక్కునే బొగ్గుతో జైలు గోడ మీద -

"ఓ నిజాము పిశాచమా! కానరాదు నిన్ను బోలిన రాజుకు మాకెన్నడేని తీగెలను తెంపి, అగ్నిలో దింపినావు నాతెలంగాణ కోటి రత్నాల వీణ " అని రాస్తే జైలు అధికారులు తుడిచి వేయించారు. అపుడు అదే జైల్లో ఉన్న వట్టికోట ఆళ్వారు స్వామి, మళ్లీ మళ్లీ గోడ మీద రాసేవారు. జైల్లో దాశరథి స్వామి రామానంద తీర్థను దర్శించు కొన్నారు. స్వామీజీ దాశరథి సాహసాన్ని ప్రశంసించినారు .

"నా తెలంగాణ తల్లి కంజాతవల్లి" - "నా తెలంగాణ కోటి అందాల జాణ" - "నా తెలంగాణ సీమ సౌందర్య సీమ" "నా తెలంగాణ కోటి రత్నాల వీణ" అంటూ తెలంగాణ తల్లిని వేనోళ్లా ప్రశంసించిన తెలంగాణ ముద్దు బిడ్డ దాశరథి. "తెలంగాణలోని కోటి ధీరుల గళధ్వనినె గాక ఇలా గోళ మందుండెడి ఎల్లరి శబ్దాన్ని నేను నా పేరు ప్రజాకోటి నా ఊరు ప్రజావాటి" అని చాట గలగిన ప్రపంచ ప్రజాకవి దాశరథి.

"అగ్నిధార" మొదలు ' నేత్రపర్వం ' దాకా ముప్పైకి పైగా, గ్రంథాలు రచించారు దాశరథి. 200 కు పైగా చలన చిత్రగీతాలు రాశారు. దాశరథిని గూర్చి అనేక విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరిగాయి. ఆయన రచనలు అనేక భాషలలోనికి అనువాదిత మైనాయి. తెలుగులో గజల్ రుబాయీ ప్రక్రియలను, ప్రప్రథమంగా ప్రవేశ.పెట్టిన ప్రయోక్త దాశరథి మహాకవే.

'జాతీయోద్యమ రథసారథిగా' భారత ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ చేతుల మీదుగా తామ్రపత్ర సన్మానాన్నీ, అప్పటి ఉప రాష్ట్రపతి శ్రీ ఆర్. వెంకట్రామన్ చేతుల మీదుగా సన్మానాన్ని అందు కొన్నారు దాశరథి. 'కళాప్రపూర్ణ', 'డి.లిట్' వంటి గౌరవ పట్టాలతో వివిధ విశ్వ విద్యాలయాలు దాశరథిని సన్మానించాయి. అమెరికా తెలుగు వాళ్లు ' ఆంధ్ర కవితా సారథి' గా సన్మానించారు.

ఒంగోలు ' గండపెండేరం ' తొడిగి సన్మానించింది. వరంగల్లు దాశరథికి స్వర్ణోత్సవం చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1977 లో ఆస్థానకవిగా నియమించి సన్మానించింది. అనేక దేశాలలో పర్యటించి , దాశరథి తెలుగు భాషా సాహిత్య సంస్కృతులను గూర్చి ప్రసంగించారు. దాశరథి అనారోగ్యానికి గురై 1987 నవంబరు 5 వ తేదీ ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494



# పాలకులకు ముందు చూపు అవసరం

**"ముందు చూపు లేని వారు ఎందుకు కోరగారు- అన్నాడొక కవి"**

అలసత్యం,ఉదసీనత,సోమరితనం,నిర్లక్ష్యంవీటివల్ల వికసం,వివేకం కలదు వీటిని వీలైనంత వరకు వదిలించుకోవాలి.వీటి బారిన పడకుండా జాగరూకులమై ఉండాలి.శ్రీ కృష్ణభగవానుడు భగద్గీతలో చెప్పినారు. మా చిన్న తనన (సాం శం లోనిదే) ఒక చిన్న కథ ను విజ్ఞప్తి తెచ్చుకుందాం . పూర్వ కాలం లో రాజులు ప్రజల కష్టాలను సుఖాలు, కాటకాలు మరియు ఇతర బాధలను క్షేత్ర స్థాయి లో పర్యటనలు చేసి, తెలుసుకొని,సమస్యసమస్యలను పరిష్కారించే వారు. పూర్వం ఒక రాజు, మంత్రి లతో కలసి పర్యటన కు బయలుదేరాను . దారిలో ఒక చోటు, ఒక వృద్ధ రైతు, మామిడి మోర్చను నాటడం చూసినాడు. ఆ వృద్ధ రైతు, పండు ముసలి అవసాదశలో మామిడి మొక్కనాటడం చూసి, రాజు ఆశ్యయా పోయాడు. దిగిన రాజు, మంత్రి ఆ రైతు వద్ద కు పోయాడు. ఈ మామిడి మొక్క ఎంత కాలానికి కత కు వస్తుంది. ఈ మొక్క ఫలాలను, నీవు తిన గలవా, అని రాజు ప్రశించాడు. అందుకు జవాబు గా రైతు ఈ రోజు మనం తింటున్న ఫలాలు, మనం నాటిన వి కావు, పూర్వీకులు నాటినవి మనం అను భావిస్తున్నాము. మన ముందు చూపు, దూరదృష్టి తొ మన తరానికి అందించాలాని అది మన కర్తవ్యం, బాధ్యత అని సెలవిచ్చాడు. రైతు చెప్పిన సమాధానానికి రాజు ముగ్ధుడై నదు రాజు , ఆ రైతు తన ఆ స్థానం లో సభ సదులకు ముందు చూపు,దుర దృష్టి మొక్క ఆవశ్యకత ను తెలిపినాడు. తరువాత ఆ రాజ్యం లో తగిన చర్యలు చెచేపట్టాడు. ఈ కథ లోనే నీతి నేటి మనపా లకు లకు అధికారంలో వున్న వారికీ ఎంతో అవసరం. నేడు మనదేశం లో ప్రసార మాధ్యమాలైన పత్రికలు.tv.చానల్ల పుణ్యమా అని గత ప్రభుత్వాలను నిదించడం, తపులను పదే పదే ఎత్తి చూపడం నిత్యకృత్యం అయింది. వారు చేసిన తాప్పుల వల్లన లేదా ప్రజలు మార్పునే కోరుకున్నారు. మీకు అధికారం వచ్చింది, ప్రజలు ఇచ్చిన, మీకు వచ్చిన అధికారాన్ని, అవకాశాన్ని మీరు మెరుగైన పాలన అందించే ప్రజల మన్నాలనలను పొందండి. అభివృద్ధి ప్రచారాల ద్వారా మాటలు ద్వారా కాకుండా చేతల ద్వారా చూపించండి. వారు చేసిన తప్పులు చేయడం మంచిది కాదు. గత పాలకుల యానంలో కట్టిన భారీ ప్రాజెక్టు లు భారీ పరిశ్రమల ఫలితాలు నేడు మనదేశపు ప్రజలు అనుభవిస్తున్నది. నిజం. అది ఎవరు వ్య తి రే కించనా, నిజాన్ని దాచలేరు, రాజ హేళన (నేత్రాల) తొ కాకుండా వాస్త్రవివ దృక్పథం తో చూడాలి. ఆనాటి పరిస్థితులు లో ఒకటి, అర పొర పొట్లు జరాగోచ్చు, కాద లేము. మీకే చ్చిన అవకాశాన్ని, వాటిని సవరించి ప్రజల కు మేలు చేయండి. ఆత్మస్తుతి, పరనింద లు తగ్గించుకుంటే అందరికి మంచిదే.మన ఆదాయ వనరులకు అనుగుణంగా సనూతలిన అవసరాలు గ్రహించి ముందుచూపుతో బర్జెట్ రూపొందించాలి. సంక్షేమం అభివృద్ధి రెండూ రెండు కళ్ళ అభివృద్ధి అనే పదం తత్ కలిక అవసరాలు, దీర్ఘకాలిక అవసరాలు అనే దిమరువరాదు. మనకున్న జలవనరుల ను సద్వినియోగం చేసుకోవాలి మన ది వ్యవసాయక సదు భూమి విస్తీర్ణం పెంచవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు తదిన ప్రణాళిక సిద్ధం చేయాలి. విద్య , వైద్య నికి తడిన నిధులు కేటాయించాలి. ప్రపంచం లో ఏ దేశానికి లేని యువ శక్తి మనకు ఉంది. నిరుద్యోగ యువత, ఉ పాది ఉద్యోగ అవకాశాలకు ఎదురు చూస్తుంది. నిర్లక్ష్యం వహిస్తే మనకు మంచిది కాదు.ప్రభుత్వరంగ లేదా ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్చించి పరిశ్రమలను ప్రోత్సహించాలి. మనకున్న ఖనిజ సపదలను వెలికి తీసి సంపద ను సృష్టించాలి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుదలను ప్రోత్సహించే. రాజ్యాంగ నిర్మాణంలో కలత పాత్ర వహించిన శ్రీ అంబేత్కర్ గారు సెలవిచ్చినట్టు రాజ్యాంగం అమలు చేసేవారు. మంచి పాలకులైతే మంచి ఫలితాలు వస్తాయి . దురదృష్ట వశాత్తూ చెడ్డ వారి చేతుల్లో అధికార ఉంటే మంచి ఫలితాలు ఆశించలేం. మన ప్రజాప్రతినిధుల పై న వేల కేసులు సీబీఐ వద్ద ఏళ్లు తరబడి మల్గుతునాయి, క్రిమినల్ ఆర్థిక నేరాలు రకరకాలుగా పెండింగ్ లోనయి అవి అస్మడియులు,తస్మడియులు అనే రెండు రకాలైనవి చెబుతున్నారు . అస్మదీయుల కేసులు దశ అబ్దలుగా ఇక త్తాండియులైతే వెంట వెంటనే చర్యలు అనీ పత్రికల కథనాలు, బీహార్ రాష్ట్రంలో ఈ మదన నే 20బ్రిడ్జీలు కూలినట్టు వార్తలోచాయి, వాటిపై అక్కడి ప్రభుత్వం బాధ్యతల పై తీసుకున్న దకలు లేవు ఇది క్షమించారని విషయం ప్రభుత్వ పెద్దలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలే, ఏ రాష్ట్రంలో జరుగని అపారమైన ప్రజాధనం నష్టం వాటిల్లింది,అంతే కాదు ఇందులో నితీష్, ముఖ్య మంత్రి ఆ సమర్ధ పాలన అని అందరూ భావిస్తున్నారు. నితీష్ కుమార్ కు ఆర్థిక హయంలో వేల కోట్లు మంజూరు చేస్తున్నారు. కేద్రం ప్రభుత్వం ఈ విషయం లో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తన భగాస్వామ్యంలో ప్రభుత్వం అని ఎన్నుకున్నారు. తన నిజాయితీగా వున్న ట్లుగా ఉండడం కాదు, తన తోటి వారిని కా కుండా నిజాయితీగా వుండాలే,అడ్మినిస్ట్రేటివ్,అజమాయిషీ చేయాలి. బార్జెట్ కేటాయింపులుండాలి కానీ దురదృష్టం, బీహార్, గుజరాత్ రాష్ట్ర లాకు కేటాయింపు లకు దక్షనాది రాష్ట్రాలకు పక్షపాత వైఖరి కనిపిస్తుందని పరిశీలకులు అంటున్నారు పెదరల్ వ్యవస్థ లో అనుమానాలకుతావులేకుండా పార దర్శక మైన కేటాయింపు లు. చేసి నిజాయితీ నిరూపించుకోవాల్సినప్రజల ఆకాంక్ష.వట్టి మాటలు కట్టిపెట్టి గట్టిమేలు తలపెట్వోయి. అన్నాను ......గురజాడ మహాకవి.. సర్వే జనా సుఖనోభవంతు..



- జిన్నం అంజయ్య
రచయిత, కవి,
సీనియర్ రాజకీయ నాయకుడు
9849310392

# జర్నలిస్ట్ లపై దాడి ... దేనికి సంకేతం!

ప్రజలకు నిజ నిజాలను అందించే ప్రయత్నంలో మీడియా నిరంతరం ఒక యుద్ధమే చేస్తుంది.సామాన్యుల నుండి రాజకీయ ,ఉన్నత వర్గాలు , మేధావులు వారు చేసే పనులలో కొంతమేర అయినా విశ్రాంతి దొరుకుతుంది.కానీ మీడియా వ్యవస్థలో మాత్రం జర్నలిస్ట్ గా బాధ్యతలు నిర్వహిస్తూ ఇరవై నాలుగు గంటలు పని చేయాల్సిన పరిస్థితి ఉంది. కుల, మత, వర్గ, వర్ణ బేధాలు లేకుండా చిన్న ,పెద్ద తేడాలు చూపకుండా ఒక సమాంతరమైన వార్తలను అందించడం ద్వారా మీడియా ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రధాన భాగంగా ఉంది. సమాచార వ్యాప్తి ద్వారా లీనమైపోతుంది.అక్షరం సాక్షిగా అందిస్తున్న వార్తలను పత్రిక , ప్రసార మాధ్యమాల ద్వారా జర్నలిస్ట్ లు చేస్తున్న పనులలో వ్యవస్థకు లోపం కనిపిస్తుంది .. ! ప్రజా వ్యవస్థలో సమాజంలో జరుగుతున్నా మంచి చెడులను ఒకే విధంగా తీసుకొని జరుగుతున్నా అన్యాయాలను సైతం ఎదురుకొని అక్రమార్కుల నుండి ఆపదలకు ఎదురు నిలబడి ప్రశ్నించే గొంతుకలై నిజాలను నిర్భయంగా ప్రసారం చేయడంలో అలాగే ఆ సమస్యల పరిష్కారానికి మార్గాలు వెతికి పెట్టడంలో సమస్యలుకు పరిష్కారం జరిగి ప్రజలకు న్యాయం కల్పించడంలో జర్నలిస్ట్ పడే వేదన అంత ఇంత కాదు ... అక్షరాన్ని ఆయుధంగా చేసుకొని మాటను తూటగా మలుచుకొని అన్యాయం పై అస్త్రాలను సందిస్తూనే ఉన్నాము..

ఎక్కడ దాడులు , అన్యాయాలు జరిగితే అక్కడ ఆ వార్తలను సేకరించి పత్రిక , ప్రసార మాధ్యమాలకు అందించే దిశగా ప్రయత్నం చేసే జర్నలిస్టే .... నేడు అదే జర్నలిస్ట్ లపై జరిగిన దాడుల గురించి పత్రికల్లో , ప్రసార మాధ్యమాల్లో చూస్తుంటే "ఏమైపోతుందో నా జర్నలిజం" అనిపిస్తుంది ..

అలాంటి జర్నలిస్ట్ ల మీద నేడు అఘాయిత్యాలు, ఆగడాలు, హత్యలు, బెదిరింపులు, అరెస్ట్ లు , చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి ...వీటన్నిటికీ కారణం ఎవరు అని చెప్పుకోవాలి . స్వార్థ పూరిత రాజకీయాలలో వారి స్వలాభం కోసం, వారిని ప్రశంసించే వార్తలు , ప్రముఖంగా ప్రచురణ కావాలని, కానీ వారు అధికారం మాటున అవినీతి ,అక్రమాలను యథేచ్ఛగా చేస్తున్నారు.అవినీతి, అక్రమాలను అడ్డం పెట్టుకొని ప్రజలను మోసం చేస్తూ వ్యవస్థను చిన్న బిన్నం చేస్తున్న రాజకీయ పార్టీల తీరును ఎండగట్టడానికి జర్నలిస్ట్ లు తమ పని తానూ చేసుకొని పోతుంటే...అధికారంలో ఉన్న నేతలు జర్నలిస్ట్ లపై దాడులు, భూతులు, కుటుంబ సభ్యులకు బెదిరింపులు చేస్తున్న వీటన్నిటిని అధిగమించి ముందుకు సాగుతూనే ఉన్నాము ...నిరసనలు , ఉద్యమాలు, న్యాయం కోసం పోరాటం చేస్తున్న ప్రతి చోట జర్నలిస్ట్ లు వాళ్ళ కంటే ముందే ఉంటున్నారు ,.. విద్యార్థుల భవిష్యత్ కోసం సరైన మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థి సంఘాలు అధికార పార్టీ మీద నిరసనలు తెలుపుతున్న వార్తలను అందించే జర్నలిస్ట్ లపై పోలీసులను పెట్టి దాడులు చేయిస్తున్నారు. భూతులు తిడుతున్నారు ..నిరుద్యోగ యువతీ ,



యువకులు చేస్తున్న ధర్నాలో వాళ్ళ గొంతును ప్రపంచానికి తెలియజేసే ప్రయత్నంలో జర్నలిస్ట్ లు ముందుంటారు .. కానీ ఆ జర్నలిస్ట్ గొంతునే తొక్కే ప్రయత్నం చేస్తున్నారు. నీటి కోసం, నిధుల కోసం, నియామకాల కోసం చేసిన ఉద్యమాల్లో కూడ జర్నలిస్ట్ లు ముందు వరుసలోనే ఉన్నారు. అధికారం లో ఉన్న ప్రభుత్వాలు, ప్రతిపక్షాల గొంతును బాధితుల ఆక్రందణలను, పత్రిక స్వేచ్ఛను అణచి వేయాలని చూస్తున్నారు. ప్రశ్నించే ఆ గొంతును ప్రజలందరికి వినిపించేలా చేస్తున్నా జర్నలిస్ట్ ల గొంతులను ఉక్కుపాదంతో తొక్కి పడుతున్నా, ప్రజల కొరకు ప్రతి వార్తను అందిస్తున్నాం ..

రాజ్యాంగం కల్పించిన హక్కులను అనుసరిస్తూ పెత్తందార్ల ప్రభుత్వాలను ప్రశ్నించే జర్నలిస్ట్ లపై దాడులు జరుగుతూనే ఉన్నాయి . గతంలో జర్నలిస్ట్ లు రాసిన వార్తలకు అధికారులు, పాలకులు సానుకూలంగా స్పందించేవారు .. వ్యవస్థలో జరుగుతున్నా లోపాలపై ప్రశ్నిస్తే, ఆ సమస్యలకు బాధ్యతాయుతమైన పరిష్కార మార్గాన్ని అందించే వారు.

నేడు అక్రమ ఇసుక రవాణా, మైనింగ్ , పీడీఎస్ బియ్యం ,ప్రభుత్వ భూముల కబ్జాలు,దేవాలయ భూముల కబ్జాలు, వెలగని వీధి లైట్లు , శుభ్రపరచని మురికి కాల్వల పరిస్థితి అధ్వాన్నం,గుంతలమయమైన రోడ్లు , మధ్యాహ్న భోజనంలో పురుగులు ,అధికార పార్టీ నాయకుల అవినీతి దందాలు , అనుచరుల అక్రమ వసూళ్లు ,వార్డును పట్టించుకోని వార్డ్ మెంబెర్ నుండి నియోజకవర్గం పట్టించుకోని ఎమ్మెల్యే లపై అన్ని స్థాయిలలో ఏ వార్త రాసిన, ప్రసారం చేసిన తదుపరి సమస్యలు పరిష్కరించే విషయాన్ని మరిచి జర్నలిస్ట్ లపై దాడి చేయడం. కాళ్ళు ,చేతులు విరగొట్టడం, ప్రాణాలు సైతం తీయడం , కుటుంబంలోని మహిళల పై , పిల్లల పై మానసికంగా , శారీరకంగా భయ భ్రాంతులకు గురి చేయడం వంటి సంఘటనలు నిత్యకృత్యం అవుతున్నాయి .జర్నలిస్ట్ లపై దాడి జరిగిన ప్రతిసారి న్యాయస్థానాలను ఆశ్రయించడం ఆ న్యాయ స్థానాలు ఇచ్చే తీర్పు , ప్రభుత్వాలకు ఎన్ని హెచ్చరికలు చేసిన అవి కాగితాల మీద రాతలు గానే ఉన్నాయి.. కానీ రాతలు రాసే జర్నలిస్ట్ ల తలరాతలు మారడం లేదు.

భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు , విధులును పట్టించుకోకుండా దేశంలో , రాష్ట్రంలో ఏ ప్రభుత్వాలు అయితే అధికారంలో ఉంటె ఆ పార్టీలకు అనుగుణంగా వారికి నచ్చిన విధంగా రాజ్యాంగాన్ని అమలు పరుస్తూ వారికి అవసరమయ్యే విధంగా పరిపాలన కొనసాగించడం జరుగుతుంది. ప్రపంచ చరిత్రలో జర్నలిస్ట్ లు ఎన్నో కథనాలు ప్రచురించడం ద్వారా అవినీతి పాలన కొనసాగించిన ప్రభుత్వాలు కూలిపోవడానికి, సరైనా నూతన ప్రభుత్వాలను ఏర్పాటు చేయడానికి జర్నలిస్ట్ లు ఎంతో దోహదపడ్డ సందర్భాలు గుర్తు చేసుకోవాల్సిందే..అలాంటి జర్నలిస్ట్ పై నేడు దాడులు చేయడం వంటి పరిస్థితులను చూసుకుంటే ప్రజలకు ,ప్రభుత్వాలకు వారధిగా ఉన్న వ్యవస్థ పై మూకుమ్మడిగా దాడి చేసిన సంఘటనలను ప్రతి ఒక్క పౌరుడు ఖండించాలి. జర్నలిస్ట్ లపై దాడులు జరిగితే రాజ్యాంగ రక్షణకు , ప్రజాస్వామ్య పరిరక్షణకు బీటలు పారి రాచరిక పాలనకు ప్రశ్నించే గొంతులు దివిటిలు పెట్టి వెతికినా దొరకని పరిస్థితికి చేరుకునే ప్రమాదం ఉంది. చివరకు రాచరికపు పాలనలో ప్రజలు బానిసలుగా బతకాల్సిన పరిస్థితులకు దారి తీయడం జరగొచ్చు.. జర్నలిస్ట్ లపై దాడి చేసిన , ప్రయత్నించిన వారిపై న్యాయ స్థానాలు కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజాస్వామ్య వ్యవస్థ విజయం పొందటానికి నాల్గొవ పాదం అయిన జర్నలిజాన్ని , జర్నలిస్ట్ లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలది , ప్రభుత్వాలది..

ఏ హక్కుల కోసం పోరాటం చేసామో , ఏ స్వేచ్ఛ కోసం వెతికామో , తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తరవాత భావ ప్రకటన, స్వేచ్ఛ స్వాతంత్రల కొరకు ఆశ పడ్డామో నేడు ఆ ఆశలన్నీ అడి ఆశలుగా మిగిలిపోయాయి ..తెలంగాణ రాష్ట్రం సాధించుకోవడం, ఆనాడు ఏర్పడ్డ టిఆర్ఎస్ ప్రభుత్వ 10 ఏండ్ల పాలనలో కూడా ఏనాడు జర్నలిస్ట్ ల సమస్యలపై పరిష్కార మార్గాలు చూపకపోయినా, ప్రశ్నించే గొంతులపై దాడులు చేసినా నాటి ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకోలేకపోయింది. మార్పు కావాలికాంగ్రెస్ రావాలి అనే నినాదంతో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా అదే పరిస్థితులను చవిచూడాల్సి వస్తుంది.. ప్రభుత్వాలు ఎన్ని మారినా ప్రశ్నించే గొంతులను మాత్రం తొక్కి పడేస్తున్నారు..

అందుకే స్వేచ్ఛాయుత భారతదేశంలో ఒక జర్నలిస్ట్ కి ఎప్పుడైతే స్వేచ్ఛ స్వాతంత్రాలను కలిగి ఉంటాడో , భావ ప్రకటన స్వేచ్ఛను పొందుతాడో అప్పుడే నిజమైన జర్నలిజం బ్రతుకుతుందని ఆశ .. శ్వాస ...

వందే మాతరం...



- ఏలే మహేష్ నేత
సీనియర్ జర్నలిస్ట్, కరస్పాండెంట్
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర దిన పత్రిక
సెల్ .9705646377



## బ్రాహ్మణ అపర కర్మల భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు

**విశ్వంభర, కాచిగూడ :** హైదరాబాద్ కాచిగూడ డివిజన్ లో బ్రాహ్మణుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన "బ్రాహ్మణ అపర కర్మల" భవనాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రాహ్మణులు ప్రతి ఒక్కరు ఈ యొక్క భవన సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ భవనానికి తన సొంత నిధులతో నిర్మించిన పోచంపల్లి జయ శ్రీ మోహన్ రావును ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో హిందూ స్మశాన వాటిక ప్రెసిడెంట్ గోపాలరావు, బీఆర్ఎస్ నాయకులు అనిల్ కుమార్, బండ సూరి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## గురు పౌర్ణమి సందర్బంగా కరాటే మాస్టర్స్కు సన్మానం

**విశ్వంభర, రంగారెడ్డి :** షాద్ నగర్ పట్టణంలో యాదవ్ బూడో ఖాన్ కరాటే ఇంటర్నేషనల్ అకాడమీ ఫౌండర్, మాస్టర్ మల్లేష్ యాదవ్ ని గురు పౌర్ణమి సందర్భంగా గుర్తు చేసుకుని మాస్టర్స్, క్రీడాకారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అదేవిదంగా గురు పౌర్ణమి దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ మాస్టర్స్ సాయినాథ్, కారణకోట రమేష్, రామ కృష్ణ, అశోక్, నరేందర్, గోపి, వినయ్, పేరు నాయక్ లను క్రీడాకారులు పూలమాలలతో సన్మానించి గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మాస్టర్స్, క్రీడాకారులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలి

**విశ్వంభర, ఆమనగల్లు :** కడ్తాల మండల కేంద్రంలో శ్రీషిరిడి సత్య సాయి మందిరంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను ప్రధాన అర్చకులు శ్రీ జ్ఞాన ప్రసూనాంబ వెంకటేశ్వర శర్మ, నర్సింహ మూర్తి, భక్త బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం వేకువజామున సాయిబాబాకు అభిషేకం, షిరిడి సాయి వ్రతంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని గురువుల యందు, తల్లిదండ్రుల యందు, తోటి వారితో గౌరవంగా మెలగాలని తెలిపారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవాలయం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నప్రసాద కార్యక్రమాన్ని గ్రామపెద్దలతో కలిసి సర్పంచ్ ప్రారంభించారు. గురు పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జి చెన్న కిషన్ రెడ్డి, మిరియాణం మల్లప్ప, గూడూరు భాస్కర్ రెడ్డి, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## భారతీయ సంస్కృతిలో గురువుకు ఉన్నత స్థానం

**విశ్వంభర, నారాయణఖేడ్ :** భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యంత ఉన్నత స్థానం కలదని మెదక్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ ముత్యం కృష్ణ అన్నారు. ఆదివారం పెద్ద శంకరంపేటలోని ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రీ సరస్వతి శిశు మందిర్లో గురు పౌర్ణమి సందర్భంగా గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆది గురువు వేదవ్యాసుని జయంతి కురస్కరించుకొని గురుదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. భారతీయ సనాతన సంస్కృతిలో అనాదిగా గురు పరంపర కొనసాగుతుందన్నారు. ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని పిలుపునిచ్చారు. అల్లాదుర్గం గ్రామానికి చెందిన రెండు సంవత్సరాల బాలుడు రియాన్స్ రావు గంగాజలి రూపంలో సుమారు1500 రూపాయలను గురుదక్షిణగా సమర్పించారు. మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ. మాజీ ఎంపీటీసీ సుభాష్ గౌడ్. గ్రామ పెద్దలు కిష్టారెడ్డి. జస్వంత్ మల్లేశం. ఆర్ఎస్ఎస్ బాధ్యులు జైహింద్ రెడ్డి సీతారామారావు వీరప్ప సతీష్ గౌడ్.. రవి వర్మ, మల్లేశం, శైలేష్, మధు శ్రీనివాస్, సంతోష్ కుమార్, స్వయంసేవకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మోరంచవాగు, ఘణప సముద్రం చెరువును పరిశీలించిన జిల్లా కలెక్టర్



**విశ్వంభర, భూపాలపల్లి :** లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఆదివారం భారీ వర్షంలో భూపాలపల్లి, గణపురం మండలాలలో కలెక్టర్ పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. భూపాలపల్లి మండలం మోరంచపల్లి వద్ద మోరంచ వాగు ఉధృతిని పరిశీలించి, ఘనపురం మండలంలోని ఘనప సముద్రం నీటి మట్టం, మత్తడి, చెరువు కట్టను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మోరంచవాగు ఉదృతంగా ప్రవహిస్తుందని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే తప్ప ప్రజలు ఇండ్ల నుండి బయటకి రావొద్దని సూచించారు. పశువులను మేతకు బయట వదలకూడదని తెలిపారు. వరద ఉదృతి ఉన్నందున జాలర్లు చేపల వేటకు వెళ్ళొద్దని తెలిపారు. గత సంవత్సరం జూలై నెలలో మోరంచపల్లి గ్రామంలో వరదలు సంభవించి పెద్ద ఎత్తున ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరిగిందని, అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వరద ఉదృతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా కాపాడుకోవాల్సిన భాద్యత మనపై ఉందని స్పష్టం చేశారు. మోరంచవాగు మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తుందని వరద ప్రభావం ఇలాగే కొనసాగితే లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురయ్యే అవకాశం ఉందని, ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. గణపసముద్రం చెరువు నీటిమట్టం రోజు రోజుకు పెరుగుతూ ఉందని నీటిమట్టం పెరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు అప్రమత్తతో ఉండాలని ఆదేశించారు. గణపసముద్రం చెరువు ద్వారా సాగవుతున్న ఆయకట్టు రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, డి.ఈ ప్రసాద్, తహసీల్దార్లు శ్రీనివాస్, మురళీధర్ రావు, ఎంపీడీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ముంపు ప్రాంతాలపై అధికారులు శ్రద్ధ వహించాలి

### కలెక్టర్ రాహుల్ శర్మ




**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలో గత వారం రోజులు నిరంతరాయంగా వర్షాలు కురుస్తున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు తక్షణమే పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రారంభించి క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. డీపీఓ, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్ పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించి అప్డేట్ ఇవ్వాలని ఆదేశించారు. తహశీల్దార్లు, గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు చెరువులు పరిశీలించాలి అన్నారు. గ్రామ స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశాలు, ఐకేపీ సీసీలు క్షేత్రస్థాయిలో గ్రామాలను సందర్శించి జ్వరాలు, డెంగ్యూ, ఇతర కేసులను గుర్తించి తక్షణమే జాగ్రత్తలు తీసుకుని వైద్య సేవలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సిఫారసు చేయాలన్నారు. నీటిపారుదల శాఖ సిబ్బంది ఏఈలు వారి వారి పరిధిలోని చెరువులను తనిఖీ చేయాలని సందర్శించిన ఫోటోలను సమర్పించాలని, ఏదైనా అత్యవసర మరమ్మతులు అవసరమైతే వెంటనే చేపట్టి పూర్తి చేయాలి అన్నారు. ఈఈల ద్వారా నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. గోదావరి వరద మట్టం పెరుగుతోందని, అందుకే మేడిగడ్డ, వరద ప్రభావితమయ్యే గ్రామాలు, రహదారుల గురించి సమాచారం ప్రజలకు చేరవేయాలి అన్నారు. ఆ ప్రాంతంలో రవాణా నియంత్రణ చర్యలు చేపట్టాలి అని ముంపు ప్రాంతాల ప్రజలు ఎగువ సురక్షిత ప్రదేశానికి తరలించాలి అని సూచించారు. వైద్య శాఖ పని చాలా ముఖ్యమని జిల్లా వైద్యాధికారి, సిబ్బంది మరియు ఇతర ప్రోగ్రామ్ వైద్యులు గ్రామాలను సందర్శించి గ్రామ స్థాయిలో పారిశుద్ధ్య కార్యకలాపాలను పరిశీలించి, గర్భిణీ లను గుర్తించి వైద్య సేవలకు ఆసుపత్రులకు తరలించాలి అని అన్నారు. జ్వరాలు మరియు డెంగ్యూ కేసులను గుర్తించి వైద్య సేవలు అందించాలన్నారు. వర్షాలు, పారిశుధ్యం, ఆరోగ్య సమస్యల పరంగా రానున్న 3 రోజులు మరింత క్లిష్టమైనవి. అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, ముంపు సమస్యలపై శ్రద్ధ వహించాలని, ఏదైనా అత్యవసర పరిస్థితులను తన దృష్టికి తేవాలని ఆదేశించారు.



## ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం, కాళేశ్వరం అనుబంధ ఆలయం శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో గురు పౌర్ణమి సందర్బంగా స్వామివారికి ఘనంగా ప్రత్యేక పూజ కార్యక్రమములు నిర్వహించారు. ముందుగా దత్తాత్రేయ స్వామికి అభిషేకం నిర్వహించి తర్వాత అలంకరణ చేసి అర్చన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, కాళేశ్వరం గ్రామస్థులు, భక్తులు, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.




## విక్కీ మాస్టర్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సెలబ్రేషన్స్

**విశ్వంభర, ముషీరాబాద్ :** బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు విక్కీ మాస్టర్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి మెగా సెలబ్రేషన్స్ చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్ గిరి రిటైర్డ్ జడ్జి మధుసూదన్ మరియు బీ.ఆర్.ఎస్ నాయకులు నగేష్ ముదిరాజ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలతో ప్రేక్షకుల్ని అలరించారు. అనంతరం గురువులకు సన్మాన చేశారు. నృత్య గురువులు కృష్ణ ప్రియ, రూప శ్రీ, అనందమయి, శివ జ్యోతి, వేదిక్ గురువు రాజా రాజేశ్వరికి ఘనంగా సన్మానం చేసి వారికి పట్టు చీరలు బహుకరించారు. విక్కీ మాస్టర్ మాట్లాడుతూ ఈ 149 వ గురు పౌర్ణమి కార్యక్రమం ఘనంగా నిర్వహించామని తెలిపారు. ఘన విజయం సాధించడానికి కారణమైన మా నాట్య గురువులు, చిన్నారి కళాకారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ అకాడమీ ప్రతిభ గాల ప్రతి ఒక్క కళాకారునికి ఎల్లవేళలా అండగా ఉంటుంది అని చెప్పారు. జడ్జి మధుసూదన్ మాట్లాడుతూ ఈ రోజు నాకు పండగ వాతావరణం కనబడుతుంది. విక్కీ మాస్టర్ ఆధ్వర్యంలో 149 వ కార్యక్రమం రాబోయే గురు పౌర్ణమి ఉద్దేశించి నిర్వహించడం, గురువులకు సత్కారం చెయ్యడం చాలా గొప్ప విషయం అని అన్నారు. నగేష్ ముదిరాజ్ మాట్లాడుతు గురువులకు సత్కారం చెయ్యడం చాలా గొప్ప విషయమన్నారు. హైదరాబాద్ జిల్లా నలుమూలల నుండి కళాకారులు వారి గురువులతో వచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యడం అనేది చాలా సంతోషంగా భావిస్తున్నానని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విక్కీ మాస్టర్ మరెన్నో చెయ్యాలని కోరుకుంటున్నానని, 150 వ కార్యక్రమం ఈ ఆగస్టు 15 తేదిన ఇంతకంటే ఘనంగా అని అన్నారు.



## కారు వెళ్ళలేని ప్రాంతానికి ట్రాక్టర్ లో వెళ్లిన కలెక్టర్ రాహుల్ శర్మ

**విశ్వంభర, భూపాలపల్లి:** అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వరద ఉగ్రరూపం దాల్చింది. కార్యాలయంలో కూర్చుని మానిటరింగ్ చేయకుండా వర్షం కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యలు క్షేత్రస్థాయిలో పరిశీలించి వరదలు, వర్షాల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు, సమస్యలను నేరుగా తెలుసుకోవాలనే సంకల్పంతో జిల్లాలో అత్యంత మారుమూల మండలమైన పలిమెల వెళ్లారు. కారు వెళ్ళలేని ప్రాంతం కావడంతో ఎస్పీ కిరణ్ ఖరే తో కలిసి ట్రాక్టర్ పై వెళ్లి, అక్కడి నుండి స్పీడ్ బోట్ లో దమ్మూరు గ్రామానికి చేరుకుని ప్రజలతో మమేకం అయ్యారు. వరదలకు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలు గురించి అధికారులకు ఆదేశాలు జారీ చేసి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. చత్తీస్గడ్ సరిహద్దు మారుమూల గ్రామమైన దమ్మూరులో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఇంతటి మారుమూల తీవ్రవాద ప్రభావిత ప్రాంతంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే పర్యటించి సమస్యలు తెలుసుకోవడం పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంతవరకు కుగ్రామమైన మా గ్రామానికి కలెక్టర్, ఎస్పీ రాలేదని ఇలాంటి పరిస్థితుల్లో మా గ్రామానికి వచ్చి మాతో మమేకం కావడం చాలా సంతోషమంటున్నారు గ్రామస్థులు.



## ఈ నెల 23న బీజేపీ మండల స్థాయి కార్యవర్గ సమావేశం

**విశ్వంభర నారాయణఖేడ్ :** పెద్ద శంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో ఈనెల 23న మండల స్థాయి బీజేపీ కార్యవర్గ సమావేశం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పేట మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కరణం పరిణిత హాజరుకానున్నట్లు ఆయన వివరించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన బూత్ స్థాయి బీజేపీ అధ్యక్ష కార్యదర్శులతో పాటు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.



గురు పూర్ణిమ సందర్భాన్ని పురస్కరించుకుని షాద్ నగర్ న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ ఆధ్వర్యంలో కోచ్, మాస్టర్ బాల్ రాజ్ ను, మాస్టర్లు పులిందర్ రెడ్డి, వెంకటేష్ లు కలిసి కోచ్ సన్మానించారు.

## ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకొన్న డాక్టర్ వకుళాభరణం



**విశ్వంభర, సికింద్రాబాద్ :** సకల జనులహితమును కోరేవీ లష్కర్ బోనాలు అని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. ఆషాడ మాసంలో వచ్చే పర్వదినాలలో గ్రామ దేవతలకు నైవేద్యంను బోనాల రూపంలో అమ్మవార్లకు సమర్పించడం సంప్రదాయంగా వస్తుంది అన్నారు. వీటి ప్రత్యేకత గొప్పది అని ఆయన పేర్కొన్నారు. ఆదివారం నాడు లష్కర్ బోనాల సంద ర్భంగా సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు ఆయనతో అమ్మవారి సన్నిధిలో గోత్రనామాలతో అర్చన చేయించారు. శేష వస్త్రం కప్పి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు మీడియా వేదిక వద్ద మాట్లాడారు. అమ్మవారి దయవలన ఇప్పటి వరకు ఏ ఇబ్బందులను అయినా పరిష్కరించుకో గలుగుతున్నామన్నారు. మహంకాళి అమ్మవారు గొప్పశక్తి స్వరూపిణి అని పేర్కొన్నారు. ఒకనాడు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల పరిధిలో కలరా, ప్లేగు వ్యాధులతో సంభవిస్తున్న మరణాలు నిలుపుదల చేయాలని మిలిటరీలో పనిచేస్తున్న సురిటీ అప్పయ్య ప్రార్థనలు ఫలించాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంగా ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయం సికింద్రాబాద్లో వెలిసిందని ఆయన తెలిపారు. శక్తి స్వరూపినియులైన మహంకాళి సింహవాహిని, బంగారు మైసమ్మ, దర్బార్ మైసమ్మ, కనకాల కట్ట మైసమ్మ, నల్ల పోచమ్మ, ఊరపోచమ్మ మొదలగు దేవతలను వేడుకుంటూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సమర్పించే బోనం నైవేద్యం పరమ పవిత్రమైనది అన్నారు. ఆషాడంలో జంట నగరాలలో, రాష్ట్రమంతటా శ్రావణమాసంలో ఈ బోనాలు నిర్వహింపబడుతాయి అన్నారు. ప్రజలందరికీ బోనాల సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# నకిలీ బంగారు బిస్కట్స్‌ను పట్టుకున్న సైబరాబాద్ SOT పోలీసులు

**విశ్వంభర, హైదరాబాద్ :** నకిలీ బంగారు బిస్కట్స్ ను అసలు బంగారు బిస్కట్స్ గా నమ్మించి అమ్మడానికి ప్రయత్నిస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను బాలానగర్ స్పెషల్ ఆపరేషన్ టీం (SOT), జీడిమెట్ల పోలీసులు పట్టుకుని వారి వద్ద నుండి 100 నకిలీ బంగారు బిస్కట్స్ స్వాధీనం చేసుకోవడం జరిగింది. వీటిని కొనడానికి 27 లక్షలు సమకూర్చుకుని వచ్చిన వారు కూడా వారితో ఉన్నారు. అదే సమయంలో SOT పోలీసులు దాడి చేసి ముఠాను పట్టుకోడంతో కొనడానికి వచ్చిన బాధితులు పెద్ద మొత్తంలో డబ్బు పోకుండా రక్షించినదుకు SOT పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ముఠా సభ్యులు ఉప్పల్ సరస్వతి నగర్ కు చెందిన యాశాల కామేశ్వర రావు, గుంటూరు గోరంట్ల చెందిన వేముల పుల్లా రావు, గుంటూరు నాగిరెడ్డి పాలెం, బెల్లంకొండ చెందిన బత్తుల సాంబశివ రావు ఈ ముగ్గురు ఇంతకు ముందు కూడా ఇలాంటి నేరాలకు పాటుపడం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ ముఠా ఇంకా ఎంత మందిని మోసం చేసింది అనే కోణంలో పోలీసు విచారిస్తున్నట్లు తెలిసింది.



# భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

• ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి



**విశ్వంభర, నారాయణఖేడ్ :** భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏ సమయంలో అయినా ఏలాంటి ప్రమాదం తలెత్తిన క్షణాలలో అక్కడకు చేరుకొనే విధంగా పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉంటారని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లాలోని పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఎస్పీ భారీ వర్షాల కారణంగా ప్రజలను అప్రమత్తంగా ఉంచే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. విపత్కర సమయాల్లో సహాయం కోసం పోలీస్ కంట్రోల్ రూం నెంబర్ 87126 57888 కి కానీ, డయల్100కి లేదా దగ్గరలో ఉన్న పోలీస్ వారికి సమాచారం అంధిస్తే తక్షణ సహాయక చర్యలు చేపడతామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే స్థానిక పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ డి. ఉదయ్ కుమార్ రెడ్డి జిల్లా ప్రజలకు సూచించారు. నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ఎస్పీ పోలీస్ అధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. రాగల 24 నుండి 48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా పోలీస్ యంత్రంగాన్ని అప్రమత్తం చేయడం జరిగిందని అన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య తలెత్తినా త్వరితగతిన పోలీస్ అధికారులు అక్కడకు చేరుకొని సమస్యను పరిష్కరించడం జరుగుతుంది అన్నారు. జిల్లా ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ పరంగా తగిన ఏర్పాట్లతో ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రజలు పోలీసు వారి సలహాలు, సూచనలు పాటించాలన్నారు. మంజీరా నదీ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాగే వాగులు వంకలు మత్తడి దూకే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు తమ భద్రతను దృష్టిలో ఉంచుకొని వాటి వద్దకు వెళ్లవద్దన్నారు. నిరంతర వర్షాల వల్ల వాగులు, కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువులు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉంది. కాబట్టి వాటి వద్దకు వెళ్ళరాదు. రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలి, వర్షాలు పడేటప్పుడు విద్యుత్ స్తంభాలను గాని, వైర్లనుగానీ చేతులతో తాకవద్దు. చెట్ల కింద, పాడైన భవనాలు కింద, శిధిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండరాదు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్స్ ముట్టుకోరాదు. స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, ఆర్&బి, వైద్య శాఖాధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడైనా వరద ఉధృతితో రోడ్లు తెగిపోయినా, ఉధృతంగా ప్రవహించినా అక్కడికి గ్రామ ప్రజలు వెళ్లకుండా, రెండు దిక్కులా ప్లాస్టిక్ కోన్స్, బారిగేడ్స్,హెచ్చరిక గల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలు, అలుగుల దగ్గర, ప్రధాన రహదారులపై ప్రవహించే వాగులు, వంకల దగ్గర నీటి ప్రవాహం గురించి ముందస్తు సమాచారం తెలుసుకొని, ప్రత్యక్షంగా వెళ్లి పర్యవేక్షించి పోలీసు అధికారులు, సిబ్బంది అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా ప్రయాణించండి. వర్షానికి రోడ్లు కొట్టుకుపోయి, గుంతలు ఏర్పడి అందులో నీరు నిల్వ ఉండి ఆ గుంతలు వాహనదారులకు కనిపించక ప్రమాదానికి గురై ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉంది. కావున జాగ్రత్తగా, నెమ్మదిగా చూసుకొని ప్రయాణించండి. వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జిల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదు. పిల్లలు, మహిళలు, వృద్ధులు తోడులేకుండా బయటకు వెళ్లరాదని ఎస్పీ సూచించారు.



## ఘనంగా గురుపూర్ణిమ మహోత్సవం

**విశ్వంభర, బాలానగర్ :** ఘనంగా గురుపూర్ణిమ మహోత్సవం శ్రీ సాయి నాగేంద్రాలయం, సాయి నగర్, బాలానగర్ ఘనంగా నిర్వహించారు. భారీగా భక్తులు పాల్గొని పూజలు జరిపారు. ఉదయం నుండి సైనాగేంద్రదేవాలయం కిటకిటలాడుతున్నది. ఈ సందర్భంగా సాయిబాబుకు అభిషేకం, విశేష గురుపూజ, గురుచరిత్ర పారాయణ మధ్యాహ్నం హారతి భోజన కార్యక్రమం ఆలయ కమిటీ ఏర్పాటు చేశారు. సాయంత్రం సాయినాధుని పల్లకీసేవ ఊరేగింపు, రేపు నూట ఎనిమిది అష్టోత్తర కళశాల అభిషేకం, మహాకుంభ సంప్రోక్షణ, కార్యక్రం వైభవంగా నిర్వహించనున్నామని దేవాలయ చైర్మన్ అంబటి సునీల్ కుమార్ తెలియజేశారు.



## జయరాజ్ ని పరామర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**విశ్వంభర, హైదరాబాద్ :** ఇటీవల అనారోగ్యానికి గురైన ప్రముఖ కవి, పాటల రచయిత, గాయకుడు జయరాజ్ ని నిమ్స్ ఆసుపత్రిలో మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. జయరాజ్ ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. జయరాజ్ త్వరగా కోలుకుని బయటకు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.




## కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**విశ్వంభర, భీంగల్ :** భీంగల్ మండలం కుప్కల్ గ్రామానికి చెందిన మాజీ భీంగల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ బాల్కొండ నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గుణ్ వీర్ రెడ్డి ఈరోజు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టి ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టిలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనకు ఆకర్షితులై, నియోజకవర్గంలో ముత్యాల సునీల్ కుమార్ నాయకత్వంలో ప్రజాసేవ చేయడానికి కాంగ్రెస్ పార్టిలో చేరుతున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఢిల్లీకి చేరిన ఏపీ రాజకీయం




### పార్లమెంటు వేదికగా టీడీపీ, వైసీపీ బిగ్ వార్..!

**విశ్వంభర, న్యూఢిల్లీ :** ఏపీలో అధికార ఎన్డీయే కూటమి, విపక్ష వైసీపీల మధ్య పీక్స్‌కు చేరిన పొలిటికల్ ఫైట్‌లో ఢిల్లీ ట్విస్ట్ ఆసక్తికరంగా మారింది. పార్లమెంటు సమావేశాల కోసం టీడీపీ, వైసీపీ వ్యూహ ప్రతి వ్యూహాలు పన్నుతున్నాయి. పార్లమెంటు సమావేశాల్లో ఎలాంటి వ్యూహం అనుసరించాలో టీడీపీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు. కేంద్రం నుంచి అధికంగా నిధులు రాబట్టడానికి ఎంపీ లందరికి రాష్ట్రంలో ఉన్న మంత్రిత్వ శాఖల్లో ఒక డిపార్ట్‌మెంట్, కేంద్రం మంత్రిత్వ శాఖల్లోని ఒక డిపార్ట్‌మెంట్ అటాచ్ చేస్తారు. అలా రాష్ట్రానికి కేంద్రానికి మధ్య ఒక వారధిగా ఎంపీలు వ్యవహరిస్తారు. తద్వారా అదనంగా నిధులు తీసుకుని రావడానికి ప్రయత్నం చేస్తారు. ఏపీ అభివృద్ధే ప్రధాన అజెండాగా ఎంపీలు పోటీ పడి పని చేయాలని నారా చంద్రబాబు నాయుడు సూచించారు.

వైఎస్ జగన్ ధర్నాపై సమావేశంలో ప్రస్తావన రావడంతో.. ఢిల్లీలో వైఎస్ జగన్ ఏం చేస్తారో ముఖ్యం కాదని, మనమేం చేయాలో ముఖ్యమని నేతలకు సూచించారు చంద్రబాబు. మరోవైపు, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై వైసీపీ ఎంపీలకు దిశా నిర్దేశం చేశారు వైఎస్ జగన్. తాడేపల్లి నివాసంలో ఎంపీ లతో వైఎస్ జగన్ సమావేశమైయ్యారు. ఢిల్లీలో తాను చేయబోయే ధర్నాపై చర్చించారు. ఏపీ రాష్ట్రంలో జరుగుతోన్న దాడులు, హత్యలను ఢిల్లీ వేదికగా కేంద్రం, దేశం దృష్టి వైఎస్ జగన్ తీసుకెళ్లాలన్నారు. దీనిపై పార్లమెంటులో వైసీపీ గళం వినిపించాలన్నారు. ఉభయ సభల్లో ఏ విధంగా వ్యవహరించాలో ఎంపీలకు సూచించారు. వైసీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులను దేశ వ్యాప్తంగా తెలియ జేయాలని వైఎస్ జగన్ సూచించారు. రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోం మంత్రికి ఫిర్యాదు చేయాలని వైసీపీ ఎంపీలు నిర్ణయించారు. అటు దేశ రాజధానిలో వైఎస్ జగన్ ధర్నా, ఇటు పార్లమెంటులో టీడీపీ, వైసీపీ ఫైట్‌కి రంగం సిద్ధమైంది. దీంతో ఢిల్లీ పొలిటికల్ స్క్రీన్‌పై ఏపీ పొలిటికల్ సినిమా రచ్చకు కౌంట్ డౌన్ షురూ అయింది.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ వాటా ఎంత?



**విశ్వంభర, హైదరాబాద్ :** పార్లమెంటులో ఈనెల 23వ తేదీన కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ పద్దుపై రాష్ట్ర ప్రభుత్వం భారీ ఆశలు పెట్టుకుంది. పెండింగులో ఉన్న ప్రాజెక్టులతోపాటు కొత్తగా మరి కొన్నింటికి నిధులు ఇవ్వాలని ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఈసారైనా నిధులు ఆశించిన స్థాయిలో దక్కుతాయని ఎదురుచూస్తోంది. గత మూడేళ్లుగా కేంద్రం నుంచి గ్రాంట్ల పద్దు కింద పూర్తిస్థాయిలో నిధులు రాక తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఇటీవల ప్రధాని మోదీకి సైతం సీఎం రేవంత్‌రెడ్డి విన్నవించారు. గతేడాది రాష్ట్ర బడ్జెట్‌లో కేంద్రం నుంచి గ్రాంట్లుగా రూ.41,259 కోట్లు వస్తాయని రాష్ట్రం అంచనా వేస్తే.. చివరికి రూ.9,729 కోట్లు మాత్రమే వచ్చాయి. ఈసారి అలా జరగకుండా కేంద్రం నుంచి ఎన్ని నిధులు వస్తాయనేది పక్కా అంచనాలతో రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించాలని కసరత్తులు చేస్తోంది. కేంద్రం మద్దతుతో రాష్ట్రంలో స్థాపించాల్సిన వివిధ ప్రాజెక్టులు, సంస్థలపై తెలంగాణ ఒక జాబితాను రూపొందించింది. అక్కడి నుంచి వచ్చే నిధులను ఆధారంగా చేసుకుని, రాష్ట్ర ప్రభుత్వం వీటిని ప్రారంభించే ఆలోచనతో ఉంది.



## కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీగా వరద

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీ వర్షాల వల్ల వరద నీరు భారీగా వచ్చి చేరుతుంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని సరస్వతి బ్యారేజ్ కు 18 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా బ్యారేజీ లోని 66 గేట్లు ఎత్తి నీటిని మొత్తం కిందికి విడుదల చేస్తున్నారు. ఈ బ్యారేజీ లెవెల్ 119 మీటర్లు ఉండగా ఇప్పటికే 107 మీటర్ల నీరు వచ్చి చేరుతుంది. అలాగే మేడిగడ్డ బ్యారేజీ లోకి 4,87,010 క్యూసెక్కుల నీరు వచ్చే చేరుతుండగా బ్యారేజీ లోని 85 గేట్లు ఎత్తి మొత్తం నీటిని కిందికి విడుదల చేస్తున్నారు. బ్యారేజీ నీటిమట్టం 11 మీటర్లు ఉండగా 94 మీటర్ల మీద నీరు ప్రవహిస్తుంది. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి నీటిమట్టం గంట గంటకు పెరుగుతుంది. మహారాష్ట్రలోని గడిచిరోలి జిల్లాలో భారీ వర్షాల వల్ల వరద నీరు వచ్చి చేరడంతో పుష్కర ఘాట్ లోని మెట్లు మునిగి వరద నీరు ప్రవహిస్తోంది. కాళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 9.7 మీటర్లగా నమోదవగా మరింత పెరిగే అవకాశం ఉంది. జిల్లా కలెక్టర్ జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ వరద ఉద్ధృతిని పర్యవేక్షిస్తున్నారు. స్థానిక పోలీసులు రెవెన్యూ సిబ్బంది గోదావరి పరివాహక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు తగు సూచనలు ఇస్తున్నారు.



## శ్రీ బగళాముఖి శక్తి పీఠంలో గురుపౌర్ణమి వేడుకలు

**విశ్వంభర, మెదక్ :** మెదక్ జిల్లా శివ్వంపేటలోని శ్రీ బగళాముఖి శక్తి పీఠంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలోని దక్షిణామూర్తితోపాటు వేదవ్యాసుడు, శంకర భగవత్పాదుల విగ్రహాలకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ శ్రీ సూక్తమహా మంత్ర విధానంలో అష్టోత్తర శతనామ హరిద్రార్చన చేశారు. అనంతరం బగళాముఖి మహా మంత్ర హవనం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో కొలువుదీర్చి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. బగళాముఖ శక్తి పీఠ ఉపాసకులు శాస్త్రుల వేంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో బగళాముఖి ట్రస్టు సభ్యులు జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్ , రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురుపూర్ణిమ సందర్భంగా గురుత్రయానికి అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం శివకుమార్ గౌడ్ తల్లిదండ్రులు అంజమ్మ జ్ఞాపకార్థం భక్తులకు అన్నదానం చేశారు. 15 మంది వికలాంగులతోపాటు అంధులు, అందులకు, మూగ బాలలకు శ్రీ గురు పీఠం ఫౌండర్ చైర్మన్ శ్రీ శివకుమార్ గౌడ్ దంపతులు శ్రీ గురు పీఠం అధినేత శాస్త్రుల వెంకటేశ్వర శర్మ చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేశారు.



## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

• భోగారం ప్రాథమికోన్నత పాఠశాల 2002-03 ఏడవ తరగతి విద్యార్థులు

**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని బోగారం గ్రామానికి చెందిన 2002–03 సంవత్సరంలో ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం గ్రామంలోని వికాస్ ఫంక్షన్ హాల్ లో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గత జ్ఞాపకాలను, చిన్ననాటి మధుర స్మృతులను, నెమరు వేసుకుంటూ ఎవరెవరు ఏ రంగాలలో స్థిరపడ్డారో చర్చించుకుని ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. అనంతరం గురు పౌర్ణమి పురస్కరించుకొని తమకు విద్యనభ్యసించిన గురువులకు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి అధ్యాపక బృందం, లక్ష్మీనారాయణ, శ్రీరాములు, మధ్యపూరి వెంకటేశం, మంజుల, పద్మా, మమత, బోగారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి లు పాల్గొని తమ విద్యార్థులు భవిష్యత్తులో ఇంకా అభ్యున్నతి సాధించి మంచి ఉన్నత స్థాయిలో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని విద్యార్థినీ విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, వనం నాగమణి, బొడ్డు పల్లిచంద్రకళ, గుర్రం సరస్వతి, రాపోలు నాగమణి, దోర్నాల విజయశాంతి, సుంకి ప్రియాంక, భోగ మాధవి, మెట్టు వనజ, బొడ్డుపల్లి నాగలత, దోర్నాల లావణ్య, బద్దుల పారిజాత, జెల్లా గీత, బొడ్డుపల్లి రాధ, మేడి కవనిత, కంజు నాగమణి, మధ్యపురి సత్యవతి, చలమల్ల స్వాతి, గోగు స్వాతి, పాపని సంధ్యారాణి, మేడి కృష్ణ, కందగట్ల గణేష్, జెల్లా సురేష్, చెరుకు మల్లికార్జున్, రాపోలు చిరంజీవి, రత్నం కుమార్, చుక్క అనిల్, మేడి ఆంజనేయులు, గుంజె మహేష్, గుర్రం సురేష్, కనుకు మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.




## జర్నలిస్ట్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ నూతన కార్యవర్గ కమిటీ

**విశ్వంభర, దేవనకొండ :** దేవనకొండ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ నూతన కార్యవర్గ కమిటీ ని దేవనకొండ మండల కేంద్రంలో స్థానిక సీఎల్ఆర్ ఆఫీసు నందు ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాప్ జిల్లా అధ్యక్షులు నరేష్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్, తాలూకా అధ్యక్షులు సుధాకర్ లు పాల్గొన్నారు. జాప్ యూనియన్ మూడు దశాబ్దాల పాటు జర్నలిస్టు ల సంక్షేమం కోసం పాటుపడుతూ అహర్నిశలు కృషి చేసిందని వారు పేర్కొన్నారు. జర్నలిస్ట్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ మండల గౌరవ అధ్యక్షులు చింతమాను రంగన్న, మండల అధ్యక్షులు చిన్న, ప్రధాన కార్యదర్శి ఈ.ధనుంజయ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ భీమలింగడు, జాయింట్ సెక్రెటరీగా నూర్ భాషా, కోశాధికారి వై సుజాత, కార్యవర్గ సభ్యులుగా కే లక్ష్మీనారాయణ శెట్టి ఏం బజారి, పులి నరేష్, కృష్ణ, ఆనందు, రామకృష్ణ లను జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది.



నేరేడుచర్లలో గంజాయి అమ్ముతున్న ఐదుగురు వ్యక్తులు అరెస్ట్ చేసిన పోలీసులు. వారి నుండి100 గ్రాముల గంజాయి, మొబైల్ ఫోన్ లు స్వాధీనం చేసుకున్నారు.



తెలంగాణలో గత కొన్ని నెలలుగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య పలు అంశాలపై వాగ్వాదం కొనసాగుతోంది. ఈరోజు కూకట్‌పల్లిలో క్లియో స్కిన్ క్లినిక్ ప్రారంభోత్సవంలో రెండు పార్టీల నాయకులు (మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు, ఎంపీ మల్లు రవి తదితరులు) ఒకే ఫ్రేమ్‌లో ఉల్లాసంగా ఉన్నారు.

## కులగణన చేస్తే శాసించే స్థాయికి బీసీలు



**విశ్వంభర, భూపాలపల్లి :** దేశంలో బీసీ కులగణన చేస్తే ఆశించే స్థాయి నుండి శాసించే స్థాయి వరకు బీసీలు ఎదుగుతారని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ అన్నారు. ఆదివారం అయన పాత్రికేయులతో మాట్లాడారు. బీసీలకు జనాభా ప్రాతిపాదికన వాటా, రిజర్వేషన్లు దక్కాలంటే బీసీలు ఐక్యంగా ఒకటవ్వాలన్నారు. దేశంలో కులగణన చేపడితే 60 శాతం పైగా ఉన్న బీసీలే ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ఉంటారన్నారు. రాజకీయ పార్టీలు బీసీల లెక్కలు తీయకుండా తొక్కి వేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీసీ కులగణన చేస్తామని ప్రకటించిన బీజేపీ. అధికారంలోకి రాగానే మాట మార్చి బీసీ కులాల లెక్కలు తీస్తే దేశ సమగ్రత దెబ్బతింటుందని కొత్త రాగం అందుకుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన చేసి బీసీలకు సామాజిక న్యాయం జరిగేలా చూడాలని. లేదంటే బీజేపీ బీసీ వ్యతిరేక పార్టీగా నాటి మండల్ కమిషన్ నుండి నేటి మోదీ ప్రభుత్వం వరకు చరిత్రలో మిగిలిపోతుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.





# ఉజ్జయిని మహాకాళి అమ్మవారిని దర్శించుకున్న రేవంత్ రెడ్డి



- పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లింపు
- బోనం సమర్పించుకున్న కిషన్ రెడ్డి దంపతులు
- అమ్మవారికి తొలిబోనం పెట్టిన పొన్నం ప్రభాకర్
- యూఎస్ కన్సులేట్ జనరల్ జెన్నిఫర్ ఎ లార్సన్ పూజలు

**విశ్వంభర, సికింద్రాబాద్ :** ఉజ్జయిని మహాకాళి బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కాగా ఉదయం సీఎం రేవంత్ రెడ్డి ఉజ్జయిని మహాకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి రేవంత్ రెడ్డికి ఆశీర్వచనాలు అందించారు. రేవంత్ రెడ్డి వెంట మంత్రి పొన్నం ప్రభాకర్, దానం నాగేందర్ తదితరులు ఉన్నారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం సీఎం రేవంత్ రెడ్డి శంషాబాద్ నుంచి ఢిల్లీకి పయనమయ్యారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తెల్లవారు జామునుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో భక్తులు క్యూలైన్లలో వేచిఉన్నారు. దీంతో ఆలయం వద్ద ఆధ్యాత్మిక శోభ వెల్లివిరసింది. ఇదిలాఉంటే తెల్లవారు జామున అమ్మవారికి మహా హారతి, కుంకుమ, పుష్ప అర్చనలు ఆలయ అర్చకులు నిర్వహించారు.

**అమ్మవారిని దర్శించుకున్న కిషన్ రెడ్డి దంపతులు**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దంపతులు ఉజ్జయిని మహాకాళి అమ్మవారిని దర్శించుకొని బోనం సమర్పించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో కొన్ని వందల సంవత్సరాల నుంచి బోనాల పండగ సంప్రదాయం ఉందని అన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు కిషన్ రెడ్డి చెప్పారు. రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ అమ్మవారిని దర్శించుకున్నారు.

**అమ్మవారికి మొదటి బోనం సమర్పించిన పొన్నం ప్రభాకర్**

సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి అమ్మవారిని హైదరాబాద్ ఇన్‌ఛార్జ్, మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. ఆయనతో పాటు ఏఐసీసీ ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ, యూఎస్ కన్సులేట్ జనరల్ జెన్నిఫర్ ఎ లార్సన్ దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న పొన్నం ప్రభాకర్.. మొదటి బోనం సమర్పించారు. అనంతరం ఉజ్జయిని మహాకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... 'అమ్మవారి దయవల్ల వర్షాలు సమృద్ధిగా పడి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలి. బోనాల జాతరకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేశాం. వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు హైదరాబాద్ నగర ప్రజలు వారికి ఆతిథ్యం ఇచ్చి.. అమ్మవారి దర్శనం కలిగేలా చూడాలి. ప్రజల సహకారంతోనే జాతర విజయవంతం అవుతుంది. హైదరాబాద్ నగరంలో జరిగే బోనాల జాతరను విజయవంతంగా నిర్వహిస్తాం' అని అన్నారు.



## సూసైడ్ నోట్ రాసి ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**విశ్వంభర, చైతన్యపురి:** కార్పొరేట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ మధ్య కాలంలో ఎక్కువగా ఆత్మహత్య చేసుకుంటున్నారు. అందుకు కారణాల గురించి మాత్రం అంతు చిక్కడం లేదు. కళాశాల యాజమాన్యం వేధింపులా లేక మరేదైనా అనేది క్లారిటీ రావడం లేదు. తాజాగా సూసైడ్ నోట్ రాసి ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. హైదరాబాద్ – చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం చేదురుబావి తండాకు చెందిన వేణుశ్రీ అనే యువతి శ్రీచైతన్య కాలేజీలో సెకండియర్ చదువుతోంది. అయితే ఆ యువతి తన హాస్టల్ గదిలో సూసైడ్ నోట్ రాసి ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. స్నేహితులు గమనించి ఆసుపత్రికి తరలించారు. కళాశాల యాజమాన్యం వేధింపులతోనే తమ కుమార్తె ఆత్మహత్యకు యత్నించిందని తల్లి దండ్రులు ఆరోపిస్తున్నారు.



## బాత్రూంలో ముగ్గురు అనుమానాస్పద మృతి

**విశ్వంభర, సనత్ నగర్ :** హైదరాబాద్‌లోని సనత్‌నగర్ ఏరియాలోని ఓ అపార్టుమెంట్ బాత్‌రూంలో ముగ్గురు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. సనత్‌నగర్ జెక్ కాలనీలోని ఆకృతి ప్రెసిడెన్సీ అపార్టుమెంట్ రెండో అంతస్తులోని ఫ్లాట్‌లో ఈ ముగ్గురి మృతదేహాలు ఉన్నాయి. ఈ మిస్టరీ మృతి పై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సనత్‌నగర్‌లో జెక్ కాలనీలోని అపార్టుమెంట్‌లో ఆర్.వెంకటేశ్(55), మాధవి(50), హరి (30) నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం పనిమనిషి ఇంటికి వచ్చినప్పుడు ఎవరూ కనిపించలేదు. దీంతో బాత్‌రూమ్‌లో ఉన్నారేమోననుకుని ఇంట్లో పనిచేసి వెళ్లిపోయింది. తిరిగి సాయంత్రం 3 గంటల సమయంలో వచ్చినప్పుడు కూడా ఇంట్లో ఎవరూ కనిపించలేదు. అనుమానం వచ్చి బాత్‌రూమ్ వైపు చూడగా డోర్ లాక్ చేసి ఉంది. అనుమానంతో స్థానికులకు సమాచారం అందించగా అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ డోర్ పగులుగొట్టి చూశాడు. అప్పటికే ముగ్గురు విగతజీవులుగా పడి ఉన్నారు.



## మేడిగడ్డపై ముఖ్యమంత్రి రేవంత్ సమీక్ష...

**ఢిల్లీ:** మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు, పరీక్షలు,కమిషన్ విచారణ తదితర అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ, రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం సమావేశమయ్యారు. ఢిల్లీలో శనివారం జరిగిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా అంశాలపై ముఖ్యమంత్రి తన అభిప్రాయాలను వారికి తెలియజేశారు. సోమవారం ఢిల్లీలో జరగనున్న ఎన్‌డీఎస్‌ఏ సమావేశంలో అధికారులు, ఇంజినీర్లు సమావేశంపైన ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు.




## దేశంలో ఎక్కడ లేని సంప్రదాయం తెలంగాణలోనే ఉంది : ఈటల రాజేందర్

**విశ్వంభర, సికింద్రాబాద్ :** దేశంలో ఎక్కడ లేని సంప్రదాయం కేవలం ఒక్క తెలంగాణలోనే ఉందని మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఇవాళ బోనాల పండుగ సందర్భంగా సికింద్రాబాద్ ఉజ్జయిని మహాంకాళి అమ్మవారి టెంపుల్ ని సందర్శించారు ఈటల రాజేందర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆషాడ మాసంలో ఆడబిడ్డలందరినీ కూడా తల్లీ తల్లిగారింటికి తోలుకొని వచ్చి ఆ ఆడబిడ్డను గౌరవించుకొని పసుపు బియ్యం పెట్టుకొని ఆడబిడ్డల ఆశీర్వాదం తీసుకొని గౌరవించుకొనే సనాతన సంప్రదాయం దేశంలో ఎక్కడ లేదు. అది కేవలం తెలంగాణ ప్రాంతం లో మాత్రమే ఉంది. బతుకమ్మను ఆడుకున్న లక్ష్మీ దేవతలాగా ఆ పండుగను కూడా ఇలాగే మళ్లీ పూజించుకుంటాం. దసరా పండుగను కూడా కుటుంబ సమేతంగానే జరుపుకుంటాం. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరూ చల్లగా ఉండాలని, మంచి వర్షాలు పడి పాడి పంటలతో రైతులు సంతోషంగా ఉండాలని కోరారు. అలాగే ఏ బాధలు లేకుండా, ఏ రోగాల బారిన పడకుండా ప్రజలందరినీ కూడా చల్లగా దీవించమని అమ్మవారికి మొక్కులు చెల్లించినట్టు తెలిపారు ఎంపీ ఈటల రాజేందర్.

## పెద్ద వాగు కొట్టుకుపోవడంపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఆగ్రహం



**విశ్వంభర, అశ్వరావుపేట:** పెద్ద వాగు కొట్టుకోవడంపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఆగ్రహం నలుగురు అధికారులకు మెమోలు వర్షకాలనికి ముందు పెద్దవాగు ప్రాజెక్టు స్థితిగతులు ఏంటి అని తనిఖీలు చేశారా?? పెద్దవాగుకు సంబంధించిన సమగ్ర వివరాలు మరియు ప్రాజెక్టు పూర్తిగా కొట్టుకపోవడానికి గల కారణాలు పై నివేదిక ఇవ్వాలని పేర్కొంది. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ప్రాజెక్టు పరిధిలో 30 మంది పని చేయాల్సి ఉండగా.. కేవలం 10 మందే పని చేసినట్టు సమాచారం. పెద్దవాగు ప్రాజెక్టు విషయంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించారు అని ఈఈ సురేష్ కుమార్, డీఈఈ కృష్ణ, ఏఈఈ కృష్ణ మరియు ఇంకో ఇతర అధికారి పై చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర నీటిపారుదల శాఖ సెక్రటరీ కి లేఖ రాసిన భద్రాద్రి జిల్లా చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి.

## భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

- గోదావరి ఉద్రితి పై నిరంతరం నిఘా పెట్టండి..
- రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**విశ్వంభర హైదరాబాద్:** రాష్ట్రంలో విస్తృతంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్ లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఆదివారం సాయంత్రం అన్ని జిల్లాల్లో వరద పరిస్థితి ని సమీక్షించారు.జిల్లా యంత్రాంగం సహాయ పునరావాస చర్యల్లో నిమగ్నమైప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలతోపాటు గోదావరి ఉధృతి వల్ల అక్కడి పరివాహ ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగకుండా రెస్క్యూటీమ్‌లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాల ను వినియోగించాలని అధికారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముంపు ప్రాంతాల్లో చేపట్టవలసిన రక్షణ సంబంధిత చర్యల గురించి ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. .జిల్లాల కలెక్టర్లు ఏవిధమైన ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా సంబంధిత ప్రభుత్వ విభాగాలతో కలసి ముందు జాగ్రత చర్యలు తీసుకోవాలని తెలియచేశారు. ప్రధానంగా వాగుల వద్ద తగు బందోబస్తును ఏర్పాటు చేసి, ప్రమాదకరంగా ప్రవహించే వాగులను ప్రజలు దాటకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాల్లో కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలని, పోలీస్ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని తెలియచేశారు. ఏ విధమైన సహాయం కావాలన్న రాష్ట్ర రాజధానికి ఏ సమయంలోనైనా సంప్రదించవచ్చునని మంత్రి అన్నారు. ముఖ్యంగా గోదావరి ఉధృతి పై నిరంతరం మానిటరింగ్ చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

## రేపు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

- పెద్ద వాగు ప్రాజెక్టు పరిధిలో ముంపు గ్రామాల సందర్శన
- నేలకొండపల్లి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశ్వంభర, ఖమ్మం : తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సోమవారం పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని పెద్దవాగు ప్రాజెక్ట్ ను పరిశీలించి, భారీ వర్షాలకు ఈ ప్రాజెక్టు పరిధిలో ముంపునకు గురైన లోతట్టు గ్రామాలను సందర్శిస్తారన్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి మండల కేంద్రంలో నూతన డ్రెయినేజీ నిర్మాణ పనులకు, బోదులబండ గ్రామం వద్ద రోడ్డు అభివృద్ధి పనులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని దయాకర్ రెడ్డి తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## ఓపెన్ కాస్ట్ మైన్ నిర్వాసితులకు పరిహారం చెల్లించండి

- సింగరేణిని ఆదేశించిన మంత్రి శ్రీధర్ బాబు



**విశ్వంభర, హైదరాబాద్ :** లగ్నాపూర్ ఓపెన్ కాస్ట్ మైన్ కోసం సింగరేణి కాలసీర్ సేకరించిన భూమిలో ఇళ్లు నిర్మించుకున్న 280 మందికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి కింద పరహారం చెల్లింపు విషయమై లబ్ధిదారులతో చర్చలు జరపాలని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. మంథని నియోజకవర్గం రామగిరి మండలం లగ్నాపూర్ లో సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ మైన్ కోసం 2012 లో 103 ఎకరాల భూమి సేకరించింది. అందులోని 466 ఇళ్లకు నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ కింద 721 మందికి, ఒక్కో పౌరుడికి రూ.7.5 లక్షల చొప్పున చెల్లించింది. నివాసాలు కోల్పోయినందుకు, మనుషుల పునరావాసానికి సింగరేణి మొత్తం రూ.145 కోట్లు విడుదల చేసింది. ఈ క్రతువంతా ముగిసి భూమి సింగరేణి పరమైన తర్వాత కొందరు అదే భూమిలో 1400 ఇళ్లు నిర్మించుకుని నష్టపరిహారం కోరారు. అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న శ్రీధర్ బాబు చొరవతో వారికి రూ.30 కోట్ల పరిహారం అందిచింది బొగ్గు సంస్థ. నిర్వాసితులుగా చెబుతున్న 280 మందికి ఆర్ అండ్ ఆర్ చెల్లింపులో చట్టపరమైన అడ్డంకులు ఉన్నాయని అధికారులు మంత్రి దృష్టికి తేగా వారందరితో మాట్లాడి మానవతా దృక్పథంతో పరిహారం అందించి సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.
సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో సింగరేణి సిఎండీ నేనావత్ బలరామ్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీహర్ష కోయా, మంథని ఆర్డీవో హనుమా నాయక్, సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జి.వి రెడ్డి, రామగుండం-3 జిఎం ఎన్. సుధాకర్ రావు, జిఎం ఎస్టేట్స్ వెంకటయ్య, ఎస్టేట్ ఆఫీసర్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ, చెల్లిని నాన్న చంపేశాడు..

**గుక్కపెట్టి ఏడ్చేసిన ఇద్దరు చిన్నారులు**

**విశ్వంభర, సికింద్రాబాద్ :** హైదారాబాద్ మహానగరంలో దారుణం వెలుగు చూ సింది. అనుమానం మూడు ప్రాణాలను బలి తీసుకుంది. ఓ వ్యక్తి తన భార్యను, పాపను అత్యంత పాశవికంగా హతమార్చాడు. అనంతరం తాను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. సికింద్రాబాద్ పరిధిలోని బోయిన్ పల్లిలో జరి గిన ఈ సంఘటన స్థానికంగా సంచలనం రేపింది. మహారాష్ట్రకు చెందిన గణేష్ నాలుగు నెలల క్రితం బతుకు దెరువు కోసం హైదరాబాద్ వచ్చాడు. భార్య స్వప్న, ముగ్గురు పిల్లలతో కలిసి బోయిన్ పల్లిలో నివాసం ఉంటున్నాడు. అయితే కొన్ని రోజులుగా భార్య స్వప్నపై అనుమానం పెంచుకున్న గణేష్ ఘర్షణ పడుతున్నాడు. ఈ క్రమంలోనే మరోసారి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో పది నెలల చిన్న పాప తోపాటు భార్య స్వప్నను గొంతు నులిమి హతమార్చాడు. భార్య, పిల్లల్ని చంపేసి అనంతరం తాను కూడా అల్వాల్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకుముందే నిందితుడు గణేష్ పోలీస్ స్టేషన్ కు ఫోన్ చేసి చెప్పి మరీ తాను హత్య చేసిన విషయాలను పోలీసులకు చెప్పాడు. అంతేకాక, తాను కొద్దిసేపటి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు కూడా పోలీసులకు తెలిపాడు. దీంతో హుటాహుటీన ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని గాంధీ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోవడంతో వీరి సంతానం మరో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారారు. ఈ ఘటనకు సంంధించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బోయిన్ పల్లి పోలీసులు తెలిపారు.






## అప్పు తిరిగి ఇస్తానని ఇంటికి పిలిచి..

- మహిళను హత్య చేసిన దుండగులు..!

**విశ్వంభర, మంథని :** అప్పు తిరిగి ఇస్తానని ఇంటికి పిలిచి.. మహిళను హత్య చేశారు దుండగులు. వివరాల్లోకి వెళ్లితే.. పెద్దపల్లి జిల్లా మంథని– ముత్తారం మండల కేంద్రానికి చెందిన పెరుక రాజేశ్వరి(60) ఈ నెల 5 నుంచి కనిపించకుండా పోయింది. ఇంట్లో ఒంటరిగా ఉంటుండటంతో ఈ విషయాన్ని ఎవరూ గుర్తించ లేదు. ఈనెల 8న పారుపల్లి శివారులోని వ్యవసాయ బావిలో గోనె సంచిలో కట్టి పడేసిన గుర్తు తెలియని మహిళ శవాన్ని రైతు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.ఈ నెల 14న రాజేశ్వరి కనిపించడం లేదని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు చెప్పిన ఆనవాళ్ల ప్రకారం.. మృతురాలిని రాజేశ్వరిగా గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో దర్యాప్తులో హత్యా ఘటన వెలుగులోకి వచ్చింది. రాజేశ్వరి ఇంటి సమీపంలో ఉండే లావణ్య కొంతకాలం కిందట ఆమె వద్ద విడతల వారీగా రూ.1.50 లక్షల అప్పు తీసుకొంది. కొంత కాలంగా తిరిగివ్వాలని రాజేశ్వరి ఒత్తిడి చేసింది. దీంతో ఈ నెల 8న డబ్బులు ఇస్తామని ఆమెను లావణ్య ఇంటికి పిలిచింది. అనంతరం భర్త రవి మరో వ్యక్తి కలిసి రాజేశ్వరి గొంతు నులిమి హత్య చేశారు.

# వివాదంలో తాటికొండ రాజయ్య

- ఆయన కారు ఢీకొని మహిళ మృతి
- ప్రమాదం సమయంలో కారులోనే మాజీ ఎమ్మెల్యే
- కాజీపేటలో కారు వదిలేసి పరారీ
- కేసు నమోదు చేసిన పోలీసులు
- మృతురాలిది మడికొండ ఎస్సీ కాలనీ
- న్యాయం చేయాలని రోడ్డెక్కిన కుటుంబ సభ్యులు





**విశ్వంభర, వరంగల్ :** స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మరో వివాదంలో ఇరుక్కున్నారు. ఓ మహిళ మృతి కేసులో ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. శనివారం రాత్రి ఆయన ప్రయాణిస్తున్న కారు ఢీకొని స్వప్న అనే మహిళ మరణించింది. కాజీపేట మండలం మడికొండలో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మడికొండ ఎస్సీ కాలనీకి చెందిన కలకోట స్వప్న (40) తను నివసించే ఏరియాలోనే శనివారం రాత్రి డివైడర్ మధ్య నుంచి రోడ్డు దాటుతోంది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి వస్తున్న రాజయ్య కారు ఆమెని ఢీకొట్టింది. గాల్లోకి ఎగిరిపడిన స్వప్న అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది.

**ఆ సమయంలో కారులోనే రాజయ్య**

అయితే ప్రమాదసమయంలో తాటికొండ రాజయ్య కారులోనే ఉన్నారు. యాక్సిడెంట్ అయిన వెంటనే రాజయ్య కారు దిగి స్వప్నని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కారుని కాజీపేట బాపూజీనగర్ లో వదిలేసి రాజయ్య వెళ్లిపోయారు. ఘటనకి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఒకరి చావుకి కారణమై.. కనీసం మానవత్వం లేకుండా రాజయ్య అక్కడినుండి పారిపోయాడంటూ నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే రాజయ్యని శిక్షించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. కాగా, ప్రమాద సమయంలో కారుని డ్రైవర్ నడుపుతున్నాడా? లేక రాజయ్య నడుపుతున్నాడా అనే విషయం తెలియరాలేదు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలికి భర్త, కుమారుడు ఉన్నారు. స్వప్న మరణంతో వారి కుటుంబంలో విషాదం నెలకొంది. తగిన న్యాయం చేయాలంటూ కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

**వివాదాలకు కేర్ ఆఫ్ అడ్రెస్...**

తాటికొండ రాజయ్య ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వంలో తొలి డిప్యూటీ సీఎంగా, ఆరోగ్య శాఖామంత్రిగా పదవులు చేపట్టారు తాటికొండ రాజయ్య. కానీ శాఖాపరమైన అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణల కారణంగా కేసీఆర్ ఆయనకి మంత్రిపదవి తొలగించారు. 2018 లో మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కానీ ఈసారి ఆయనపై సొంత పార్టీ మహిళా సర్పంచ్ నవ్య లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. అంతేకాదు, ఆయన ఆడవారితో తప్పుగా ప్రవర్తించారని కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ఈ వివాదాల నేపథ్యంలో 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆయనకి టికెట్ ఇవ్వలేదు. కనీసం ఎంపీ టికెట్ అయినా ఇస్తారేమో అని ఆశిస్తే అది కూడా దక్కలేదు. దీంతో కేసీఆర్ ని తిట్టి రేవంత్ రెడ్డిని కలిశారు. అయితే పార్లమెంటు ఎన్నికల ముందు కడియం శ్రీహరి, బీఆర్ఎస్ ఎంపీ టికెట్ తీసుకున్న కడియం కావ్య కాంగ్రెస్ లోకి జంప్ అయ్యారు. ఈ క్రమంలో యూటర్న్ తీసుకుని మళ్ళీ కేసీఆర్ తో జోడీ కట్టారు రాజయ్య. బీఆర్ఎస్ పార్లమెంటు టికెట్ అయితే దక్కలేదు కానీ ఆ పార్టీ అభ్యర్థికే ప్రచారం చేశారు. ప్రస్తుతం ఆయన బీఆర్ఎస్ లోనే కొనసాగుతున్నారు.



## బైక్ పై స్టంట్స్ తో రీల్స్ చేస్తూ.. ప్రమాదవశాత్తు కింద పడి యువకుడి మృతి

**విశ్వంభర, రంగారెడ్డి:** నేటి యువత సరదా కోసం రీల్స్ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. రీల్స్ కోసం డేంజరస్ స్టంట్స్ చేస్తూ ఆ క్రమంలో ప్రమాదవశాత్తు మరణిస్తున్నారు. ఇప్పటికే ఇలా మరణించిన వారెందరో ఉన్నారు. ఇటీవలే జలపాతం వద్ద రీల్స్ చేస్తూ ఓ ఇన్స్టాగ్రామ్ ఇన్ఫ్లుయెన్సర్ మరణించిన విషయం తెలిసిందే. ఆ వార్త మరవకముందే తాజాగా రంగారెడ్డి జిల్లాలో మరో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. సోషల్ మీడియాలో వైరల్ అవ్వాలనే ఉద్దేశంతో బైక్పై స్టంట్లు చేస్తూ ప్రమాదవశాత్తు ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. శనివారం రోజు సాయంత్రం హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద అంబర్పేట్ సమీపంలో జాతీయ రహదారిపై వర్షంలో కేటీఎమ్ బైక్ పై ఇద్దరు యువకులు స్టంట్స్ చేస్తూ రీల్స్ చేశారు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పడంతో కింద పడి శివ అనే యువకుడు తీవ్ర గాయాలతో మృతి చెందాడు. డ్రైవింగ్ చేస్తున్న యువకుడికి తీవ్ర గాయాలవ్వగా స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## తెలంగాణలో 'నారా రేవంత్ రెడ్డి నాయుడు' ప్రభుత్వం నడుస్తుంది

**బక్క జడ్సన్**

విశ్వంభర, హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై బక్క జడ్సన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు తెలంగాణలో "నారా రేవంత్ రెడ్డి నాయుడు" ప్రభుత్వం నడుస్తుందన్నారు. చిల్లర ముఖ్యమంత్రి, చిల్లర ప్రభుత్వం.. ఉద్యమాన్ని గౌరవించని వాడు ఈ చిల్లర ముఖ్యమంత్రి అని.. ముఖ్యమంత్రి అప్పట్లో కాలేజీల దగ్గర అమ్మాయిలకు లైటింగ్ కొట్టుకునే వాడని చురకలు అంటించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి కలిసింది ఇరు రాష్ట్రాల అభివృద్ధి కోసం కానేకాదు, పాత కేసుల మాఫీ కోసం ముగ్గురు ముద్దాయిల ముద్దుల కలయిక అది అని ఫైర్ అయ్యారు. ఇక్కడున్న మీడియా "మా నారా రేవంత్ నాయుడు ప్రభుత్వం అనుకొని నిరుద్యోగుల ఉద్యమం న్యూస్ వెయ్యడం లేదు" ఆంధ్రాలో ఒక నాయకుడు ఎవరినో ఉంచుకున్నాడు, అది ఇంటర్నేషనల్ సమస్య అంటూ గంటలు గంటలు నడిపిస్తున్న యాంకర్లకు సిగ్గు లేదని ఆగ్రహించారు. నిరుద్యోగుల ఉద్యమం నీరు కారిపోలేదు, కానీ ఒక 20 ఏళ్లు ప్రశ్నించే గొంతుకలు తయారు అయ్యాయి.... 29 లక్షల నిరుద్యోగులు నీ పని పడతారురా అయ్యా.. విద్యార్థుల పట్ల మాట్లాడే మాటలు కావు అవి ఒక లంపెను గాడు మాట్లాడే మాటలు అవి అంటూ ఆగ్రహించారు. దేశ అభివృద్ధి, అవినీతి గురించి చెప్పే వాళ్లు ఈ రోజు రెడ్ హ్యాండెడ్ గా దొరికిన ముద్దాయిని తీసుకొచ్చి ముఖ్యమంత్రి చేసే కర్మ కాంగ్రెస్ హై కమాండ్ కేం పట్టింది అనిపించింది.



## రాపిడో డ్రైవర్ల ముసుగులో డ్రగ్స్ విక్రయం

**విశ్వంభర, హైదరాబాద్ :** రాపిడో డ్రైవర్లు, రేలింగ్ పనుల ముసుగులో మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న నలుగురిని హైదరాబాద్ ఎల్బీ నగర్ పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్ లోని బార్మార్కు చెందిన రమేష్ కుమార్, మహదేవ్ రామ్ మరో ఇద్దరితో కలిసి 2022లో హైదరాబాద్కు వలస వచ్చి ఇక్కడ రాపిడో డ్రైవర్లుగా పని చేస్తున్నారు. అయితే ర్యాపిడో ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో డ్రగ్స్ దందా చేయాలని భావించారు. రాజస్థాన్కు చెందిన దినేష్ కల్యాణ్ నుంచి 6 వేల రూపాయలకు ఒక గ్రాము హెరాయిన్ చొప్పున కొనుగోలు చేసి హైదరాబాద్లో 12 వేలకు విక్రయిస్తున్నారు. ఇటీవల మహదేవ్ రాజస్థాన్ వెళ్లి 30 గ్రాముల హెరాయిన్ను నగరానికి తీసుకొచ్చి ఒక్కో ప్యాకెట్లో 2 గ్రాముల చొప్పున ఉంచి విక్రయించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. సరూర్ నగర్లో నిందితులు తచ్చాడుతుండగా పోలీసులు వారిని పట్టుకుని 34 గ్రాముల హెరాయిన్, ద్విచక్రవాహనం రెండు చరవాణీలు స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో హెరాయిన్ను విక్రయిస్తున్న ఒకరిని మేడిపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ రెండు కేసుల్లో నిందితులు కొన్ని నెలలుగా హెరాయిన్ విక్రయించే దందా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. ప్రభాకర్‌రావుపై రెడ్‌కార్నర్ నోటీసు!



**విశ్వంభర, హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావుతోపాటు ఆరో నిందితుడు అరువెల శ్రవణ్‌రావుపై ఇంటర్‌పోల్ ద్వారా రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేయించాలని హైదరాబాద్ పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు తెలంగాణ సీఐడీ ద్వారా సీబీఐకి అభ్యర్థన పంపించగా.. సీబీఐ దానిని ఇంటర్‌పోల్‌కు పంపనుంది. గతంలో వీరిద్దరిపై బ్లూకార్నర్ నోటీస్ జారీ చేయాలంటూ అభ్యర్థన పంపిన విషయం తెలిసిందే. అప్పటికి ఈ కేసులో అభియోగపత్రం దాఖలు చేయకపోవడంతో బ్లూకార్నర్ నోటీసుకే ప్రయత్నించారు. ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావును విచారిస్తేనే కేసు దర్యాప్తు ముందుకు సాగే అవకాశం ఉందని పోలీసులు న్యాయస్థానానికి విన్నవించారు. దీంతో ప్రాథమిక అభియోగపత్రాన్ని న్యాయస్థానంలో దాఖలు చేసి బ్లూకార్నర్‌తోపాటు రెడ్‌కార్నర్ నోటీసులపైనా పోలీసులు దృష్టి పెట్టారు. ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావులు ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు దర్యాప్తు అధికారులకు ఇది వరకే సమాచారమిచ్చారు. క్యాన్సర్ చికిత్స కారణంగా రాలేకపోతున్నానంటూ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరవుతానని ప్రభాకర్ రావు అభ్యర్థించినా న్యాయస్థానం అనుమతించలేదు. ఈ నేపథ్యంలో రెడ్‌కార్నర్ నోటీసు జారీ అయితే దారి ఆధారంగా పారిపోయిన వారి ఆచూకీ, తాత్కాలిక(ప్రొవిజనల్) అరెస్టు కోరవచ్చు.

# డిండిలో ఘనంగా గురుపౌర్ణమి ఉత్సవాలు

**విశ్వంభర, డిండి :** డిండి మండల కేంద్రంలో కొలువైన శిరిడి సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం వేడుకలను నిర్వహించుకున్నారు. ఉదయం 5 గంటల నుండి నగర సంకీర్తనతో ప్రారంభమైన వేడుకలు రాత్రి 7 గంటలకు పల్లకి సేవతో ముగిసాయి, మహాభిషేకం, తులసి పూజ, గోపూజ, శ్రీ సాయి వ్రతం, అగ్ని ప్రతిష్టాపన, నారాయణ సేవ నిర్వహించారు, సాయంత్రము, సాయి కోలాట బృందం చే కోలాట ప్రదర్శన నిర్వహించారు, ఈ వేడుకలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని సాయి భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయం ట్రస్టు అధ్యక్ష కార్యదర్శులు పానుగంటి లక్ష్మీ నరసింహ, కాయితి పర్వత్ రెడ్డి, ఎలకుర్తి కొండయ్య, వెలకుర్తి వేణుగోపాల్, గాదే మనోహర్, కాసం రామస్వామి, హనుమాన్ కేశవులు, మురళి చారి, వంగాల శేఖర్ రెడ్డి, మాధవ గౌడ్, ఎలకుర్తి రమేష్, శేఖర్ చారి, గాదే రాజు, తుమ్మల మాధవరెడ్డితో సహా పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు, కార్యక్రమంలో మాచారం గ్రామం భజన బృందంచే భక్తి గీతాలు ఆలపించారు. గువ్వలోనిపల్లి మహిళా సాయి కోలాటం బృందం నిర్వహించిన కోలాట నాట్యాలు భక్తులను అలరించాయి, పూజారులు ఆదిత్య పాండే, మృత్యుంజయ పాండే, అమిత్ పాండే, ఈనాటి పూజా కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించారు.







## సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు

**ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ ఈటల**

**విశ్వంభర, కూకట్ పల్లి :** గురు పౌర్ణమి సందర్భంగా కూకట్ పల్లి వివేకానంద నగర్ లోని సాయిబాబా ఆలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు నేతృత్వంలో జరుగుతున్న వేడుకల్లో ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురు పౌర్ణమి పర్వదినానికి ఒక ప్రత్యేకత ఉందని, ప్రతి ఒక్కరూ గురువులకు కృతజ్ఞత చెప్పుకునేందుకు జరుపుకునే పండుగ అని కొనియాడారు. సనాతన హైందవ ధర్మంలో తల్లి, తండ్రి తర్వాత స్థానం గురువుకే దక్కిందని, పైగా ఈ సృష్టిలో మనిషి పుట్టినప్పటి నుంచి మరణించేదాకా ప్రతిక్షణం ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకుంటూనే ఉంటాడని, అందులో కొంత తల్లిదండ్రుల వద్ద నేర్చుకుంటే మిగిలినదంత గురువు దగ్గరే నేర్చుకుంటాడు అని అన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే మార్నింగ్ వాక్

**మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి**

**విశ్వంభర, సూర్యాపేట :** ప్రజల సమస్యల పరిష్కారం కోసమే మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని ప్రారంభించి కొనసాగిస్తున్నామని మాజీ మంత్రి, సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలో మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న 44వవార్డు కొత్త బస్టాండ్ వద్ద 5 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన డ్రైనేజీ కాలువను పరిశీలించి స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి దామోదర్ రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలోని ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు మార్నింగ్ వాక్ కార్యాక్రమాన్ని చేపట్టానని, ప్రజలకు చేరువగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం చేసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతున్నదని న్నారు. స్థానికులతో కలియ తిరిగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడం కాకుండా అక్కడికక్కడే కొన్ని సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేణారెడ్డి మాట్లాడుచూ గతంలో నాయకులు ఎన్నికల సమయంలోనే పట్టణాలకు వస్తే దామన్న మాత్రం నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యల సాధనకు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలను అర్హులకు అందించడమే లక్ష్యంగా దామన్న పని చేస్తున్నాడని అన్నారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్థానిక కౌన్సిలర్ కక్కిరేణి శ్రీనివాస్ మాట్లాడుతూ కోరిన వెంటనే తన వార్డులో ఉన్న డ్రైనేజీ కాల్వ కట్టించి స్లాబ్ వేపించి 4 సంవత్సరాలనుండి ఉన్న సమస్యను పరిష్కరించినందుకు ప్రజల తరుపున దామన్నకు ధన్యవాదాలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో, పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, కౌన్సిలర్ లు బైరు, శైలేందర్, కుంభం రాజేందర్, ఆనంతుల యాదగిరి, చిరివెళ్ల శభరీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## పొద్దస్తమానం ముసురుతో ముప్పే

**విశ్వంభర, ఆమనగల్లు :** వర్షాకాలం ప్రారంభం కావడంతో చాప కింద నీరులా సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉంది. గత రెండు మూడు రోజులుగా ముసురు వానలు కురుస్తుండటంతో ఒక పక్క చిటపట వానలు చల్లటి గాలులు వీస్తున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు చల్లటి గాలులు వాతావరణం నెలకొనటంతో వర్షానికి అయిన తట్టుకోవచ్చు గాని చల్లటి గాలులకు తట్టుకోలేకపోతున్నామని అంటున్నారు. ప్రధానంగా కొన్ని కాలనీలో పారిశుధ్యం సరిగ్గా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు వెళ్ళటానికి కాలువలు నిర్మించకపోవడం ప్రధాన సమస్యగా చెప్పుకోవచ్చు. దీంతో వర్షపు నీరు గుంతలలో నిలిచి మురుగునీరుగా మారి ఉండటంతో దోమలకు ఆవాసంగా మారి వ్యాధుల బారిన పడే అవకాశం పొంచి ఉంది. ఇప్పటికే పట్టణంలో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రభుత్వ అధికారులు, మున్సిపల్ కమిషనర్ వసంత చైర్మన్ రాంపాల్, వ్యక్తిగత పరిసరాలు, పరిశుభ్రత పైన పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అధికారులు దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ప్రధానంగా మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, జలుబు, దగ్గు, విష జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండటంతో జాగ్రత్తలు పాటించవలసిన అవసరం ఎంతైనా ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారు. వాతావరణం ఒక్కసారిగా చెల్లబడినప్పుడు వైరల్ ఇన్ఫెక్షన్స్, చర్మసమస్యలు, ఆస్తమా, డయాబెటిస్ బాధితులు ఎక్కువగా తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని డాక్టర్లు సూచిస్తున్నారు. మరోవైపు వర్షాలు కురుస్తుండటంతో రోజువారి వ్యాపారస్తులకు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## రుణమాఫీపై ప్రభుత్వ విప్ ఐలయ్యకు సవాల్ విసిరిన

**మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత**

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు తాజా మాజీ ఎమ్మెల్యే మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి రైతు రుణమాఫీ కేవలం 43 శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ అయిందని అర్హులైన రైతులందరికీ కాలేదని అన్నారు. ఆదివారం పత్రిక విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో ఎంతమందికి రుణమాఫీ జరిగిందనే విషయంపై చర్చకు సిద్ధమా అని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు సవాలు విసిరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ నయా రికార్డ్

**విశ్వంభర, ఢిల్లీ:** కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ జులై 23వ తేదీన పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. మాజీ ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ తర్వాత వరుసగా ఆరు బడ్జెట్‌లు ప్రవేశపెట్టి ఇప్పటికే రికార్డు నెలకొల్పిన నిర్మలమ్మ, ఇప్పుడు ఏడోసారి బడ్జెట్ను సమర్పించి మరో రికార్డు క్రియేట్ చేయనున్నారు. ఎక్కువసార్లు పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మహిళా మంత్రిగానే కాకుండా అత్యధిక సమయం బడ్జెట్ ప్రసంగం చేసిన రికార్డు కూడా నిర్మలమ్మ ఖాతాలోనే ఉంది. జులై 23న ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్ 2024 రూపకల్పన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. సోమవారం రోజున ప్రారంభమయ్యే వర్షాకాల సమావేశాలు ఆగస్టు 12వ తేదీ వరకు కొనసాగనున్నాయి. సార్వత్రిక ఎన్నికలు ముగిసి కొత్త సర్కారు ఏర్పడినందున 202425 ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 8 నెలల కాలానికి కేంద్ర ప్రభుత్వం మంగళవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. దీనికి ఒకరోజు ముందే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక సర్వేను పార్లమెంటు ముందు ఉంచనున్నారు. ఈ సమావేశాల్లోనే ప్రభుత్వం ఆరు బిల్లులను సభ ఆమోదం కోసం తీసుకురానుంది.




**చరిత్ర సృష్టించనున్న ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన ఏడో కేంద్ర బడ్జెట్ ని ప్రవేశపెట్టనున్నారు. జులై 22 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది బడ్జెట్ ని ప్రవేశపెట్టడంతో వరుసగా ఏడు బడ్జెట్లను ప్రవేశపెట్టిన తొలి ఆర్థిక మంత్రిగా సీతారామన్ రికార్డుల కెక్కనున్నారు. ఆరు బడ్జెట్లు సమర్పించిన మొరార్జీ దేశాయ్ రికార్డును ఆమె బద్దలు కొట్టనున్నారు. 1959 నుంచి 1964 వరకు దేశ ఆర్థిక మంత్రిగా పనిచేసిన దేశాయ్.. ఆరు సార్లు రికార్డు స్థాయిలో బడ్జెట్లు సమర్పించారు. వాటిలో ఐదు పూర్తి బడ్జెట్లు మరియు ఒకటి మధ్యంతర బడ్జెట్. మధ్యంతర కేంద్ర బడ్జెట్ 1 ఫిబ్రవరి 2024న సమర్పించబడింది. బడ్జెట్ సన్నాహాల్లో భాగంగా.. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక వ్యవస్థలోని వివిధ వాటాదారులతో అనేక రౌండ్ల సంప్రదింపులను పూర్తి చేశారు. ఈ సమావేశాలు జూన్ 20న ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీతారామన్ ట్రేడ్ యూనియన్లు, విద్య మరియు ఆరోగ్య రంగం, ఉపాధి మరియు నైపుణ్యాలు, ఎంఎస్ఎమ్ఎస్ఈ, వాణిజ్యం, సేవలు, పరిశ్రమలు, ఆర్థికవేత్తలు, ఆర్థిక రంగం, క్యాపిటల్ మార్కెట్ల ప్రతినిధులతో పాటు మౌలిక సదుపాయాలు, ఇంధనం, పట్టణ రంగాల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

## హాట్ హాట్ గా కొనసాగిన అఖిలపక్ష సమావేశం



**విశ్వంభర, ఢిల్లీ:** ఢిల్లీ పార్లమెంట్ అనెక్స్ భవనంలో తాజాగా రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ నేతృత్వంలో అఖిల పక్ష భేటీ కొనసాగింది. రేపటి నుంచి జరిగే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యచరణను ప్రభుత్వం విపక్షాలతో చర్చించింది. బడ్జెట్ తో పాటు సభ ముందుకు రానున్న బిల్లుల జాబితాను కూడా వారికి వివరించింది. టీడీపీ తరుపున లావు కృష్ణదేవరాయలు, వైసీపీ నుంచి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, జనసేన నుంచి బాలశౌరీ, కాంగ్రెస్ నుంచి జయరామ్ రమేష్, కె.సురేష్, మజ్లిస్ తరుపున అసదుద్దీన్ తో పాటు జేడీయూ, ఆప్, సమాజ్ వాదీ, ఎన్సీపీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ అఖిల పక్ష భేటీ హాట్ హాట్ గా కొనసాగింది. డిప్యూటీ స్పీకర్ పదవీ ఇవ్వాలని కాంగ్రెస్ కోరింది. అదేవిధంగా నీట్ వివాదం, మణిపూర్ హింస, ధరల పెరుగుదల, ఈడీ, సీబీఐల దుర్వినియోగం సహా పలు అంశాలపై చర్చించారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాలు ఆగస్టు 12 వరకు కొనసాగుతాయి.

## యువతి తలలో 70 సూదులు పెట్టిన మాంత్రికుడు



**విశ్వంభర, రాయగడ్:** ఒడిశాలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఓ యువతి తలలో 70 సూదులు పెట్టాడు మాంత్రికుడు. శస్త్రచికిత్స చేసి బయటికి తీశారు వైద్యులు. ఒడిశా లోని బొలంగీర్ జిల్లా, రాయగడలోని స్థానిక సింధికేలా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇచ్ గావ్ గ్రామానికి చెందిన రేష్మా బెహరా(19) మూడేళ్ల క్రితం అనారోగ్యం బారిన పడింది. దీంతో ఆమె తండ్రి తేజాజ్ రాణా అనే మాంత్రికుడిని సంప్రదించారు. వైద్యం పేరిట ఆయన పలు దఫాలుగా రేష్మా తలలోకి సూదులను గుచ్చాడు. ఇటీవల తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్న యువతిని కుటుంబ సభ్యులు వింసార్ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలిని పరీక్షించిన వైద్యులు ఆమెకు సిటీ స్కానింగ్ చేసి నిర్ఘాంతపోయారు. ఆమె పుర్రెపై సూదులు ఉన్నట్లు గుర్తించి వెంటనే శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేశారు. దాదాపు గంటన్నరపాటు శ్రమించి యువతి తలలోని 70 సూదులను బయటికి తీశారు. పుర్రె ఎముకపై ఉన్న సూదులు లోపలికి వెళ్లకపోవడంతో ఆమె ప్రాణాలతో బయటపడ్డారని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో మాంత్రికుడు తేజాజ్ రాణాను అరెస్టు చేశారు.

## కేరళలో నిఫా వైరస్ సోకిన బాలుడు మృతి



**విశ్వంభర, మలప్పురం:** కేరళలో నిపా వైరస్ ఓ బాలుడిని బలి తీసుకున్నది. మలప్పురం జిల్లాకు చెందిన 14 ఏళ్ల బాలుడు ఆదివారం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. వైరస్ సోకిన బాలుడిని వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తుండగా గుండెపోటు రావడంతో కన్నుమూసినట్లుగా సమాచారం. వైరస్ సోకిందని గుర్తించిన కొద్ది గంటల్లోనే.. బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. అంతర్జాతీయ నిబంధనల మేరకు బాలుడి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో నిపా వైరస్ కేసులు వెలుగు చూడడంతో కేరళ ప్రభుత్వం అప్రమత్తమైంది. బాలుడి హై రిస్క్ కాంటాక్టులను ఇప్పటికే గుర్తించి.. వారిని కాపాడేందుకు ఆస్ట్రేలియా నుంచి కొనుగోలు చేసిన మోనోక్లోనల్ యాంటీబాడీలను ఆర్డర్ చేసింది. వైరస్ సోకిన బాలుడు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతు మరణించినట్లు ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్క్ తెలిపారు. గతేడాది సెప్టెంబర్ తర్వాత నమోదైన తొలి నిపా కేసు ఇదే. బాలుడు వైద్యం కోసం మే 12న ఓ ప్రైవేటు క్లినిక్‌కు వచ్చాడు. మే 15న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. పరిస్థితి మెరుగుకాపోవడంతో బాలుడిని కోజికోడ్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలుడు నిపా వైరస్ సోకి మృతి చెందడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది.

## కారుకు సైడ్ ఇవ్వలేదని.. మహిళ ముక్కు పగిలేలా కొట్టిన వ్యక్తి!



**విశ్వంభర, పూణే:** కారుకు సైడ్ ఇవ్వలేదని.. పిడి గుద్దులతో మహిళ ముక్కు పగిలేలా కొట్టాడు ఓ వ్యక్తి. ఈ సంఘటన మహారాష్ట్ర లోని పుణెలో జరిగింది. ఈ సంఘంటన వివరాలు ఇలా ఉన్నాయి.పుణెలో 27 ఏళ్ల ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి స్కూటీలో బనెర్‌పాషన్ రోడ్డుపై వెళ్తున్నారు. ఆమె వెనకాలే దాదాపు రెండు కిలోమీటర్ల వరకు కారులో వచ్చిన స్వప్నిల్ కెక్రే అనే వ్యక్తి ఆమెను ఓవర్ టేక్ చేశాడు. ఒక్కసారిగా స్కూటీ ముందు కారు ఆపి ఆమె జుట్టు పట్టుకొని ముక్కుపై పిడిగుద్దులు కురిపించాడు. తీవ్రంగా కొట్టడంతో ఆమె ముక్కు నుంచి రక్తం కారింది. జరిగిన విషయాన్ని వివరిస్తూ సదరు మహిళ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాలరు. దారివ్వలేదని ఆరోపిస్తూ తనపై దాడికి పాల్పడ్డాడని తెలిపారు.

## దగ్గరుండి మరీ ఉగ్రవాదులను భారత్ లోకి పంపిస్తున్న పాక్ ఆర్మీ

**విశ్వంభర, కశ్మీర్:** సరిహద్దులను కాపాడేందుకు భారత సైనికులు ప్రాణాలకు తెగించి మరీ పోరాడుతున్న వేళ.... పాకిస్థాన్ సైన్యం ఎంత దుష్ట ప్రణాళికను అమలు చేస్తోందో తాజాగా బట్టబయలైంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి కొందరు ఉగ్రవాదులను పాక్ సైనికులు దగ్గరుండి మరీ భారత్ లోకి పంపిస్తున్నారు. సరిహద్దుల్లో ఎక్కడ్నించి చొరబడితే భారత సైన్యం కంటబడకుండా తప్పించుకోవచ్చో పాక్ సైనికులు ఆ ఉగ్రవాదులకు దిశానిర్దేశం చేస్తున్నారు. పీవోకేలోని కోట్లీ ప్రాంతంలో కొన్ని చోట్ల పఠాన్ దుస్తుల్లో ఉన్న ఉగ్రవాదులను పాక్ సైనికులు సరిహద్దుల గుండా భారత్ లోకి పంపిస్తున్న ఫొటోలు వెలుగులోకి వచ్చాయి. పాక్ లోని వివిధ ప్రాంతాల నుంచి ఉగ్రవాదులను సరిహద్దుల వద్దకు తీసుకువస్తున్న సైన్యం... వారికి తమ బంకర్లలోనే ఆశ్రయం కల్పించి, పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు వారిని భారత్ లోకి పంపిస్తోంది. ఆ ఫొటోలలో ఆయుధాలతో ఉన్న టెర్రరిస్టులతో పాటు పాక్ సైన్యానికి చెందిన ఎస్ఎస్ జీ కమాండోలు కూడా కనిపిస్తున్నారు. భారత సైనిక వర్గాలు కూడా పాక్ సైన్యం చేస్తున్న కుట్రను నిర్ధారించాయి. పాకిస్థానీ రేంజర్ల రక్షణలో సరిహద్దుల్లోంచి పాక్ ఉగ్రవాదులు భారత్ లో చొరబడుతున్నారని భారత్ సైన్యంలోని ఓ ఉన్నతస్థాయి వ్యక్తి వెల్లడించారు. ఈ విధంగా భారత్ లోకి చొరబడిన ఉగ్రవాదుల సంఖ్య 50 నుంచి 55 వరకు ఉండొచ్చని తెలిపారు. ఎక్కడ సరిహద్దులు దాటాలి? అక్కడ్నించి ఏ మార్గంలో వెళ్లాలి? అనే అంశాలను పాక్ సైనికులు ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్న విషయం తాజా విజువల్స్ తో వెల్లడైందని వివరించారు. ఇటీవల కాలంలో కశ్మీర్ లో ఉగ్రదాడులు బాగా పెరిగాయి. ఇటీవల జరిగిన ఘటనల్లో అనేకమంది భారత జవాన్లు మృతి చెందడం తెలిసిందే. జమ్మూ ప్రాంతంలో నదులు ఎక్కువగా ఉంటాయి. రుతుపవనాల సీజన్ లో ఇక్కడ వాతావరణం అత్యంత ప్రతికూలంగా ఉంటుంది. భారీ వర్షాలు కురిసే ఈ సమయంలో భారత జవాన్లు విధులు నిర్వర్తించడం ఎంతో కష్ట సాధ్యంగా ఉంటుంది. అందుకే ఈ సీజన్ లో సరిహద్దులు దాటేందుకు ఉగ్రవాదులు ప్రయత్నిస్తుంటారు. వారికి పాక్ సైన్యం కూడా సహకరిస్తుండడంతో సరిహద్దులు దాటడం సులువుగా మారింది.



## మంచు విష్ణుకు గోల్డెన్ వీసా ఇచ్చిన యూఏఈ ప్రభుత్వం

**విశ్వంభర, హైదరాబాద్:** భారత్ లో ఇప్పటికే అనేకమంది సినీ ప్రముఖులకు గోల్డెన్ వీసా ఇచ్చిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం తాజాగా టాలీవుడ్ కథానాయకుడు, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణుకు కూడా గోల్డెన్ వీసా అందించింది. కళలు, సాంస్కృతిక రంగంలో మంచు విష్ణు కృషికి గుర్తింపుగా గోల్డెన్ వీసాతో గౌరవించినట్టు యూఏఈ వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై మంచు విష్ణు స్పందించారు. యూఏఈ ప్రభుత్వం నుంచి గోల్డెన్ వీసా అందుకోవడం ఎంతో సంతోషం కలిగిస్తోందని పేర్కొన్నారు. టాలీవుడ్ నుంచి ఇప్పటికే ఈ గోల్డెన్ వీసాను మెగా స్టార్ చిరంజీవి, రామ్ చరణ్, అల్లు అర్జున్ కూడా అందుకున్నారు. వైద్య సేవలు, సామాజిక రంగంలో చేసిన కృషికి గాను ఉపాసన కొణిదెలకు కూడా గోల్డెన్ వీసా ప్రదానం చేశారు. సాధారణంగా గోల్డెన్ వీసాను యూఏఈ గడ్డపై కనీసం రూ.20.50 కోట్లు, అంతకంటే ఎక్కువ పెట్టుబడి పెట్టినవారికి, శాస్త్రసాంకేతిక రంగ నిపుణులకు, ఇండస్ట్రియలిస్టులకు, క్రీడాకారులు, ప్రత్యేక ప్రతిభావంతులకు, కళాకారులకు ఇస్తారు.గోల్డెన్ వీసా ఉంటే యూఏఈలో ఎలాంటి స్పాన్సర్ షిప్ లేకుండానే నివాసం ఉండొచ్చు. వంద శాతం యాజమాన్య హక్కులతో ఇక్కడే వ్యాపారాలు చేసుకోవచ్చు. ఎలాంటి పరిమితులు లేకుండా, స్థానిక పౌరుల మాదిరే స్వేచ్ఛగా ఉండొచ్చు.




ఈ వీసా కాలపరిమితి ఐదేళ్లకోసారి, పదేళ్లకోసారి ఆటోమేటిగ్గా రెన్యువల్ అవుతుంది. బాలీవుడ్ లోనూ చాలామందికి ఈ గోల్డెన్ వీసా లభించింది. షారుఖ్ ఖాన్, సునీల్ శెట్టి, సంజయ్ దత్, బోనీ కపూర్, మౌనీ రాయ్, ఫరా ఖాన్, సోనూ నిగమ్ తదితరులకు యూఏఈ గోల్డెన్ వీసా అందించింది. దక్షిణాదిన మమ్ముట్టి, మోహన్ లాల్, త్రిష, అమలాపాల్, దుల్కర్ సల్మాన్, టొవినో థామస్ కూడా గోల్డెన్ వీసా అందుకున్నారు.

## కరోనా కాలంలో భారత్‌లో 11.9 లక్షల అధిక మరణాలు

**విశ్వంభర, ఢిల్లీ:**

కరోనా మహమ్మారి భారత్‌తోపాటు యావత్ ప్రపంచాన్ని వణికించింది. ఈ మహమ్మారి సోకి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. భారత్‌లో దాదాపు 5లక్షల మందికిపైగా మృతి చెందారు. అయితే, కొవిడ్ సమయంలో భారత్‌లో రిపోర్ట్ చేసిన సంఖ్య కంటే ఎక్కువ మరణాలు సంభవించినట్లు సైన్స్ అడ్వాన్సెస్ జర్నల్ ఓ అధ్యయనం ప్రచురించింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీసహా పలు విశ్వవిద్యాలయాలకు చెందిన పరిశోధకులు చేసిన ఈ అధ్యయనంలో 2020లో కొవిడ్‌తో 11.9 లక్షల మంది మరణించినట్లు తెలిపింది. భారత్ అధికారికంగా ప్రకటించిన మరణాలసంఖ్య కంటే 8 రెట్లు ఎక్కువని పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థలెక్కల కంటే 1.5 రెట్లు అధికమని నివేదించింది.



2020లో కొవిడ్ సమయంలో మరణాలపై సైన్స్ అడ్వాన్సెస్ జర్నల్ ప్రచురించిన అధ్యయనం ఏమాత్రం ఆమోద యోగ్యంగా లేదని, తప్పుదోవ పట్టించేలా ఉందని కేంద్ర ఆరోగ్య శాఖ పేర్కొంది. కొన్ని మీడియాల్లో ఈ అధ్యయనం ప్రచురితం కావటంతో ...ఈ మేరకు స్పందించింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేNHFS5ని ప్రామాణిక పద్ధతిలో విశ్లేషించినట్లు అధ్యయనకర్తలు పేర్కొన్నప్పటికీ... అందులో తీవ్రమైన లోపాలు ఉన్నాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.



## ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేకు బర్త్ డే విషెస్ చెప్పిన మోడీ, రాహుల్

**విశ్వంభర, ఢిల్లీ:** కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే జన్మదినం సందర్భంగా ప్రధాని మోడీ, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీలు ఆయనకు విషెస్ చెప్పారు. ఖర్గే జీవితం ఎంతో మందికి స్ఫూర్తి దాయకమని కొనియాడారు. 'కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు. ఆయన సుధీర్ఘకాలం పాటు ఆరోగ్యంగా జీవించాలని కోరుకుంటున్నా' అని ప్రధాని మోడీ ఎక్స్ పోస్ట్ చేశారు. అలాగే లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సైతం ఎక్స్ పోస్ట్ చేశారు. 'ఖర్గేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు. ప్రజల కోసం ఖర్గే చేస్తున్న నిర్విరామ సేవ ఎంతో మందికి ఆదర్శం. ఆయన ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నా' అని పేర్కొన్నారు. మల్లికార్జున ఖర్గే 1942 జూలై 21న కర్ణాటకలో జన్మించారు. యూపీఏ 2 ప్రభుత్వ హయాంలో 2009 నుంచి 2013 వరకు కేంద్ర మంత్రివర్గంలో కార్మిక, ఉపాధి మంత్రిగా పనిచేశారు. 2013 నుంచి 2014 వరకు రైల్వే మంత్రిగా విధులు నిర్వర్తించారు. కర్ణాటక నుంచి రాజ్యసభ ఎంపీగా కొనసాగుతున్న ఆయన 2021 నుంచి రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. అలాగే కాంగ్రెస్ జాతీయ చీఫ్ గానూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## ఉజ్జయినిలోని దుకాణాలకు నేమ్‌ప్లేట్లు తప్పనిసరి: మేయర్



**విశ్వంభర, ఉజ్జయిని :** ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు ఇచ్చిన ఆదేశాలు రాజకీయ వివాదానికి దారితీస్తున్నాయి. కన్వర్ యాత్ర నేపథ్యంలో ఆ మార్గంలో ఉన్న దుకాణదారులు నేమ్ ప్లేట్లు పెట్టుకోవాలని ఈ రెండు రాష్ట్రాలు ఆదేశాలు జారీ చేశాయి. అయితే ఇది వివాదం అవుతున్నా ఇప్పుడు అదే దాదిలో మధ్యప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. తాజాగా ఉజ్జయినిలోని హోటళ్లు, తోపుడుబండ్లపై విక్రయాలు జరిపేవారు వాటిపై తమ పేర్లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించింది. క్యూఆర్‌కోడ్, ఫోన్ నంబర్‌ను కూడా జతచేయాలని మధ్యప్రదేశ్ సర్కార్ పేర్కొంది. ఈ ఆదేశాలు ఉల్లంఘించిన వారికి రూ.2,000 నుంచి రూ.5000 వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించింది. వారి స్టాల్‌స్‌ను తొలగిస్తామని తెలిపింది. యాత్రికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని, ముస్లింలు తమ లక్ష్యం కాదని వెల్లడించింది. ఉజ్జయిని హిందువులకు పవిత్రమైన నగరమని.. దుకాణాల యజమానుల వివరాలు తెలుసుకునే హక్కు భక్తులకు ఉంటుంది అని మేయర్ ముఖేష్ తత్వాల్ తెలిపారు.

## తమిళనాడు డిప్యూటీ సీఎంగా ఉదయనిధి స్టాలిన్?

**విశ్వంభర, చెన్నై :** తమిళనాడు ముఖ్యమంత్రి కుమారుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ తమిళనాడు ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ వార్తలపై యువజన సంక్షేమం, క్రీడల అభివృద్ధి మంత్రి, డీఎంకే పార్టీ యూత్ వింగ్ సెక్రటరీ ఉదయనిధి స్టాలిన్ తాజాగా స్పందించి క్లారిటీ ఇచ్చారు. ముఖ్యమంత్రి స్టాలిన్ దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఉదయనిధి తెలిపారు. ఉపముఖ్యమంత్రి పదవిపై సీఎం స్టాలిన్ నిర్ణయం తీసుకోవాలని.. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయని మంత్రి ఉదయనిధి స్టాలిన్ అన్నారు. తమ ప్రభుత్వంలోని అందరూ మంత్రులూ డిప్యూటీ సీఎంలే అని పేర్కొన్నారు. తాను నిర్వహిస్తున్న పార్టీ యువజన విభాగం కార్యదర్శి పదవి కూడా తన హృదయానికి దగ్గరగా ఉందన్న ఆయన.. తమ దృష్టంతా 2026లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలపైనే ఉందని వెల్లడించారు. మళ్లీ డీఎంకే కూటమే అధికారంలోకి వస్తుందని ఉదయనిధి ధీమా వ్యక్తంచేశారు. ఎన్నికల్లో గెలుపునకు పార్టీ శ్రేణులు సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా కృషి చేయాలని పిలుపునిచ్చారు.





## ఏపీలో వాన బీభత్సం.. దేవీపట్నంలో మునిగిన గండిపోచమ్మ ఆలయం

**విశ్వంభర, రాజమండ్రి:** ఏపీ భారీ వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఏకధాటిగా కురుస్తున్న వానలతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీగా వరద పోటెత్తుతుండటంతో రాష్ట్రంలోని నీటిప్రాజెక్టులు నిండుకుండలా మారుతున్నాయి. మరోవైపు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలుచోట్ల రహదారులు కొట్టుకుపోయి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. తాజాగా ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.2 అడుగులకు చేరడంతో ధవళేశ్వరం నుంచి డెల్టా కాలువకు 1800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సముద్రంలోకి 5 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండటంతో దేవీపట్నం మండలం గండి పోచమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఉధృతంగా గోదావరి నీటిమట్టం పెరిగిపోతోంది. దీంతో గండి పోచమ్మ అమ్మవారి ఆలయం పూర్తిగా నీటమునిగింది. మరోవైపు వరద ఉద్ధృతితో జాతీయ రహదారి 326 కోతకు గురవ్వడంతో ఒడిశాఆంధ్ర మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కల్లేరు, కుయిగూరు మధ్య జాతీయ రహదారిపై 4 కిలోమీటర్ల మేర వరద నీరు చేరింది. కూనవరం వద్ద గోదావరి, శబరి నదుల సంగమంతో వరద ఉద్ధృతి పెరిగింది. నదుల ఉద్ధృతితో కూనవరం మండలంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వరదల వల్ల కూనవరంభద్రాచలం, భద్రాచలంచింతూరు మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**లక్ష ఎకరాలకుపైగా పంటనష్టం**

వాయుగుండం ప్రభావంతో ఏపీలోని కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర జిల్లాలు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాలతో పోటెత్తిన వరదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. రోడ్లు తెగి చాలా ప్రాంతాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వీధుల్లోకి నీళ్లు చేరి రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లింది. మరోవైపు ఇవాళ సాయంత్రానికి వాయుగుండం బలహీనపడి అల్పపీడనంగా మారనుండటంతో ఉత్తర, దక్షిణ కోస్తాలతోపాటు రాయలసీమ జిల్లాల్లో చాలా చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో పలుచోట్ల ముంచెత్తుతున్న వరదలతో సమీప గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఎకరాలకు పైగా వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని అంచనా. శనివారం సాయంత్రానికి ధవళేశ్వరం వద్ద 4.09 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆదివారం వరద ఉద్ధృతి మరింత పెరిగే అవకాశం ఉందని.. సోమవారం ఉదయానికి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుతుందని అధికారులు అంచనా వేశారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. తెనాలి వెటర్నరీ డాక్టర్ మృతి



**విశ్వంభర, తెనాలి:** అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెనాలి వెటర్నరీ డాక్టర్ మృతి చెందింది. కుటుంబ సభ్యుల రోదనతో మృతదేహం కోసం భారత రాయబార కార్యాలయం వద్ద ఎదురుచూస్తున్నారు. మంత్రి లోకేష్ స్పందించాలని విన్నవించారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన జెట్టి హారిక (25) వెటర్నరీ డాక్టర్. అమెరికాలోని ఒకలా హోమ్ స్టేట్ ఈరోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. హారిక తల్లిదండ్రులు దేవాదాయ శాఖ ఉద్యోగి జెట్టి శ్రీనివాసరావు నాగమణిల కుమార్తె. హారిక ఏడాదిన్నర క్రితం వెటర్నరీలో ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్ళింది. ఆమె మృత దేహాన్ని స్వస్థలానికి తెచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతున్నారు. ముఖ్యంగా గౌరవ మంత్రివర్యులు నారా లోకేష్ చొరవ తీసుకొని హారిక మృత దేహాన్ని తెనాలికి వచ్చేందుకు సహకరించాలని విన్నవించుకుంటున్నారు. హారిక మరణవార్త విని శ్రీనివాసరావు, నాగమణి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. వారి రోదనలు చూసిన వారు కూడా కంటతడి పెడుతున్నారు.

## సెలవులు రద్దు చేసిన ఏపీ ప్రభుత్వం!

**విశ్వంభర, విజయవాడ:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలు, సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని మంత్రి గొట్టిపాటి రవి అధికారులను ఆదేశించారు. విద్యుత్ తీగలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పాడైతే వెంటనే సరిచేసేలా పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వర్షాల నేపథ్యంలో విద్యుత్ ఉద్యోగులు సెలవులు తీసుకోకుండా సేవలు అందించాలని మంత్రి ఆదేశించారు. కాగా,వాయుగుండం ప్రభావంతో ఏపీలోని కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర జిల్లాలు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాలతో పోటెత్తిన వరదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. రోడ్లు తెగి చాలా ప్రాంతాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వీధుల్లోకి నీళ్లు చేరి రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లింది. మరోవైపు ఇవాళ సాయంత్రానికి వాయుగుండం బలహీనపడి అల్పపీడనంగా మారనుండటంతో ఉత్తర, దక్షిణ కోస్తాలతోపాటు రాయలసీమ జిల్లాల్లో చాలా చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



# హలో మేము కూడా రేసులో ఉన్నాం

- నామినేటెడ్ పదవులు ఇవ్వండి
- ఎమ్మెల్సీలను చేయండి
- బీజేపీ పార్టీ నాయకుల రిక్వెస్ట్
- పార్టీ స్టేట్ చీఫ్ చుట్టు ప్రదక్షిణలు

**విశ్వంభర, విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ బీజేపీలో నామినేటెట్ పదవుల కోసం సీనియర్లు రేసులోకి వచ్చారు. ఇప్పటికే టీడీపీ, జనసేన నుంచి రెండు ఎమ్మెల్సీ స్థానాలు తీసుకోగా, భవిష్యత్‌లో ఏర్పడే ఖాళీలను తమకు కేటాయించాలని బీజేపీ నేతలు కోరుతున్నారు. ఇక చాన్స్ వస్తే ఫస్ట్ తమ పేరే ఉండాలని సీనియర్లు అయిన సోము వీర్రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి కోరుతున్నట్లు సమాచారం. ఈ ఇద్దరూ గత ఎన్నికల్లో పోటీ చేయాలని భావించినా, పొత్తుల్లో వారికి సీట్లు దక్కకపోవడంతో ఇప్పుడు ఎమ్మెల్సీ చాన్స్ ఇవ్వాలని టాక్ నడుస్తోంది. వారితో పాటు సుదీర్ఘకాలం పార్టీలో కొనసాగుతూ కేవలం పార్టీ పదవులకే పరిమితమైన సీనియర్లు సైతం రేసులోకి దూసుకొస్తున్నారు.ఈసారి ఎలాగైనా ఏదో ఒక పదవి సాధించాలని సిద్ధమైపోయారు.

**బీజేపీ నుంచి బరిలో ఉన్నది వీళ్లే..**

బీజేపీలో ఏ పదవులు భర్తీ చేయాలన్నా ముందుగా పార్టీలో ఉన్నవారికే ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. ఇలాంటి కోటాలోనే కేంద్ర సహాయమంత్రిగా భూపతిరాజు శ్రీనివాసరావు, రాష్ట్ర మంత్రిగా సత్యకుమార్ పదవులు దక్కించుకున్నారు. దీంతో ఎమ్మెల్సీలుగా తమకే ముందు అవకాశం వస్తుందని ఆశ పడుతున్నారు విష్ణువర్ధన్ రెడ్డి, వీర్రాజు.ఈ ఇద్దరికీ సంఘ్ నేపథ్యం ఉంది. పార్టీలోనూ వీళ్లకు ఎలాంటి పదవులు లేవు. వీర్రాజు గతంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా... ఎమ్మెల్సీగా పనిచేశారు. ఇక విష్ణువర్ధన్‌రెడ్డి పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ఇద్దరికీ జాతీయస్థాయిలో పరిచయాలు ఉండటంతో ఎవరికి వారు అధిష్టానం ముందు డిమాండ్‌ని ఉంచుతున్నారు. గోదావరి జిల్లాలకు చెందిన కాపు సామాజికవర్గ నేత వీర్రాజు, రాయలసీమ ప్రాంతంలో రెడ్డి సామాజికవర్గానికి చెందిన నేత విష్ణు.బలమైన సమాజిక వర్గాల నుంచి వచ్చారు కాబట్టి పదవులు ఇస్తే పార్టీ అభివృద్ధి చెందుతుందని అంటున్నారు.కూటమి పొత్తు ధర్మంలో అన్ని రకాల లెక్కలు చూసుకుని పదవులు ఇవ్వాలి.సోము వీర్రాజు 2014లో అప్పటి సంకీర్ణ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా చేశారు.అధికార టీడీపీతో పొత్తు ఉన్నప్పటికీ ప్రభుత్వం చేసే తప్పులను నిర్మొహమాటంగా ఎత్తిచూపేవారు.దీంతో ఇప్పుడు ఆయనకు మళ్లీ ఎమ్మెల్సీ దక్కుతుందనడం అనుమానమే.వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల్లో రాజమండ్రి అర్బన్ నుంచి పోటీ చేయాలని వీర్రాజు భావించారు.కానీ చాన్స్ దక్కలేదు.అందమే ఇప్పుడు ఎమ్మెల్సీ అడుగుతున్నారు. ఇక విష్ణు సైతం హిందూపురం ఎంపీగా పోటీ చేయాలని భావించినా పొత్తుల్లో భాగంగా ఆ సీటు దక్కలేదు.అందుకే ఇప్పుడు తనకు ఎమ్మెల్సీ ఇవ్వాలని అధిష్టానంకు లెటర్ పెట్టుకున్నారు. మరి ఈ ఇద్దరి సీనియర్ల డిమాండ్లను పార్టీ అధిష్టానం నెరవేరుస్తుందో లేదో చూడాలి.

# పదికి పది గెలిచాం, అయినా ఏం లాభం!

**శ్రీకాకుళం జిల్లా టీడీపీలో నైరాశ్యం**



**విశ్వంభర, శ్రీకాకుళం** :సిక్కోలు జిల్లాలో తెలుగు దేశం పార్టీకి మంచి పట్టుంది.టీడీపీ ఆవిర్భావం నుంచి అక్కడ పసుపు జెండా రెపరెపలు చూస్తూనే ఉన్నాం. 2004 వైఎస్సార్ వేవ్ లో అలాగే 2019 వైసీపీ వేవ్లో కూడా ఆక్కడ టీడీపీ నేతలు సత్తా చాటి ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఈసారి జరిగిన ఎన్నికల్లో పదికి పది స్థానాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు గెలిచారు. ఒక కేంద్రమంత్రి పదవితో పాటు రాష్ట్ర మంత్రి పదవి కూడా ఈ జిల్లాకు దక్కింది. అయినా శ్రీకాకుళం జిల్లాలోని టీడీపీ శ్రేణుల్లో ఎప్పుడూ లేని నిరాశ ఈసారి కనిపిస్తోంది. పార్టీ అధిష్టానం ఎందుకు అర్థం చేసుకోలేకపోతోందని ద్వితీయ, తృతీయ శ్రేణి నేతలు సైతం ఆవేదన చెందుతున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు 50 రోజులు కావస్తున్నా అనుకూలమైన అధికారులను నియోజకవర్గానికి తెచ్చుకోలేకపోయామని ఎమ్మెల్యేలతో సహా కేడర్ నిట్టూరుస్తోంది. జిల్లాలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలిలో మాత్రం అధికారులకు స్థానచలనం కలిగింది. వైసీపీకి అనుకూలంగా పనిచేసిన యంత్రాంగాన్ని మార్చేశారు. మిగతా నియోజకవర్గాల్లో మాత్రం అధికారులు అలాగే ఉన్నారు. జిల్లాకు చెందిన ఓ ముఖ్యనేత తనకు తెలియకుండా ఎలాంటి మార్పులు చేయొద్దని ఆదేశించడమే దీనికి కారణమట. దీంతో ఎమ్మెల్యేలు సైతం నిరాశకు గురవుతున్నారు. అధికారం వచ్చినా, గత ప్రభుత్వంలో ఉన్న అధికారులే కొనసాగడం వల్ల చిన్నచిన్న ఇబ్బందులను సైతం అధిగమించలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. కలెక్టర్లు, ఎస్పీలను మినహా ఏపీలో ఎక్కడా బదిలీలు జరగలేదు. దీంతో ఇంకా ప్రత్యర్థుల మాటే చెల్లుబాటు అవుతోందని అంటున్నారు. మండలాలు, సర్కిల్స్‌లో పోలీసుతోపాటు రెవెన్యూ, హౌసింగ్, మండల పరిషత్ అధికారులను మార్చాల్సిందిగా ఎమ్మెల్యేలపై ద్వితీయ శ్రేణి నాయకులు ఒత్తిడి చేస్తున్నారు. డీఎస్పీ, ఆర్డీవో స్థాయి అధికారులను మార్చిన తర్వాత మండలస్థాయి అధికారుల మార్పు ఉంటుందని చెబుతున్నారు. వైసీపీ హయాంలో పలువురు సీఐలు, ఎస్సైలు టీడీపీ కేడర్ ను ఇబ్బందులకు గురిచేశారు. అరెస్టులు చేయడమే కాకుండా లాఠీలతో కొట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే ఇప్పుడు వారి వద్దకు వెళ్లి పనులు చేయించుకోలేక నాయకులు సతమతమవుతున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చాక వారిని బదిలీపై పంపడం ఆలస్యం అవుతుండటం వల్ల ఇప్పటికీ ప్రత్యర్థుల మాటే చెల్లుబాటు అవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా బదిలీలు జరిగే వరకు ఓపిక పట్టాల్సిందిగా అటు అధిష్టానం సైతం కేడర్ కి సూచనలు ఇచ్చినా నేతల్లో నిరాశ కొనసాగుతోంది. చంద్రబాబు వస్తే బదిలీలు ఆలస్యంగా ఉంటాయని అపోహ ఉంది. దానిని తొలగిస్తూ ఇప్పటికైనా బదిలీలు షురూ చేయాలని కోరుతున్నారు.

# ఢిల్లీలో జగన్ ధర్నా వెనుక అసలు కారణం అదే

**ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు**



**విశ్వంభర, ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో ధర్నా చేస్తానన్న వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ఫైర్ అయ్యారు. ఆదివారం ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో జరిగిన అఖిలపక్ష భేటీలో పాల్గొన్న శ్రీకృష్ణదేవరాయలు అనంతరం మీడియాతో మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో చేసిన తప్పులు బయటకు వస్తాయనే భయంతోనే జగన్ ఢిల్లీలో ఆందోళన చేస్తామంటున్నాడని సెటైర్ వేశారు. ఏపీలో ఎలాంటి శాంతిభద్రతల సమస్య లేదని జగన్ కామెంట్స్ కి కౌంటర్ ఇచ్చారు. వైసీపీ ఏపీ రాజధాని అమరావతి, పోలవరం అంశాలపై మాట్లాడకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక, ఏపీ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్ అయిన విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు మేం సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. అమరావతి, పోలవరం నిర్మాణాలు పూర్తి చేయడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. 2024 ఎన్నికల్లో టీడీపీ అద్భుతమైన విజయం సాధించిందన్నారు. ఏపీ నుండి 21 మంది ఎన్డీఏ కూటమి ఎంపీలు ఉంటే అందులో 16 మంది టీడీపీసభ్యులే ఉన్నారని చెప్పారు. ఏపీ ఆర్థిక వ్యవస్థ గురించి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో వివరిస్తామని తెలిపారు.

**ఏపీ ఆర్థిక వ్యవస్థ ఎలా ఉందో పార్లమెంట్ లో వివరిస్తాం**

**పటి నుంచి పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఇవాళ ఢిల్లీలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం టీడీపీ పార్లమెంటరీ నేత ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడారు. తమ వైపు నుంచి అన్ని సలహాలు ఇచ్చామని.. 2024 ఎన్నికల్లో టీడీపీ అద్భుతమైన విజయం సాధించిందన్నారు. రాష్ట్రం నుంచి 21 ఎన్డీఏ ఎంపీలు ఉంటే అందులో 16 మంది టీడీపీ ఎంపీలు ఉన్నారని చెప్పారు. ఎంపీలు నియోజకవర్గం సమస్యలపై మాట్లాడే ఓ అవకాశం ఇవ్వాలని కోరామన్నారు. రాష్ట్ర ఆర్థిక అంశాలపై అసెంబ్లీలో వైట్ పేపర్ విడుదల చేస్తున్నారని.. దాన్ని పార్లమెంట్కు కూడా వివరిస్తామన్నారు. ఏపీ ఆర్థిక వ్యవస్థ ఎలా ఉందో పార్లమెంట్లో వివరిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సపోర్ట్ అడుగుతామనేది పార్లమెంట్ వేదికగా ప్రజలకు తెలుస్తుందన్నారు. అమరావతి, పోలవరం పూర్తి చేయడానికి కట్టుబడి ఉన్నామని ఎంపీ తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు సిద్ధంగా లేమని సీఎం చంద్రబాబు చెప్పారని.. అమరావతి అభివృద్ధి, రోడ్ల నిర్మాణం ఇతర అంశాలపై పార్లమెంటులో చర్చిస్తామన్నారు.**



## రాష్ట్రపతి పాలన విధించాలని జగన్ కోరడం హాస్యాస్పదం

**హోంమంత్రి వంగలపూడి అనిత**

**విశ్వంభర, మంగళగిరి:** ఢిల్లీలో ఈ నెల 24న చేపట్టనున్న ధర్నాకు అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించి రాష్ట్రంలో ఏం జరుగుతోందో వారికి వివరిద్దామని వైసీపీ ఎంపీలకు ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ సూచించిన విషయం తెలిసిందే. ఏపీలో పరిస్థితులను అన్ని పార్టీలకు వివరించడంతో పాటు యావత్ దేశం దృష్టికి తీసుకెళ్లాలని.. పలు ఘటనలపై ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని దృష్టిలో పెట్టుకుని అసెంబ్లీ సమావేశాల్లో నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ హోంశాఖ మంత్రి స్పందిస్తూ.. జగన్ అసెంబ్లీ సమావేశాలకు డుమ్మా కొట్టేందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు ఢిల్లీలో ధర్నా చేపడుతామని.. ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని జగన్ కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు హోంమంత్రి అనిత. వైసీపీ హయాంలో రాష్ట్రం పరిస్థితి ఏవిధంగా మారిందో అందరికీ తెలిసిందే. వైసీపీ నాయకుల తీరును ప్రజలు కూడా గమనిస్తున్నారు. మరోవైపు గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని.. చంద్రబాబుకి హెచ్చరికలు పంపుతామని జగన్ పేర్కొన్నారు. ఆయనకే మేము హెచ్చరికలు పంపుతున్నాం. అసెంబ్లీకి హాజరు కావాలని పేర్కొన్నారు మంత్రి అనిత.

## జగన్ సమావేశానికి ఐదుగురు ఎంపీలు డుమ్మా!



**విశ్వంభర, కడప:** ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డికి ఊహించని షాక్ తగిలింది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు పార్లమెంటరీ పార్టీ భేటీలు పెట్టేందుకు ఆసక్తి చూపలేదు. కానీ, ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత మిగిలిన ఎంపీలను భేటీలకు పిలుస్తున్నారు. తాజాగా నిర్వహించిన సమావేశానికి ఐదుగురు ఎంపీలు హాజరుకాలేదు. ఈ సమావేశానికి విజయసాయిరెడ్డి హాజరయ్యారు. ఢిల్లీలో ధర్నా గురించి జగన్ మాట్లాడారు. అయితే ఈ భేటీకి హాజరుకాని కొంతమంది ఎంపీలు బీజేపీతో టచ్‌లో ఉన్నారన్న ప్రచారం. అటు పార్లమెంటరీ పార్టీ నేతలతో భేటీ అయిన ఆయన రాష్ట్రంలో వైసీపీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులపై చర్చించారు. ఈ నెల 22నుంచి పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండటంతో వైసీపీ ఎంపీ దిశానిర్దేశం చేశారు. ఈ భేటీ అనంతరం జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతి భద్రతలు పరిరక్షించడంలో చంద్రబాబు ఫెయిల్ అయ్యారని ఆరోపించారు. వినుకొండలో జరిగిన రషీద్ హత్య ఘటన పరాకాష్ట అని అభివర్ణించారు. రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, దాడులపై పార్లమెంట్లో చర్చ జరగాలని వైసీపీ ఎంపీలకు జగన్ సూచించారు.

## తూర్పు గోదావరి జిల్లాలో దారుణం.. అనుమానంతో భార్యను కడతేర్చిన భర్త..!

**విశ్వంభర, నిడదవోలు :** భార్య, భర్తలు నిండు నూరేళ్లు కలిసి ఉండాల్సిన వారు క్షణికావేశంలో ప్రాణాలను కోల్పోతున్నారు. భర్త చేసిన తప్పో.. లేక భార్య చేసిన తప్పో కానీ మొత్తానికి ఒక నిండు ప్రాణం బలవుతోంది. తాజాగా అనుమానంతో భార్యను భర్త అత్యంత కిరాతంగా హతమార్చిన ఘటన తూర్పు గోదావరి జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నిడదవోలు మండల పరిధిలోని శెట్టిపేట గ్రామానికి చెందిన కుసపాల చిరంజీవి, నవ్య భార్యభర్తలు. అయితే, కొన్నాళ్ల నుంచి చిరంజీవి తన భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఇక అప్పటి నుంచి వారిద్దరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. అయితే, శనివారం రాత్రి వారిద్దరూ మరోసారి వాగ్వాదానికి దిగారు. దీంతో క్షణికావేశానికి గురైన చిరంజీవి, భార్య నవ్యను పదునైన మిషన్ కుట్టే కత్తెరతో గొంతులో పొడిచి హతమార్చాడు. దీంతో నవ్య తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. విషయం తెలుసుకున్న నవ్య తరపు బంధవులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# లక్నో సూపర్ జెయింట్స్‌కు కేఎల్ రాహుల్ గుడ్ బై!




**విశ్వంభర, స్పోర్ట్స్ :** లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు ఊహించని షాక్ తగిలేలా కనిపిస్తోంది. లక్నో జట్టు కెప్టెన్ కేఎల్ రాహుల్ సంచాలనే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం అందుతుంది. త్వరలోనే లక్నో జట్టును కేఎల్ రాహుల్ వీడాలని అనుకుంటున్నారట. అంతేకాదు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుకు వెళ్లాలని కేఎల్ రాహుల్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. డిసెంబర్లో జరిగే మెగా వేలంలో... కేయల్ బెంగళూరు కొనే ఛాన్స్ ఉన్నట్లు సమాచారం. అంతేకాదు ఐపీఎల్ 2025 టోర్నమెంటులో బెంగళూరు కెప్టెన్ గా రాహుల్... కొనసాగే ఛాన్స్ కూడా ఉందని వార్తలు వస్తున్నాయి. గతంలో బెంగళూరు జట్టులో కేఎల్ రాహుల్ ఆడారు. ఆ తర్వాత హైదరాబాద్ జట్టుకు అనంతరం లక్నోకు కెప్టెన్ అయ్యాడు. అయితే హైదరాబాద్ జట్టుతో జరిగిన మ్యాచ్లో... కేల్ రాహుల్ ను లక్నో ఓనర్ తిట్టిన సంగతి తెలిసిందే. దీంతో ఆ జట్టు నుంచి బయటికి రావాలని... రాహుల్ అనుకుంటున్నారట. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన కూడా రానున్నట్లు సమాచారం.

# పాండ్యా కెప్టెన్సీ ఆశలు ఆవిరి చేయడంలో అజిత్ అగార్కర్ పాత్ర!




**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమిండియా సారథి రోహిత్‌శర్మ టీ20ల నుంచి తప్పుకోవడంతో ఆ పగ్గాలు ఆల్‌రౌండర్ హర్దిక్ పాండ్యాకు అప్పజెబుతారని, జట్టులో అంతకు మించిన సమర్థుడు లేడని అభిమానులు అనుకున్నారు. అయితే, వారి అంచనాలను కోచ్ గౌతం గంభీర్ తలకిందులు చేశాడు. శ్రీలంక పర్యటనకు భారత జట్టును ఎంపిక చేసిన అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ అనూహ్యంగా సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్‌గా, శుభమన్‌గిల్‌ను వైస్ కెప్టెన్‌గా ప్రకటించింది. ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడంలో తరచూ విఫలమవుతున్న హార్దిక్ పాండ్యా విషయంలో గంభీర్ కన్విన్స్ కాలేకపోయాడని నివేదికలు చెబుతున్నాయి. అందుకనే అతడిని పక్కనపెట్టి సూర్యకుమార్ యాదవ్‌ను కోరుకున్నట్టు తెలిసింది. అంతేకాదు, ఈ విషయంలో అజిత్ అగార్కర్ పాత్ర కూడా ఉన్నట్టు సమాచారం. కోచ్‌గా గంభీర్ రాకతో పాండ్యా కెప్టెన్సీ అవకాశాలు దారుణంగా దెబ్బ తిన్నాయి. రోహిత్ తర్వాత జట్టులో కెప్టెన్సీ చేపట్టే సామర్థ్యం అతడికే ఉందని అభిమానులు భావించారు. అయితే, అతడికి సారథిగా ఉండేందుకు అవసరమైన సమర్థత ఉందని అజిత్ అగార్క్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ విశ్వసించలేకపోయిందని తెలిసింది.




# హార్దిక్ పాండ్యా కోపంపై మహ్మద్ షమీ ఆసక్తికర వ్యాఖ్యలు

**విశ్వంభర, స్పోర్ట్స్ :**

వన్డే వరల్డ్ కప్ 2023 తర్వాత చీలమండ గాయం కారణంగా క్రికెట్‌కు దూరమై... శస్త్రచికిత్స చేయించుకున్న స్టార్ పేసర్ మహ్మద్ షమీ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో పాపులర్ యూట్యూబర్ శుభంకర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో షమీ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్ సీజన్2022లో తాను ఓ క్యాచ్ పట్టడంలో విఫలం కాగా, నాటి గుజరాత్ టైటాన్స్ కెప్టెన్‌గా ఉన్న హార్దిక్ పాండ్యా తనపై కోప్పడడం పట్ల షమీ స్పందించాడు. "నేను సాధారణంగా ఇలాంటి ఘటనల విషయంలో స్పందించను. కానీ మరీ ఇబ్బంది పెట్టే విషయాలైతే మాట్లాడతాను. పాండ్యాకు, నాకు మధ్య మంచి అనుబంధం ఉంది. ఇద్దరం స్నేహితులం. అయితే మ్యాచ్ ఆడుతున్న సమయంలో అవేమీ గుర్తురావు. ఆ విషయం ఇద్దరికీ తెలుసు. దాదాపు 10 ఏళ్లుగా ఒకరికొకరం తెలుసు. క్యాచ్ విషయంలో నేను ఏమన్నానో కూడా నాకు గుర్తులేదు... ప్రమాణం చేసి చెబుతున్నా అని పాండ్యా నాతో చెప్పాడు. అయితే కోట్లాది మంది క్రికెట్ అభిమానులు టీవీలలో మమ్మల్ని చూస్తుంటారు. కాబట్టి అలాంటి భావోద్వేగాలను అదుపు చేసుకోవాలి" అని షమీ పేర్కొన్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2022 సీజన్‌లో షమీ, పాండ్యా ఇద్దరూ గుజరాత్ టైటాన్స్‌కు ఆడగా.. ఒక మ్యాచ్‌లో తన బౌలింగ్‌లో షమీ క్యాచ్ పట్టకపోవడంతో పాండ్యా ఆగ్రహానికి గురయ్యాడు. మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌కు వికెట్ అవసరమైన కీలక దశలో థర్డ్ మ్యాన్ దిశలో ఫీల్డింగ్ చేస్తున్న షమీ క్యాచ్‌ను ఒడిసిపట్టకపోవడమే పాండ్యా కోపానికి కారణమైంది. దీంతో పాండ్యా ఒక్కసారిగా షమీపై కోపంతో అరిచాడు. సరిగ్గా ప్రయత్నించలేదనే ఉద్దేశంతో అసహనం వ్యక్తం చేశాడు.

# వామ్మో.. 5 మ్యాచ్‌ల్లో 4 సెంచరీలు

**విశ్వంభర, స్పోర్ట్స్ :** శ్రీలంక పర్యటనలో టీ20 మ్యాచ్‌ల తర్వాత భారత జట్టు ఆగస్టు 2 నుంచి 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను ఆడాల్సి ఉంది. ఈ సిరీస్‌లోని అన్ని మ్యాచ్‌లు కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో జరుగుతాయి. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి అనుభవజ్ఞులైన బ్యాట్స్‌మెన్స్ కూడా ఇందులో ఆడతారు. కొలంబో వేదికగా జరగనున్న సిరీస్‌లో ఆతిథ్య జట్టుపై భారత జట్టు పటిష్ట ప్రదర్శన కనబరుస్తోంది.కొలంబోలో విరాట్ కోహ్లీ ఇప్పటి వరకు ఆడిన రికార్డులు చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ముఖ్యంగా వన్డే క్రికెట్‌లో విరాట్ కోహ్లీ గణాంకాలు అందరినీ ఆకట్టుకుంటాయి. విరాట్ కోహ్లీ 2008 నుంచి ఈ మైదానంలో 11 ODI మ్యాచ్‌లు ఆడాడు. 10 ఇన్నింగ్స్‌లలో 107.33 సగటు, 644 పరుగులు చేశాడు. ఈ సమయంలో విరాట్ కోహ్లీ 4 సెంచరీలు, 1 అర్ధ సెంచరీని సాధించాడు. అయితే, కొలంబోలో అతని చివరి 5 వన్డే ఇన్నింగ్స్‌లను పరిశీలిస్తే, అతని గణాంకాలు మరింత మెరుగ్గా ఉండటం శ్రీలంకకు ఆందోళన కలిగించే అంశం.కొలంబోలో జరిగిన చివరి 5 వన్డే ఇన్నింగ్స్‌ల్లో వరుసగా 4 సెంచరీలు బాదిన విరాట్ కోహ్లీ..కొలంబో వేదికగా శ్రీలంకతో జరిగిన చివరి 5 వన్డేల్లో విరాట్ కోహ్లీ అద్భుత ప్రదర్శన చేశాడు. అందువల్ల, శ్రీలంకతో వన్డే సిరీస్‌లో అతను తన జట్టుకు చాలా ముఖ్యమైన బ్యాట్స్‌మెన్‌గా ఉంటాడనడంలో ఎలాంటి సందేహం లేదు. కొలంబోలో కోహ్లీ తన చివరి 5 ఇన్నింగ్స్‌లలో 131 పరుగుల అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడాడు. 247 స్ట్రైక్‌రేట్‌తో 494 పరుగులు చేశాడు. ఈ సమయంలో విరాట్ కోహ్లీ 3 సార్లు నాటౌట్‌గా నిలిచాడు. కింగ్ కోహ్లీకి కొలంబో మైదానం అంటే చాలా ఇష్టం. ఇక్కడ అతను సాధించిన సెంచరీలు వరుస మ్యాచ్‌లలో వచ్చాయి. అయితే, గత రెండు మ్యాచ్‌ల్లో కోహ్లీ ఒక్క మ్యాచ్‌లో బ్యాటింగ్‌కు రాకపోగా, ఒక మ్యాచ్‌లో సింగిల్ డిజిట్ స్కోరు వద్ద ఔటయ్యాడు. అతను ఇక్కడ చివరి 5 వన్డే ఇన్నింగ్స్‌లలో వరుసగా 128*, 131, 110*, 122*, 3 పరుగులు చేశాడు. బ్యాటింగ్‌కు ఈ మైదానం అంటే చాలా ఇష్టమని అతని గణాంకాలు చెబుతున్నాయి.ఇలాంటి పరిస్థితుల్లో వచ్చే వన్డే సిరీస్‌లో విరాట్ కోహ్లీ నుంచి భారీ ఇన్నింగ్స్ ఆడుతుందని టీమిండియా, అభిమానులు ఎదురు చూస్తున్నారు. 2023 ప్రపంచ కప్ సందర్భంగా కోహ్లీ చివరిసారి వన్డే మ్యాచ్‌లు ఆడాడు. అతని బ్యాట్ చాలా బాగా ఆడింది. అదే సమయంలో వన్డేల్లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు.

# ధోనీ స్థానాన్ని రిషబ్ పంత్‌తో భర్తీ చేయనున్న సీఎస్కే?




**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఐపీఎల్‌లో మహేంద్ర సింగ్ ధోనీ కొనసాగడం సందేహంగా మారింది. ఈ ఏడాదే ధోనీ రిటైర్‌మెంట్ ప్రకటించొచ్చన్న అంచనాలు వెలువడినా, సీజన్ చివర్లో ఇందుకు సంబంధించి ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. అయితే, వచ్చే సీజన్‌లో ధోనీ ఆడటం అనుమానమేనని తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా ఉన్న రిషబ్ పంత్ వచ్చే సీజన్‌కు సీఎస్‌కేకు మారనున్నట్టు సమాచారం. ధోనీ స్థానాన్ని పంత్‌తో భర్తీ చేయాలని సీఎస్‌కే చూస్తోందట. ధోనీ వచ్చే ఏడాది ఆడతాడో లేదో కానీ పంత్ మాత్రం ఢిల్లీని వీడి సీఎస్‌కేతో కలవడం ఖాయమని అంటున్నారు. మరోవైపు, లఖ్‌నవూ కెప్టెన్ కేఎల్ రాహుల్.. ఆ జట్టుకు గుడ్‌బై చెప్పి బెంగళూరులో చేరనున్నాడట. గత సీజన్లో లఖ్‌నవూ యజమాని, రాహుల్‌ను బహిరంగంగా తిడుతున్నట్టు కనిపించిన వీడియో దుమారం రేపిన విషయం తెలిసిందే.

# మహిళల టీ20లో తొలిసారి 200 పరుగులు దాటిన టీమిండియా స్కోరు



**విశ్వంభర, స్పోర్ట్స్ :** మహిళల టీ20లో టీమిండియా స్కోరు తొలిసారి 200 పరుగులు దాటింది. మహిళల ఆసియా కప్ టీ20లో ఇవాళ టీమిండియా యూఏఈ మధ్య మ్యాచ్ జరిగింది. 78 పరుగుల తేడాతో టీమిండియా విజయం సాధించింది.టాస్ ఓడిన భారత్ మొదట బ్యాటింగ్ చేసింది. 20 ఓవర్లలో 201/5 స్కోరు చేసింది. భారీ టార్గెట్ తో బ్యాటింగ్ కి దిగిన యూఏఈ ఏ మాత్రం రాణించలేకపోయింది. 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. ఈషా 38, కవిషా 40 (నాటౌట్), తీర్థ సతీశ్ 4, రినిత 7, సమైరా 5, ఖుషీ 10, హీనా 8 పరుగులు చేశారు. టీమిండియా బౌలర్లలో దీప్తి 2 వికెట్లు తీయగా, రేణుక, తనుజా, పుజా, రాధా ఒక్కో వికెట్ చొప్పున తీశారు. భారత బ్యాటర్లలో హర్మన్‌ప్రీత్ 66, రిచా 64 (నాటౌట్), షఫాలీ వర్మ 37, స్మృతి మంధాన 13, జెమీమా 14 పరుగులు చేశారు. యూఏఈ మహిళ జట్టు బౌలర్లలో కవిషా 2 వికెట్లు తీయగా, సమైరా, హీనాకు ఒక్కో వికెట్ చొప్పున దక్కింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రిచా ఘోష్‌కు దక్కింది.

# ఐటీ కంపెనీల దుర్మార్గం.. కర్ణాటకలో టెక్కీలకు 14 గంటల పని వేళలు

**విశ్వంభర, బిజినెస్:** కర్ణాటకలో జరుగుతున్న వరుస పరిణామాలు అక్కడ పనిచేస్తున్న టెక్కీలకు ఊపిరాడకుండా చేస్తున్నాయి. గడచిన వారంలో కర్ణాటక ప్రభుత్వం స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలంటూ చేసిన చట్టంపై అనేక పరిశ్రమలకు చెందిన ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రధానంగా ఐటీ రంగంలో పనిచేస్తున్న టెక్కీలు ఆందోళన చెందిన సంగతి తెలిసిందే. దీంతో తాత్కాలికంగా ప్రభుత్వం వెనక్కి తగ్గింది. అయితే ఇప్పుడు కర్ణాటకలో పనిచేస్తున్న ఉద్యోగుల మెడకు కొత్త సమస్య చుట్టుకుంది. ఉద్యోగుల పని వేళలను 14 గంటలకు పొడిగించాలని డిమాండ్ చేస్తూ కర్ణాటకలోని ఐటీ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనను సమర్పించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ చర్య ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఈ చర్య తమ ఆరోగ్యాన్ని క్షీణింపచేయటంతో పాటు లేఆఫ్స్ కు దారితీస్తుందని టెక్కీలు ఆవేదన చెందుతున్నారు. ఇది అమానుషంగా వారు భావిస్తున్నారు. మూలాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక షాప్స్ అండ్ కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 1961ని సవరించడాన్ని పరిశీలిస్తోంది. ఈ క్రమంలో ఐటి కంపెనీలు తమ ప్రతిపాదనను సవరణలో చేర్చాలని కోరుతున్నాయి. ఇది చట్టబద్ధంగా పని గంటలను 14 గంటలకు పొడిగిస్తుందని సమాచారం. 14 గంటల పని వేళలో 12 గంటల పనిసమయంతో పాటు 2 గంటల ఓవర్‌టైమ్ ఉండనుందని తెలుస్తోంది. అయితే ప్రస్తుతం కార్మిక చట్టాల్లోని 12 గంటల్లో 10 గంటలు పని సమయంగా ఉండగా 2 గంటలు ఓవర్ టైమ్ వేళలు అమలులో ఉన్నాయి. IT రంగం కొత్త ప్రతిపాదన ప్రకారం IT/ITeS/



BPO రంగంలోని ఉద్యోగులు రోజుకు 12 గంటల కంటే ఎక్కువ పని చేయవలసి ఉంటుంది. మూడు నిరంతర నెలల్లో 125 గంటలకు మించకూడదు. ఈ విషయంపై ప్రభుత్వం ప్రాథమిక సమావేశం నిర్వహించిందని, ఈ ప్రతిపాదనలపై నిర్ణయాలు త్వరలో తీసుకోనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అలాగే దీనిపై మంత్రివర్గ సమావేశంలో సైతం చర్చ జరిగే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. భారతదేశ టెక్ పరిశ్రమలో సిలికాన్ వ్యాలీగా పేరొందిన కర్ణాటక బెంగళూరు నగరం ప్రస్తుతం పెద్ద కుదుపులకు గురవుతోంది. పని గంటల పొడిగింపు చర్యకు కర్ణాటక రాష్ట్ర IT/ITeS ఉద్యోగుల సంఘం(KITU) నుంచి గట్టి ప్రతిఘటన ఎదురైంది. వర్కింగ్ షిఫ్టుల సంఖ్యను తగ్గించడం వల్ల మూడింట ఒక వంతు మంది శ్రామికశక్తికి దూరంగా ఉంటారని హెచ్చరిస్తూ యూనియన్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఐటీ ఉద్యోగుల్లో పని గంటలు పొడిగించడం వల్ల కలిగే ఆరోగ్య ప్రభావాలపై అధ్యయనాలను యూనియన్ ఎత్తి చూపింది. అలాగే ఐటీ రంగంలోని 45% మంది ఉద్యోగులు డిప్రెషన్, 55% మంది శారీరక ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు నివేదించింది. ఒకవేళ పనిగంటలు పొడిగిస్తే ఈ పరిస్థితి మరింత దిగజారుతుందని కర్ణాటక చాంబర్ ఆఫ్ కామర్స్ ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో ఉద్యోగులను మనుషులుగా కాకుండా యంత్రాలుగా చూస్తున్నారని ఉద్యోగుల సంఘం ఆరోపిస్తూ, ఐటీ సంస్థల డిమాండ్‌ను అమలు చేయకుండా సిద్ధరామయ్య ప్రభుత్వం పునరాలోచించాలని కర్ణాటక చాంబర్ ఆఫ్ కామర్స్ కోరింది.

# ఓలా కంపెనీకి వినియోగదారుల కమిషన్ భారీగా జరిమానా విధింపు

**విశ్వంభర, బిజినెస్:** భారతదేశంలో ఇటీవల కాలంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం తారాస్థాయికు చేరింది. దేశంలో ఎన్ని కంపెనీల ఈవీ స్కూటర్లు ఉన్నా ఓలా ఈవీ స్కూటర్లకు ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఉంది. అందువల్ల దేశంలో అత్యధిక ఈవీ స్కూటర్లు అమ్మిన కంపెనీగా ఓలా రికార్డు సృష్టించింది. అయితే ఇంతటి మంచి పేరు ఉన్న ఓలా కంపెనీలు వినియోగదారుల కమిషన్ షాక్ ఇచ్చింది. ఓలా ఎలక్ట్రిక్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు బెంగుళూరులోని వినియోగదారుల న్యాయస్థానం ఇటీవల 1.94 లక్షల రూపాయల జరిమానా విధించింది. జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ జూలై 10న ఈ మేరకు తీర్పు వెలువరించిం. ఫిర్యాదుదారు చెల్లించిన తేదీ నుంచి మొత్తం చెల్లింపు జరిగే వరకు సంవత్సరానికి 6 శాతం వడ్డీతో రూ. 1.62 లక్షలను వాపసు చేయాలని ఓలా ఎలక్ట్రిక్‌ని ఆదేశించింది. ఫిర్యాదుదారుని మానసిక వేదన, కష్టాలకు పరిహారంగా రూ.20వేలు, వ్యాజ్యానికి అయ్యే ఖర్చు రూ.10వేలు చెల్లించాలని ఓలాను ఆదేశించింది. అసలు ఓలా కంపెనీపై వినియోగదారుడు ఏ కంప్లైంట్ చేశాడు? ఎందుకు వినియోగదారుల కమిషన్ ఓలా కంపెనీకు జరిమానా విధించిందో? ఓ సారి తెలుసుకుందాం.బెంగళూరులోని ఆర్‌టి నగర్‌కు చెందిన నిషాద్ అనే వ్యక్తి ఫిర్యాదులో ఓలా డ్యామేజ్‌డ్ వాహనాన్ని డెలివరీ చేసిందని, అయితే దానిని రిపేర్ చేయడం లేదని, అలాగే రిప్లేస్ చేయడానికి కూడా నిరాకరిస్తుందని వినియోగదారుల



కమిషన్‌ను ఆశ్రయించాడు. తాను డిసెంబర్ 12, 2023న ఓలా ఎస్ 1 ప్రోను కొనుగోలు చేశాని, షోరూమ్ ధర రూ. 1.47 లక్షలతో పాటు రిజిస్ట్రేషన్, ఇతర ఛార్జీల కోసం రూ. 16,000 చెల్లించానని తెలిపాడు. ఈ ఏడాది జనవరిలో డెలివరీ సమయంలో వాహనం వెనుక ఎగువ ప్యానెల్ దెబ్బతిన్నట్లు గమనించి ఓలా షోరూమ్ దృష్టికి తీసుకెళ్లాడు. అయితే ఆ కంపెనీ ప్రతినిధులు "రియర్ అప్పర్ ప్యానెల్ డ్యామేజ్‌గా నమోదు చేశారు. అయితే వాహనం డెలివరీ తీసుకున్న తర్వాత నిషాద్ చేయని హారన్, ప్యానెల్ బోర్డ్ డిస్‌ప్లే వంటి ఇతర లోపాలను కూడా గమనించాడు. జనవరి 23న సమస్యను ఓలా షోరూమ్‌కు నివేదించాడు. అయినా ఓలా షోరూమ్ ప్రతినిధులు ఎలాంటి స్పందన ఇవ్వలేదు. బాధితుడి ఫిర్యాదుపై బెంగళూరులోని 4వ అదనపు జిల్లా ఫోరం ప్రెసిడెంట్ ఎంఎస్ రామచంద్ర మాట్లాడుతూ ఫిర్యాదుదారుకి 22.01.2024న డెలివరీ చేసిన కొత్త వాహనం ప్యానెల్ బోర్డ్ డిస్‌ప్లే వంటి అనేక సమస్యలను అభివృద్ధి చేసినట్లు ఫిర్యాదు విషయాలను కమిషన్ పరిశీలించిందని పేర్కొన్నారు. పనితీరు, హారన్ వైఫల్యం, వాహనం డెలివరీ సమయంలో ఎగువ ప్యానెల్‌కు నష్టం జరిగినా ఓలా సరిగ్గా స్పందించలేదని, ఫిర్యాదుదారు లీగల్ నోటీసు పంపినా ఎలాంటి స్పందనా లేదని అలాగే వినియోగదారుల కమిషన్ నోటీసు జారీ చేసినా ఓలా ప్రతినిధులు కమిషన్ ముందు హాజరుకాకపోవడం జరిమానా విధించినట్లు తెలిపారు.

# కొత్తగా బీఎస్ఎన్ఎల్ 13 నెలల ప్లాన్.. హడలిపోతున్న జియో, విఐ, ఎయిర్‌టెల్..

**విశ్వంభర, బిజినెస్:** ప్రస్తుతం ఇంటర్నెట్‌లో ఏం జరుగుతోందంటే బీఎస్ఎన్ఎల్ హవా నడుస్తోందని తెలుస్తోంది. ఇటీవల ప్రైవేటు టెలికాం ఆపరేటర్లు తమ టారిఫ్ రేట్లను పెంచటంతో వినియోగదారులు ఆగ్రహంతో ఉన్నారు. ఇప్పటికే దేశీయంగా బీఎస్ఎన్ఎల్ బలోపేతానికి టాటా గ్రూప్ కంపెనీ టీసీఎస్ సహకారాన్ని అందిస్తోంది. దేశవ్యాప్తంగా కంపెనీ కోసం 4జీ సాంకేతికతను సంసిద్ధం చేస్తోంది. మరోపక్క ప్రైవేటు ఆటగాళ్లతో పోటీపడటంలో తగ్గేదే లే అన్నట్లుగా కొత్త రీఛార్జ్ ప్లాన్లను ప్రభుత్వ టెలికాం సంస్థ ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో చాలా మంది బీఎస్ఎన్ఎల్ సిమ్ కొనుగోలుకు క్యూ కడుతున్నారు. తాజాగా కొత్త వినియోగదారులను ఆకర్షించేందుకు బీఎస్ఎన్ఎల్ 13 నెలల కాలపరిమితితో 395 రోజుల వ్యాలిడిటీ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఈ ప్లాన్ ప్రయోజనాలను పరిశీలిస్తే.. ముందుగా బీఎస్ఎన్ఎల్ ప్లాన్ ధరను రూ.2,399గా ప్రకటించింది. దీనికి సగటున నెలకు ధర రూ.190గా ఉంది. అలాగే ప్లాన్ కింద వినియోగదారులు రోజుకు 2జీబీ డేటాను అందిస్తోంది. అలాగే రోజుకు 100 ఎస్ఎంఎస్‌లను అందించటంతో పాటు అపరిమిత కాలింగ్ సౌకర్యాన్ని అందిస్తోంది. దేశవ్యాప్తంగా ఉచిత రోమింగ్ అందిస్తున్న ప్లాన్.. జింగ్ మ్యూజిక్, బీఎస్ఎన్ఎల్ ట్యూన్స్, హార్డీ గేమ్స్, ఛాలెంజర్ అరీనా గేమ్స్, గేమ్‌ఆన్ ఆస్ట్రోటెల్ ప్రయోజనాలను బండిల్ చేస్తోంది. బీఎస్ఎన్ఎల్ 365 రోజుల ప్లాన్ వివరాలు ఇవే.. టెలికాం వినియోగదారులను ఆకర్షిస్తున్న మరో ప్లాన్ 365 రోజుల వ్యాలిడిటీని కలిగి ఉంది. ఈ ప్లాన్ వినియోగదారులకు ఎలాంటి రోజువారీ పరిమితి లేకుండా 600జీబీ డేటా లభిస్తుంది. రోజుకు 100 ఎసెమ్మెస్‌లు, అపరిమిత కాలింగ్ సౌకర్యాన్ని అందిస్తోంది.

# ఫ్లిప్‌కార్ట్‌తో జతకట్టిన బజాజ్ కంపెనీ

**విశ్వంభర, బిజినెస్:** భారతదేశంలో ఇటీవల కాలంలో ఈకామర్స్ సైట్స్ ద్వారా అమ్మకాలు బాగా పెరిగాయి. ఈకామర్స్ సైట్స్ అయిన అమెజాన్, ఫ్లిప్ కార్ట్ ప్రత్యేక ఆఫర్లతో సేల్స్ డేస్‌ను నిర్వహించడంతో వినియోగదారులు ఆన్‌లైన్ షాపింగ్‌ను ఇష్టపడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు కూడా డెలివరీ నెట్‌వర్క్‌ను విస్తరించడంతో అమ్మకాలు తారాస్థాయికు చేరాయి. తాజాగా ప్రముఖ కంపెనీ అయిన బజాజ్ ఆటో భారతీయ ఈకామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌తో కలిసి పనిచేసినట్లు ప్రకటించింది. ఫలితంగా బజాజ్ మోటార్‌సైకిళ్ల మొత్తం శ్రేణి ఇప్పుడు ఫ్లిప్‌కార్ట్‌లో ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయడానికి అందుబాటులో ఉంటాయి. ప్రారంభ దశలో ఈ సదుపాయం భారతదేశంలోని 25 నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉంది, అయితే కంపెనీ క్రమంగా దాని పరిధిని విస్తరించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో బజాజ్ బైక్ ఆన్‌లైన్ డెలివరీ గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం.

**తక్కువ ధరకే బజాజ్ బైక్స్**

ఫ్లిప్‌కార్ట్ కూడా ఇకపై వినియోగదారులు ఎలాంటి శ్రమ లేకుండా తక్కువ ధరకే బజాజ్ బైక్స్‌ను అందిస్తామని ప్రకటించింది. అయితే ఆన్‌లైన్ విక్రయాలను పెంచేందుకు బజాజ్ ఇప్పటికే ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. రూ.5,000 తక్షణ తగ్గింపుతో పాటు 12 నెలల నోకాస్ట్ ఈఎంఐ, బ్యాంకు కార్డుల ఆఫర్లను అందిస్తుంది. బజాజ్ ప్రస్తుత పోర్ట్‌ఫోలియోలో భారతదేశంలో వివిధ రకాల ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. ప్రపంచంలోనే మొట్టమొదటి సీఎన్‌జీతో నడిచే మోటార్‌సైకిల్ ఫ్రీడమ్‌ను ఇటీవల బజాజ్ విడుదల చేసింది. బజాజ్ లైనప్‌లోని ఇతర బైక్‌లలో ప్లాటినా 100 నుంచి డొమినార్ 400, పల్సర్ ఎన్ఎస్ 400 జెడ్ వంటి పెర్ఫార్మెన్స్ మోటార్‌సైకిళ్లు వంటి సరసమైన ధరలక ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉండనున్నాయి. అలాగే బజాజ్ కంపెనీకు చెందిన ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఫ్లిప్ కార్ట్‌లో విక్రయించనుంది.

# ప్రాజెక్ట్ మొదలయ్యే దాకా డౌట్లు తప్పవా?

**విశ్వంభర, సినిమా:** సినిమాలో తను తెసుకునే రెమ్యునరేషన్ కి పూర్తి స్థాయిలో న్యాయం చేసే హీరోయిన్స్ లో బుట్ట బొమ్మ పూజా హెగ్దే ఒకరు. అమ్మడు సినిమాలో ఉంది అంటే గ్లామర్ విషయంలో ఎలాంటి ఢోకా లేదని అనిపిస్తుంది. చేసేది ఎలాంటి పాత్ర అయినా పూజా బేబీ చేసే థై షో కుర్రాళ్లకు సూపర్ కిక్ ఇస్తుంది. తెలుగులో చేసిన ఫస్ట్ రెండు సినిమాలు పెద్దగా ఆడకపోయినా అల్లు అర్జున్ తో చేసిన దువ్వాడ జగన్నాథం తో అమ్మడు పాపులారిటీ సంపాదించింది. అప్పటి నుంచి రాధే శ్యాం వరకు వరుసగా స్టార్ సినిమాల్లో నటిస్తూ సత్తా చాటింది. ఐతే రాధే శ్యాం సూపర్ హిట్ అయితే ఏమో కానీ అది నిరాశ పరచడం అమ్మడి కెరీర్ మీద ఎఫెక్ట్ పడేసింది. అటు తమిళ్ లోనూ బీస్ట్ దెబ్బ కొట్టింది. అందుకే పూజాకి ఆఫర్లు కరువయ్యాయి. తాజాగా పూజా సినిమా న్యూస్ లు అన్నీ ఒకటి అంటే మరోటి జరుగుతుంది. అందుకే చైతన్య సినిమా మొదలయ్యే దాకా పూజాని కన్ఫర్మ్ అని చెప్పడం కష్టం. ఈసారి ఛాన్స్ వస్తే మాత్రం అటు యాక్టింగ్ తోనే కాదు గ్లామర్ షోలో కూడా పూజా బేబీ అదరగొట్టాలని చూస్తుంది. ఇక ఈమధ్యనే సూర్య 44వ సినిమాలో ఛాన్స్ అందుకుంది పూజా హెగ్దే. దీనితో పాటు హిందీలో కూడా ఒక సినిమా చేస్తుంది. తెలుగులో తిరిగి పూజా ఫాం లోకి వస్తే మాత్రం అమ్మడి ఫ్యాన్స్ కి పండగే అని చెప్పొచ్చు. బుట్ట బొమ్మ సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చినా తన ఫోటో షూట్స్ తో మాత్రం కావాల్సినంత ఎంటర్టైన్మెంట్ అందిస్తుంది. పూజా ఫోటో షూట్స్ ఆమె అభిమానులకు కన్నుల విందు కలిగిస్తుంది.





# స్టార్ హీరో చెల్లి.. స్టార్ విలన్ కూతురు

విశ్వంభర, సినిమా: ఇటీవల బాలీవుడ్ లో వారసులు, వారసురాళ్లు అందరూ సినిమాల్లోకి వస్తున్న సంగతి తెలిసిందే. చాలా మంది స్టార్ నటీనటుల కూతుళ్లు, కొడుకులు సినిమాలోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ఇంకో పేరు వినిపిస్తుంది. బాలీవుడ్ లో ఒకప్పుడు హీరోగా ఆ తర్వాత విలన్ గా స్టార్ డమ్ తెచ్చుకున్నాడు జాకీ ష్రాఫ్. తెలుగులో కూడా పంజా, శక్తి, సాహోతో పాటు పలు సినిమాల్లో నటించాడు. జాకీ ష్రాఫ్ కొడుకు టైగర్ ష్రాఫ్ ఆల్రెడీ బాలీవుడ్ లో స్టార్ హీరోగా దూకుసుకుపోతున్నాడు.అయితే ఇప్పుడు జాకీ ష్రాఫ్ కూతురు, టైగర్ ష్రాఫ్ చెల్లి కృష్ణ ష్రాఫ్ వైరల్ అవుతుంది. ఇప్పటికే కృష్ణ ష్రాఫ్ బిజినెస్ చేస్తూ, టీవీలో పలు షోలలో కనిపించి పాపులర్ అయింది. ఇక సోషల్ మీడియాలో రెగ్యులర్ గా హాట్ హాట్ ఫొటోలతో ఇప్పటికే బోల్డంతమంది ఫాలోవర్స్ ని సాధించింది. కృష్ణ ష్రాఫ్ బాస్కెట్ బాల్ ప్లేయర్ కూడా. అలాగే ఫిట్నెస్, జిమ్ కి సంబంధించిన బిజినెస్ లు చేస్తుంది. ఇప్పటికే పలు బిజినెస్ అవార్డులు కూడా అందుకుంది కృష్ణ.అయితే సోషల్ మీడియాలో ఈ అమ్మడు పెట్టే హాట్ హాట్ ఫోటోలు చూసి అన్న, నాన్న లాగే సినిమాల్లోకి వస్తుందా? హీరోయిన్ అవుతుందా అని చర్చించుకుంటున్నారు. కృష్ణ ష్రాఫ్ హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయనే అంటున్నారు. మరి ఈ అమ్మడికి బాలీవుడ్ లో ఏ నిర్మాత, దర్శకుడు ఛాన్స్ ఇస్తాడో చూడాలి. హీరోయిన్ అవ్వకుండానే స్టార్ డమ్ తెచ్చుకుంటుంది కృష్ణ ష్రాఫ్.

విశ్వంభర, సినిమా: సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఈ పేరు చెప్పగానే ఎంతో మంది కళ్లు చెమ్మగిల్లకమానవు. ఈ హీరో మృతి తర్వాత బాలీవుడ్ ఇండస్ట్రీలోని పలు చిత్రాలను బ్యాన్ చేశారు. ముఖ్యంగా సుశాంత్ ప్రేయసి రియా చక్రవర్తిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. రియా చక్రవర్తి వల్లే సుశాంత్ ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈకేసులో ఆమె కొన్నాళ్లపాటు జైలు జీవితం గడిపారు. ఈఘటనతో రియా సినిమాలకు దూరమైంది. ఆమె బయట ఎక్కడ కనిపించినా లెక్కలేనన్ని మాటలు అన్నారు. ఇక ఇప్పుడిప్పుడే సోషల్ మీడియాలో యాక్టివ్ అవుతున్న రియా.. తాజాగా తన లైఫ్ గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. సినిమాలు లేకపోవడంతో తన సంపాదన గురించి అనేక రకాలుగా మాట్లాడుకుంటున్నారని.. కొందరు ఆమె చేతబడి చేస్తుందని అన్నారని చెప్పకొచ్చింది. "ఇప్పుడు నేనేం చేస్తున్నాను.. నా జీవనాధారం ఏంటని కొందరు అడుగుతున్నారు. కొన్నాళ్లుగా నేను సినిమాలు చేయడం లేదు. కానీ మోటివేషనల్ స్పీకర్ గా మారి డబ్బులు సంపాదిస్తున్నాను. నా జీవితంలో ఇది రెండో చాప్టర్. గతంలో ఏం జరిగిందో.. ఎంత బాధ అనుభవించానో నాకు మాత్రమే తెలుసు. ఎవరికి వాళ్లు ఏదేదో ఊహించుకుని నా గురించి అన్ని తెలిసినట్లు విమర్శలు చేస్తున్నారు. కొందరు నేను చేతబడి చేశానని అన్నారు. ఎవరికి నచ్చినా నచ్చకపోయినా నిజాయితీగా ఉన్నా ధైర్యంగా ముందుకు వెళ్తున్నాను" అంటూ చెప్పకొచ్చింది.

# సినిమాలు లేవుగా సంపాదన ఎలా?

## చేతబడి చేస్తుందన్నారు



# జిమ్‌లో సితార పాప ఏ రేంజ్‌లో కష్టపడుతుందో..



**విశ్వంభర, సినిమా:** మహేష్ కూతురు సితార అందరికి పరిచయమే. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా యాక్టివ్ గా ఉంటూ ఫోటోలు పోస్ట్ చేస్తూ వైరల్ అవుతూ ఉంటుంది. ఇప్పుడే యాడ్స్ లో నటిస్తూ, సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందుతుంది సితార. ఇక సితార ఫోటోలు షేర్ చేసిందంటే అవి వైరల్ అవ్వాల్సిందే. నిన్న జులై 20 సితార పుట్టిన రోజు కావడంతో సెలబ్రిటీలు, మహేష్ అభిమానులు, నెటిజన్లు శుభాకాంక్షలు తెలిపారు. ఇక సితార ఇంట్లోనే ఫ్యామిలీతో తన బర్త్ డే సెలబ్రేషన్స్ చేసింది. అయితే సితార ఈ ఏజ్ లోనే జిమ్ లో చాలా కష్టపడుతుంది. నిన్న సితార పుట్టిన రోజు కావడంతో తన జిమ్ ట్రైనర్ సితార జిమ్ లో యోగాసనాలు చేస్తున్న ఫోటోలు షేర్ చేసి విషెష్ చెప్పింది. దీంతో సితార జిమ్ లో కష్టపడుతున్న ఈ ఫోటోలు వైరల్ గా మారాయి. ఇవి చూసి ఈ ఏజ్ లోనే సితార జిమ్ లో ఇంత కష్టపడుతుంది అని అభినందిస్తున్నారు.

# రఘుతాత కాంట్రవర్సీపై స్పందించిన కీర్తి సురేష్

**విశ్వంభర, సినిమా:** టాలీవుడ్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్లలో కీర్తి సురేష్ ఒకరు. తెలుగు, తమిళం భాషలలో వరుస సినిమాలతో బిజీగా ఉన్న కీర్తి.. ప్రస్తుతం హిందీలో బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంటుంది. ప్రస్తుతం బీటౌన్ హీరో వరుణ్ ధావన్ సరసన ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే.తాజాగా రాఘుతాత మూవీ కాంట్రవర్సీ పై స్పందించింది. కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ సినిమాకు సుమన్ కుమార్ దర్శకత్వం వహించారు. ఆగస్ట్ 15న ఈ సినిమా విడుదల కానుంది.



ఈ క్రమంలోనే తాజాగా జరిగిన ఆడియో విడుదల కార్యక్రమంలో పాల్గొన్న కీర్తి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. రఘుతాత సినిమాను విభిన్నమైన కథతో తెరకెక్కించాం. ఒక మహిళ ఎదుర్కొనే సవాళ్ల గురించి మాత్రమే ఇందులో చూపించాం. మంచి సందేశాన్ని ఇవ్వాలనుకున్నాం. సినిమా చూస్తే తప్పకుండా ఈ విషయం మీకు అర్థమవుతుంది. రాజకీయపరమైన వివాదాలు ఏమి లేవు ఇది కామెడీ సినిమా అన్నారు. అలాగే ఈ సినిమాలోని పాటలు తనకు చాలా బాగా నచ్చాయని.. ఈ సినిమా ఆడియో విడుదల కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నానని అన్నారు. ప్రేక్షకులు తప్పకుండా ఈ పాటలకు కనెక్ట్ అవుతారని అన్నారు. ఈ చిత్రాన్ని హోంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. దృఢ సంకల్పం ఉన్న ఓ మహిళ చేసే స్ఫూర్తిదాయకమైన పోరాట కథను ఇందులో చూపించాము. ఇటీవల ఈ సినిమా టీజర్ కూడా విడుదల చేశారు. అందులోని పలు సన్నివేశాలు చర్చనీయాంశంగా మారాయి.

## లేటుగా నిద్రపోతున్నారా అయితే మీకు

# ఈ సమస్యలు తప్పవు

**విశ్వంభర, ఫీచర్ :** ఆహ్లాదకరమైన జీవన శైలి, సమతుల్యమైన ఆహారం శరీర ఆరోగ్యానికి ఎంత ముఖ్యమో కంటి నిండా నిద్ర కూడా మన ఆరోగ్యానికి అంతే ముఖ్యం. నిద్ర లేకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. మీ వయసుకు అనుగుణంగా మీరు ఎన్ని గంటలు నిద్రపోవాలి అన్న విషయం మీకు తెలుసా? అవునండి మీ వయసును పట్టి మీరు నిద్ర పోవాల్సిన సమయం ఉంటుంది.. మరదేమిటో తెలుసుకుందాం పదండి.. నిరంతరం పనిచేసే మన శరీరానికి అవసరమైన విశ్రాంతిని ఇచ్చే ప్రక్రియ నిద్ర. మనం నిద్రపోయే ఈ సమయంలో మన శరీరంలోని వివిధ అవయవాలు తమ శక్తిని పునర్నిర్మించుకుంటాయి. అందుకే నిద్ర మన ఆరోగ్య సంరక్షణలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. రాత్రిపూట సమయానికి నిద్రపోకుండా ఫోన్లో చూస్తూ మేలుకోవడం ఇప్పుడు బాగా అలవాటైపోయింది. అయితే క్రమంగా ఈ అలవాటు మీకు పలు రకాల అనారోగ్య సమస్యలను తెచ్చి పెడుతుంది అంటున్నారు నిపుణులు.

**తగినంత నిద్ర లేకపోతే..**

తగినంత నిద్ర లేకపోతే టైప్ 2 డయాబెటిస్, రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అంతేకాదు నిద్రలేమి సమస్యతో బాధపడే వారికి ఊబకాయం కూడా వస్తుంది. ఎక్కువసేపు నిద్రపోకుండా ఫోన్ చూస్తూ గడిపేవారు క్రమంగా డిప్రెషన్ లోకి వెళ్తారు అని వైద్యులు చెబుతున్నారు.



ప్రస్తుతం ఉన్న బిజీ షెడ్యూల్స్ నేపథ్యంలో అర్ధరాత్రి వరకు మేలుకోవడం ఉదయం ఆలస్యంగా నిద్ర లేవడం ట్రెండ్ గా మారుతుంది. అయితే దీనివల్ల మీకు తెలియకుండా పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. నిద్రలేమి వల్ల అలసట, చికాకు, మానసిక ఒత్తిడి, ఏకాగ్రత లోపించడం సర్వసాధారణం. ముఖ్యంగా పిల్లల ఎదుగుదలకు తగినంత నిద్ర అవసరం. నిద్రలేమి కారణంగా పిల్లలలో పెరుగుదలకు ఆటంకం కలుగుతుంది.

**మీరు ఎంత సేపు నిద్రపోవాలి..**

వయసును పట్టి నిద్రపోయే విధానం ఉంటుంది. పసిపిల్లలు ఎక్కువ సేపు నిద్రపోతారు.. అయితే క్రమంగా పెరిగే కొద్దీ నిద్రను పొందే సామర్థ్యం వయసుతో పాటు తగ్గుతూ వస్తుంది. అప్పుడే పుట్టిన బిడ్డ రోజుకు 11 నుంచి 14 గంటల వరకు నిద్రపోవడం అవసరం. 3 నుంచి 5 సంవత్సరాల మధ్య వయసు ఉన్న పిల్లలు కనీసం 10 గంటలు పడుకోవాలి. స్కూల్ కి వెళ్లే పిల్లలు రోజుకి కనీసం 8 గంటలు కచ్చితంగా పడుకోవాలి. ఇక 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు రోజు 7 నుంచి 9 గంటల పాటు నిద్రించేలా చూసుకోవాలి. 60 సంవత్సరాలు పైబడిన వారు కనీసం 6 గంటలైనా రోజుకు నిద్రపోవాలి. ప్రతి రోజు 9 నుంచి 10 మధ్యలో నిద్రపోవడం తెల్లవారుజామున నిద్రలేయడం మీ దినచర్యలో భాగంగా చేసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మంచిది.

# వయాగ్రా టాబ్లెట్ పుట్టుక వెనుక కథ తెలుసా?

**విశ్వంభర, ఫీచర్ :** అనుకున్నామని జరగవు అన్నీ... అనుకోలేదని ఆగవు కొన్ని! వాస్తవం చెప్పాలంటే వయాగ్రా కూడా ఇలానే పుట్టింది. మరో మందుకోసం ప్రయత్నిస్తుంటే.. మరోచోట రియాక్షన్ వచ్చింది! దీంతో నాడు పరిశోధకులు ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఫలితంగా అంగస్తంభన సమస్యకు ఆమోదం పొందిన మొట్టమొదటి నోటి మాత్ర అంటూ 1998లో అమెరికా, బ్రిటన్ లో వయాగ్రా మార్కెట్లలోకి వచ్చింది. అమ్మకాల్లో చరిత్ర సృష్టించింది!




**బ్రిటన్ లోని కార్మికుల ఇబ్బందులే పునాది**

బ్రిటన్ లోని సౌత్ వేల్స్ లో మెర్తిల్ ట్విడ్ ఫిల్ అనే చిన్న పారిశ్రామిక పట్టణం ఉంది. అక్కడున్న ఒక ఉక్కు పరిశ్రమ మూతపడడంతో స్థానికంగా ఉండే కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారికి రోజువారీ ఆహారం దొరకడం కూడా కష్టమైపోయింది. ఈ సమయంలో వారి ఆర్థిక ఇబ్బందులే వారిని క్లినికల్ గినీ పిగ్స్ గా మార్చేసింది. నాడు వీరు అంగీకరించకపోతే వయాగ్రా పుట్టేదేకాదు అని అన్నా అతిశయోక్తి కాదు! 1990ల ప్రారంభంలో అధిక రక్తపోటు సమస్యకు చెక్ పెట్టేందుకు ఔషధాలు తయారు చేసే ఫైజర్ సంస్థ సిల్డెనాఫిల్ యుకె 92,480 అనే ఒక కాంపౌండ్ ను పరీక్షిస్తోంది. ఈ సమయంలో ఔషధాన్ని పరీక్షించడానికి స్థానిక యువకులను రిక్రూట్ చేసుకున్నారు. ఇందులో భాగంగా 1992లో ఆ కొత్త ఔషధాన్ని పరీక్షించే ప్రక్రియలో పాల్గొనడానికి ఆ పట్టణంలోని కార్మికులు అంగీకరించారు. ఈ సమయంలో ఈ క్లీనికల్ ట్రైల్స్ లో పాల్గొనడానికి వచ్చిన యువకులకు యుకె 92,480 పిల్ ను రోజుకు మూడు సార్లు చొప్పున వరుసగా పది రోజులపాటు వేసుకోవాలని కంపెనీ వాళ్లు చెప్పారు. అందుకు కొంత డబ్బు చెల్లించారు. దానివల్ల వారికి మూడు పూటలా ఆహారంతోపాటు చలి కాచుకోడానికి అవసరమైన బొగ్గు సంచులు కూడా కావాల్సినన్ని దొరికేవి!

**వయాగ్రాకు దారితీసిన సైడ్ ఎఫెక్ట్!**

ఇలా క్లీనికల్ ట్రయల్స్ లో భాగంగా ఆ డ్రగ్ వల్ల యువకుల్లో ఒక అనూహ్యమైన సైడ్ ఎఫెక్ట్ కనిపించింది. అవును... ఈ డ్రగ్ తీసుకోవడం వల్ల అంగస్తంభన మామూలు కంటే కాస్త ఎక్కువగా ఉన్నట్టు అనిపిస్తోందని వాళ్లు వైద్యులకు తెలిపారు. ఇదే సమయంలో ఇంతకు ముందుకంటే ఎక్కువగా అంగం గట్టిపడినట్లు అనిపించిందని వెల్లడించారు. ఈ సైడ్ ఎఫెక్ట్స్ ను గమనించిన ఫైజర్ సంస్థ.. అప్పటికే జరుగుతున్న అధిక రక్తపోటు సంబంధ అధ్యయనంతోపాటూ నపుంసకత్వంపై కూడా రీసెర్చ్ చేయడానికి నిధులు సమకూర్చింది. ఈ క్రమంలో 1994 ప్రాంతంలో స్వాంజీలో తమ తదుపరి క్లినికల్ ట్రయల్స్ నిర్వహించే ముందు అంగస్తంభన సమస్యలు ఉన్న రోగులకు ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించింది. ఇలా స్వాంజీలో జరిగిన అధ్యయనంలో ఫైజర్ సంస్థకు పాజిటివ్ ఫలితాలు కనిపించాయి. దీంతో తమ చేతిలో ఉన్న ఔషధం చరిత్ర సృష్టించబోతోందని వారికి త్వరగానే అర్థమైంది. ఈ సమయంలో ఈ పరీక్షల ఫలితాలు ఎంత పాజిటివ్ గా ఉన్నాయంటే... ట్రయల్స్ లో పాల్గొన్న మగవాళ్లు కొందరు వారికి ఇచ్చిన టాబ్లెట్లను కంపెనీకి తిరిగి ఇవ్వడానికి నిరాకరించారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com